www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 24 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు చైత్ర శుద్ధ దశమి

07-13 ఏప్రిల్ 2025

వెల : ₹20/-



# రేషింబాగ్‌లో భారత ప్రధాని

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# శ్రీరాముడు సాక్షిగా ఉగాది వేడుకలు

మార్చి 30 ఆదివారంనాడు తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన ఆలయంలో శ్రీ విశ్వావసు ఉగాది ఆస్థానం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతం అనంతరం శుద్ధి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణ నడుమ ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం లోపల, బైట చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

**ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..**
**చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో**
**ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రండి..
## జాతీయభావాల వేదిక
## జాగృతి చందాదారులుగా
## చేరుదాం.. చేర్పిద్దాం!




సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

**విడి ప్రతి**
**రూ.20/-**

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : **040-2756 1453, 99599 97013**

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


విదేశీ సిద్ధాంతాల ఆధారంగా పెల్లుబికే ఉద్యమాలను ప్రపంచం చూసింది. ప్రజావాణి ఆధారంగా, మనోభావాల పునాదిగా అంకురించే ఉద్యమాలనూ వీక్షించింది. చరిత్ర చూస్తే విదేశీ సిద్ధాంతాల ఆధారంగా నిర్మించిన ఉద్యమాలు తరుచూ వ్యూహం మార్చుకుంటూ ఉంటాయన్న సంగతి తెలుస్తుంది. ఏ సిద్ధాంతం, ఏ రాజకీయ సూత్రం ఆధారంగా ఉద్యమం తలెత్తిందో ఉద్యమం సాగుతున్న క్రమంలో అవే వెలిసి పోవడం అందుకు కారణం. మరొకవైపు స్థానీయతకు, ఇంకా చెప్పాలంటే మనోభావాలకు భంగం వాటిల్లడం కూడా కారణమే. విదేశీ సిద్ధాంత ప్రేరేపిత ఉద్యమాలు తాత్కాలికంగా విజయం సాధించాయి. వాటి మనుగడ కొన్ని దశాబ్దాలు. ఈ మాత్రానికే 'మార్పు' పేరుతో శతాబ్దాలుగా ఉన్న సంస్కృతినీ, జీవన విధానాన్నీ విచక్షణా రహితంగా ధ్వంసం చేయడం ఆధునిక చరిత్రలో కనిపించే వినాశనం. దీనిని నేపాల్ తొందరగా గుర్తించినట్టే ఉంది.

నేపాల్ తనదైన రాజకీయ, సాంస్కృతిక, సామాజిక వారసత్వాన్ని పున:ప్రతిష్ఠించుకోదలుచుకుంది. 2008కి ముందు ఉన్న పాలక వ్యవస్థను తిరిగి సాధించుకోవాలని అనుకుంటున్నది. అంటే, రాజరికం మళ్లీ రావాలి. నేపాల్ హిందూదేశంగా ఆవిర్భవించాలి. ఇటీవలి కాలంలో ఆ హిమాలయ రాజ్యంలో వెల్లువెత్తుతున్న ఆందోళన సెగలు ఇందుకు సంబంధించినవే. తెలిసి కాని, తెలియక కాని, ఉద్దేశపూర్వకంగా గాని మీడియాలో కొందరు ఈ పరిణామాన్ని 'యూటర్న్' గా వ్యాఖ్యానిస్తున్నారు. అలా అనుకోవడం ఒక జాతి ఆకాంక్షను చిన్నబుచ్చడమే.

నేపాల్ రాజధాని ఖట్మాండు వీధులు ఈ మధ్య తరచు 'రాజరికం రావాలి. నేపాల్ హిందూరాజ్యం కావాలి' అన్న నినాదాలతో మారుమోగుతున్నాయి. అక్కడ 2008లో మావోయిస్టు పాలన వచ్చిన తరువాత రాజరికంతో పాటు, హిందూరాజ్య వ్యవస్థను రద్దు చేశారు. ఆనాటి ఉద్యమానికి నాయకుడు మావోయిస్టు 'ప్రచండ' (పుష్పకమాల్ దహాల్). చైనా అండదండలతో లేదా ఆజ్ఞతో ఆనాడు మావోయిస్టులు ఆ ప్రక్రియను పూర్తి చేశారు. కానీ చరిత్ర గమనాన్ని ఎవరూ ఊహించలేరు. నిజానికి శాసించలేరు. మావోయిస్టుల మనోగతం మాత్రం చరిత్ర గమనాన్ని కూడా తాము

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు చైత్ర శుద్ధ దశమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**రేషింబాగ్‌లో భారత ప్రధాని**

ధారావాహిక నవల

**తూర్పు-పడమర**

– గన్నవరపు నరసింహమూర్తి

21



20లో

ప్రత్యేక వ్యాసం

**జలియన్‌వాలా బాగ్!!**



26లో

# జాగృతి

## సంపాదకీయం

## నేపాల్‌లో హిందూ రాజ్య నినాదం

మార్చగలమనే. కానీ, నేపాల్‌లో మళ్లీ ఆ రెండు వ్యవస్థలను యథాతథంగా పునఃప్రతిష్ఠించుకోవడానికి ఒక మాజీ మావోయిస్టు నాయకత్వంలోనే జాతి ఉద్యమించడం విశేషం. ఆయన పేరు దుర్గా ప్రసాయ్‌. ఈయన అలనాటి మావోయిస్టు గెరిల్లా పోరులో పాల్గొన్నాడు. నాడు రాజరికం మీద పోరాడుతున్న అన్ని వామపక్షాలను ఏకం చేసినవాడు ఈయనే. దాదాపు దశాబ్దం పాటు జరిగిన మావోయిస్టు తిరుగుబాటు 2006లో జరిగిన సమగ్ర శాంతి ఒప్పందంతో ముగిసింది. 2008లో మావోయిస్టులు పాలకులుగా కొలువైయ్యారు. ఇదంతా మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. కానీ ఈ వ్యర్థ పరిణామం కోసం, ఒక భ్రమాజనితమైన వ్యవస్థను ప్రజల నెత్తిన రుద్దడానికి చెల్లించిన మూల్యం 16,000 ప్రాణాలు.

మాజీ మావోయిస్టు దుర్గా ప్రసాయ్‌ ఆశయం ఒక్కటే. నారాయణహితి రాజప్రాసాదంలో రాజు జ్ఞానేంద్ర షా పునఃప్రవేశించాలి. ప్రస్తుతం ఉన్న కేపీ శర్మ ఓలి (ఇతడూ మార్క్సిస్టే) ప్రభుత్వాన్ని కూలదోసి అయినా రాజరికాన్ని ప్రతిష్ఠిస్తామని ప్రసాయ్‌ హెచ్చరిస్తున్నాడు. అన్నట్టు ప్రసాయ్‌ మావోయిస్టు ఉద్యమాన్ని సమర్ధించి, చాలామంది తిరుగుబాటుదారులకు ఆశ్రయం కల్పించాడు. మార్క్సిస్టు ప్రభుత్వం ఏర్పడినప్పుడు ప్రచండ నాయకత్వంలోని కమ్యూనిస్టు సెంటర్‌ పార్టీలో చేరాడు. తరువాత కేపీ ఓలి నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్‌ నేపాల్‌ (యూనిఫైడ్‌ మార్క్సిస్టు లెనినిస్ట్‌) సంస్థలో చేరాడు. ఈ పార్టీ నుంచే 2022లో ఇతడిని బహిష్కరించారు. ఎన్నికలలో టికెట్‌ కూడా నిరాకరించారు. అప్పటికే ఇతడికి మావోయిస్టు మహిమ అనుభవానికి వచ్చింది. మావోయిస్టులు జాతిని మోసం చేశారు, వీళ్ల గణతంత్ర మంత్రం ఘోరంగా విఫలమైంది అని ప్రకటించాడు. ఈ కనువిప్పు ఈ ఒక్కడిదే అనుకుంటే పొరపాటు. కుల్‌రాజ్‌ శ్రేష్ఠ అనే మరో మాజీ మావోయిస్టు కూడా ఇదే చెప్పాడు. అంటే నాటి మావోయిస్టు అభిమానులే ఇప్పుడు రాజరికం వైపు చూస్తున్నారు.

ఆనాడు మావోయిస్టులకు ఉన్న ప్రజామద్దతు ఎంతో సరిగా తెలియదు కానీ, ఇప్పుడు అత్యధికులు రాజరికాన్ని కోరుతున్న దాఖలాలు స్పష్టంగానే ఉన్నాయి. జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న సాధారణ ప్రజలు, రాజు రావాలి, దేశాన్ని రక్షించాలి అని నినదించేవారు అన్ని చోట్లా కనిపిస్తున్నారు.

రాజరికం రద్దయి 17 ఏళ్లు గడిచాయి. ఈ స్వల్ప కాలంలో 13 ప్రభుత్వాలు మారాయి. అంటే ఏ ఒక్క ప్రభుత్వం రెండేళ్లు కూడా పనిచేయ లేదు. ఎక్కే ప్రభుత్వం, దిగే ప్రభుత్వం. దీనికితోడు అవినీతి స్వైర విహారం ఒకటి. తాజాగా భారత నిఘా వర్గాల గణాంకాల ప్రకారం హిందూరాజ్యంలో ముస్లిం జనాభా శరవేగంగా పెరుగుతోంది. 2001లో 4.2 శాతం ఉన్న ముస్లింలు 2021లో 5.9 శాతానికి పెరిగారు. ఇందుకు మావోయిస్టు పాలనా వ్యవస్థ కల్పించిన వెసులుబాటే కారణం. యథాప్రకారం అక్కడ కూడా వీళ్ల అరాచకాలు మొదలయ్యాయి. ఇదే ఇప్పుడు ఆ దేశానికి అదనపు తలనొప్పి. ఇది ప్రజాస్వామిక యుగం. రాజరికాల యుగం కాదని చెప్పడానికి సందేహించనక్కరలేదు. అలా అని రాజరిక నియంతృత్వ అంతం అంటే మార్క్సిస్టు నియంతృత్వాల ఆరంభమైతే కాదు. రష్యాలో, తూర్పు యూరప్‌లో కమ్యూనిజం కుప్పకూలిన తరువాత ఆ విఫల సిద్ధాంతాన్ని రుద్దే యత్నమే చారిత్రక తప్పిదం. నేపాల్‌లో అదే జరిగింది. రాజరికం, ప్రజాస్వామ్యం కలసి సాగుతున్న వ్యవస్థలు ప్రపంచంలో ఉన్నాయి. నేపాల్‌ దానిని ఆదర్శంగా తీసుకోవచ్చు. రాజరికం కావాలన్న ప్రజల ఆకాంక్ష, ఆధునిక ప్రపంచానికి తగ్గట్టు ప్రజాస్వామ్య వ్యవస్థ అక్కడ పరిఢవిల్లుతాయి. ★

07 ఏప్రిల్‌ 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్‌




40లో

కథ

**బిడ్డ సంచి**

– జి. ఉమామహేశ్వర్‌





| | | |
|---|---|---|
| మనం ఈ భూమి పుత్రులం! (పర్యావరణం) | - | 12 |
| హరితవనంపై రేవంత్‌ సర్కారు గొడ్డలి వేటు (తెలంగాణ) | - | 14 |
| కునారిల్లుతున్న పథకాలకు 'నిధుల' ఊపిరి (ఆంధ్రప్రదేశ్‌) | - | 16 |
| ఒంటిమిట్ట రామన్నకు విలక్షణ కల్యాణం (ఆధ్యాత్మికం) | - | 18 |
| ట్రంప్‌ దూకుడు.. పుతిన్‌ చాణక్యం (అంతర్జాతీయం) | - | 22 |
| కమలామణి! (మహిళ) | - | 30 |
| ఆమె అభయరాణి (గళమెత్తిన గతం) | - | 32 |
| న్యాయమూర్తి నివాసంలో.. (జాతీయం) | - | 35 |
| విశ్వ చదరంగంలో 'ఓరుగల్లు' గ్రాండ్‌ మాస్టర్‌ (క్రీడ) | - | 39 |
| వివాదాలు రేపుతున్న ఎల్‌ 2: ఎంపురాన్‌ (సినిమా) | - | 50 |

# రేషింబాగ్‌లో



రేషింబాగ్ (నాగపూర్)లో డాక్టర్‌జీ ప్రతిమకు నరేంద్రమోదీ పుష్పాంజలి

# భారత ప్రధాని



'నేను' నుంచి 'మనం' అనే దృక్పథం దిశగా ప్రతి హిందువు పురోగమించాలన్నదే రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆశయం. ఈ ఐక్యతా సందేశాన్ని నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ విస్పష్టంగా ప్రకటించారు. ఆర్ఎస్ఎస్ అంతస్సూత్రాన్ని జాతి దృష్టికి తీసుకువెళ్లే గొప్ప ప్రయత్నం చేశారు. మార్చి 30న ఆయన రేషింబాగ్‌ను సందర్శించినప్పుడు ఈ అద్భుత సన్నివేశం సాక్షాత్కరించింది. 'స్వయంసేవకులు' అని చెప్పవలసి వచ్చిన ప్రతిసారి ఆయన 'మనం' అన్న పదాన్నే ప్రయోగించారు.ఆయన మాట్లాడిన ప్రతిపదం వెనుక డాక్టర్‌జీ, గురూజీల ఆశయం, తాత్వికత తొణికిసలాడాయి. తాను దేశ ప్రధానినే అయినా అంతకంటే ముందు స్వయంసేవక్‌నేనని నిశ్చయంగా ప్రకటించుకున్నారాయన. నరేంద్ర మోదీకి ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం కొత్తకాదు. ఆయన మొదట ప్రచారక్. అణువణువు స్వయంసేవక్. ప్రధాని పదవి చేపట్టిన తరువాత 11 సంవత్సరాలకు ఆయన డాక్టర్‌జీ స్మృతి మందిరాన్ని తొలిసారి దర్శించుకున్నారు. సంఘ శతాబ్ది నేపథ్యంలో ఈ పరిణామం జరగడం మరింత ప్రాధాన్యానికి కారణమైంది. కంటి ఆసుపత్రి భవంతికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లిన ప్రధాని, ఆర్ఎస్ఎస్ భారతజాతికి ప్రసాదించిన ముందుచూపు గురించి అద్భుతంగా ఆవిష్కరించారు. వందేళ్లలో ఆర్ఎస్ఎస్ దేశానికి ఏం చేసిందో చెప్పారు. స్వయంసేవకుల సేవాభావం ఎంత సమున్నతమైనదో, నిస్వార్థంగా ఉంటుందో చాటారు. ఆయన ప్రధాని అయిన దశాబ్దం తరువాత నాగపూర్ వచ్చి ఉండవచ్చు. అయినా ఆయన ఎంచుకున్న సమయం, సందర్భం విలక్షణంగా కనిపిస్తాయి. సంఘ శతాబ్ది ఉత్సవాలకు ఆయన శ్రీకారం చుట్టినట్టయింది. ఆర్ఎస్ఎస్ ఘనతను ఈ సమయంలో మోదీ వంటి వ్యక్తి దేశానికీ ప్రపంచానికీ గుర్తు చేయడం నిస్సందేహంగా చారిత్రక సందర్భమే.





గురూజీకి నివాళి



డాక్టర్‌జీ సమాధి వద్ద..

ఆర్‌ఎస్ఎస్ ఆవిర్భావం, ప్రస్థానం, సాధించిన ఫలితాలు ప్రత్యేకమైనవి. ఆర్‌ఎస్ఎస్ అడుగు పడిన ప్రతిచోటా భారతీయ సంస్కృతికి రక్షణ కవచం వలె ఉంటుందన్న ఖ్యాతి ఉంది. ఆత్మ విస్మృతి అనే మానసిక దాస్యం నుంచి స్వతంత్ర భారత పౌరులను విముక్తం చేయడంలో అది నిర్వహించిన పాత్రతో భారత్ ప్రపంచ పటం మీద నేడు దేదీప్యమానంగా వెలుగొందుతున్నది. మూలాలను విస్మరించకుండానే, ఆధునికతను ఆలింగనం చేసుకుంటూనే ఆర్‌ఎస్ఎస్ ప్రయాణి స్తున్నది. అందుకే భారతీయ ప్రాచీన సంస్కృతికీ, ఆధునీకరణకీ కూడా ఆర్‌ఎస్ఎస్ మరణం లేని వటవృక్షం వంటిదని అన్నారు ప్రధాని మోదీ. ఆర్‌ఎస్ఎస్ విలువలు, ఆదర్శాలు జాతీయ చైతన్యాన్ని పరిరక్షిస్తున్నాయని చెప్పడమూ అందుకే. ఆర్‌ఎస్ఎస్ ప్రథమ సర్‌సంఘచాలక్ పరమపూజనీయ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్, రెండో సర్‌సంఘచాలక్ పరమ పూజనీయ మాధవరావ్ సదాశివ గోల్వాల్కర్ స్మృతికేంద్రాలను ప్రధాని మార్చి 30న నాగపూర్‌లో దర్శించారు. తన గుండె చప్పుడు ఆర్‌ఎస్ఎస్ అని చాటారు. సంఘ్ ప్రాంగణంలో మాధవ్ నేత్రాలయ కంటి పరిశోధన వైద్య కేంద్రానికి అనుబంధంగా నిర్మిస్తున్న మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్ భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. మోదీ నాగపూర్ సందర్శన రోజే డాక్టర్‌జీ జయంతి కూడా. ఆ రోజు మరాఠాలకీ, తెలుగువారికీ కూడా యుగాది. నాగపూర్‌లోనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దీక్షాభూమి (ఆయన బౌద్ధం స్వీకరించిన స్థలం)లో కూడా మోదీ నివాళి ఘటించారు. ప్రధాని వెంట కేంద్రమంత్రి, నాగపూర్ లోక్‌సభ ఎంపీ నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఉన్నారు. సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్, ప్రధాని నరేంద్ర మోదీ ఇంతకు ముందు కలుసుకున్న సందర్భం కూడా ప్రత్యేకమైనది. అయోధ్య భూమి పూజ వేళ, బాలరాముడి ప్రతిష్ఠ ముహూర్తంలోను ఆ ఇద్దరు ఒకే వేదికపైకి వచ్చారు.

సైద్ధాంతిక శత్రువును నరేంద్ర మోదీ అసలు సహించరు. అందునా నిర్హేతుకమైన, శుష్కవాదాలతో దేశ ప్రగతిని ఎద్దేవా చేసేవారంటే ఆయన అసలే ఉపేక్షించరు. నిజం చెప్పాలంటే అలాంటి జాతి వ్యతిరేక భావధారను కాలరాస్తారు. ఆర్‌ఎస్ఎస్ మీద వందలాది ఆరోపణలు వచ్చాయి. కానీ సంఘం నిజాయితీని, దేశభక్తిని, సేవానిరతని ఎవరూ శంకించడం లేదు. అయినా విదేశీయుల సాయంతో రాళ్లు విసిరే ప్రయత్నం నిరంతరాయంగా కొందరు కొనసాగిస్తున్నారు. ఇందుకు ఆర్‌ఎస్ఎస్‌ను అడ్డం పెట్టుకుంటారు. ఇలాంటివారికి మొహం వాచే తీరులో మోదీ సమాధానం చెప్పదలుచుకున్నారు కాబోలు. నేత్రాలయ భవంతికి శంకుస్థాపన తరువాత ఆయన చెప్పిన మాటలే ఇందుకు నిదర్శనం. 'ఇది భవిష్యత్తులో వేయేళ్లు భారత్ పటిష్టంగా ఉండడానికి వేస్తున్న పునాది అని నేను అయోధ్య ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడే అన్నాను. డాక్టర్‌జీ, గురూజీలు ప్రవచనాల మార్గదర్శకత్వంలో మనం వికసిత భారత్ లక్ష్యాన్ని సాధిస్తాం. మన ముందుతరం వారు చేసిన త్యాగాలను మనం వృథాగా పోనివ్వం' అని ప్రకటించారాయన. కాబట్టి ఎన్‌డీఏ ప్రభుత్వం జాతీయత పునాదిగా, దేశప్రయోజ నాల కోసమే పని చేస్తుందని, అవి సంఘ స్ఫూరితో వచ్చినవని ఆయన ఎలాంటి శషభిషలు లేకుండా ప్రకటించారు. ఇది ఉదారవాద ముసుగులో ఉన్న జాతి వ్యతిరేకులకు ఆయన ఇస్తున్న సమాధానమే.

సంఘ శతాబ్ది సంగతి ఆ మాజీ ప్రచారక్ దృష్టి నుంచి ఎట్టి పరిస్థితులలోను తప్పించుకుపోదు. ఆ స్పృహే మోదీ ఉపన్యాసమంతటా ప్రతిధ్వనించింది. వందేళ్లుగా సంఘటన, సమర్పణ భావాలతో ఆర్‌ఎస్ఎస్ చేస్తున్న తపస్సు వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఇప్పుడు ఫలాలను అందిస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య చాలు, దేశ పురోగమనంలో ఆర్‌ఎస్ఎస్ మౌనంగా చేసిన సేవ ఎంతటిదో చెప్పడానికి! ఒక నిశితమైన అంశం కూడా మోదీ మన ముందు ఉంచారు. ఆర్‌ఎస్ఎస్ 1925–1947 మధ్యకాలంలో ఒక విధమైన కీలక బాధ్యతను నిర్వహిస్తే, 2025–2047 మధ్య కాలంలో మరొక విధమైన గురుతర బాధ్యతను భుజాలకు ఎత్తుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1925–1947 ప్రాంతం భారత స్వాతంత్ర్య సమరం పతాక సన్నివేశానికి చేరుకుంటున్న దశ. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎలాంటి భారత్‌ను నిర్మించాలో దాదాపు ఏ ఒక్కరికీ స్పష్టమైన భావన లేని దశ కూడా అదే. 2025–2047 మరింత కీలకం. స్వతంత్ర భారతదేశం ఆత్మ విస్మృతి నుంచి విముక్తం కావడానికి సిద్ధపడిన కాలం. ప్రపంచ శక్తిగా ఎదగడానికి పునాది పడిన కాలం. ఈ అవకాశాలను ఉద్యమ స్ఫూర్తితో, జాతీయ ప్రయోజనాలతో అందిపుచ్చుకోవలసిన కాలం. ఈ క్రమంలోనే వచ్చే వేయేళ్లలో భారత్ వికాసానికి మనం పునాది వేయాలని పిలుపునిచ్చారు. ఇంకా చెప్పాలంటే, భవిష్యత్ భారతం మీద ఉండబోతున్న ఆర్‌ఎస్ఎస్ జాతీయ వాద ముద్ర గురించి ముందే హెచ్చరించారు. జాతీయ భావాలను ఇప్పటికీ బలహీనం చేసే ప్రయత్నంలో ఉన్నవారికి ఇదొక హెచ్చరిక. ఎంతకాలం జీవించామని కాదు, సమాజానికి ఎంత చేశామన్నదే జీవితానికి నిజమైన కొలబద్ద అన్న గురూజీ మాటను కూడా మోదీ గుర్తు చేశారు.

భారత ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ నాగపూర్‌లోని డాక్టర్‌జీ స్మృతి మందిరాన్ని, సర్‌సంఘచాలక్‌తో కలిసి సందర్శించడం ఇదే మొదటిసారి. ఆ మందిరంతో పాటు, దానిని నిర్మించిన రేషింబాగ్

అనే స్థలం ప్రతి స్వయంసేవక్‌కు పరమ పవిత్రమే. అది ప్రథమ సర్‌సంఘచాలక్ పరమ పూజనీయ డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ జ్ఞాపకం. సంఘ్ చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఒక ప్రేరణ. అందుకే మోదీ నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించడం ఒక చారిత్రక ఘటనగా అంతా చూశారు. రెండో సర్‌సంఘచాలక్ పరమ పూజనీయ గురూజీ స్మారక మందిరం కూడా ఇక్కడే ఉంది. అక్కడకి కూడా ప్రధాని వెళ్లారు. నిజానికి 2000 సంవత్సరంలో అటల్ బిహారీ వాజపేయి ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. 2013లో లాల్ కిషన్ అద్వాణీతో కలసి ఢిల్లీలోని ప్రాంతీయ కార్యాలయాన్ని కూడా ఆయన సందర్శించారు. అప్పుడు సర్‌కార్యవాహ్ మోహన్‌జీ భాగవత్. అంతకు ఒక నెల ముందు అద్వాణీ నాయకత్వంలో పార్టీ బృందం నాగపూర్ వెళ్లి నాటి సర్‌సంఘచాలక్ మాననీయ కె. సుదర్శన్‌జీని కలుసుకున్నారు.

ఆర్ఎస్ఎస్ పెద్దలకూ, బీజేపీ నాయకులకూ మధ్య ఉండేది గౌరవ పూర్వకమైన దృఢబంధమే. అందులో అజమాయిషీ లేదు. ఆత్మీయత మాత్రమే ఉంది. దేశ ప్రయోజనాల గీటురాయి మీద నిగ్గు తేలిన బంధమే వారి మధ్య ఉండేది. నాడు నేడు కూడా అలాంటి బంధమే ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ నేటి సర్‌సంఘ్‌చాలక్ మధ్య ఉన్నది సైద్ధాంతిక ఏకాత్మత ఒక్కటే కాదు. వారు పరస్పరం విశేషంగా గౌరవించుకుంటారు. వారిద్దరు ప్రాణస్నేహితులని కూడా సంఘ పెద్దలు చెబుతూ ఉంటారు. వారిద్దరినీ చూస్తే ఒక సదాశయం కోసం జీవితాలను అంకితం చేసిన సోదరుల వలె అగుపిస్తారన్న మాట కూడా ఉంది. ఈ విషయం రుజువు చేయడానికి కాదు గాని, నాగపూర్‌లో ప్రధాని, సర్‌సంఘచాలక్ కలసి నడవడం, హాయిగా నవ్వుకోవడం, వారి మధ్య బంధం ఫోటోల రూపంలో స్పష్టంగా ప్రపంచానికి తెలిసింది. వారేమి మాట్లాడుకున్నారో తెలియకపోయినా, హిందుత్వ సంస్థకు చెందిన ఆ ఇద్దరు ప్రముఖుల మధ్య ఉన్న గాఢ స్నేహాన్ని అవన్నీ వ్యక్తం చేశాయి.

మోహన్‌జీ భాగవత్ 2000 సంవత్సరంలో సర్‌సంఘచాలక్ బాధ్యతలు స్వీకరించారు. నరేంద్ర మోదీ ఆ మరుసటి సంవత్సరమే గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేశారు. బాధ్యతలను బట్టి ఆ ఇద్దరు వేర్వేరు రాష్ట్రాలలో ఉన్నప్పటికీ, రెండు వేర్వేరు సంస్థలలో బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ వారి మధ్య బంధం మాత్రం ఒకే రీతిలో కొనసాగిందని కూడా పరిచయస్థులు చెబుతారు. నాగపూర్ తాజా పర్యటనలో కనిపించినట్టు మోదీ, మోహన్‌జీ నవ్వుతూ మాట్లాకునే దృశ్యాలు అరుదుగానే కనిపిస్తాయి. అంతమాత్రాన ఆ ఇద్దరు



అంబేద్కర్ బౌద్ధం స్వీకరించిన స్థలం (దీక్షాభూమి) వద్ద మోదీ, ఫడణవీస్, గడ్కరీ

మాట్లాడుకోరనుకోవడం తప్పేనని కూడా కొందరు సంఘ పెద్దలు చెబుతున్నారు. దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడైనా సంప్రతించుకోవలసి వస్తే ఇద్దరూ ఆయా స్థాయిలలో మాట్లాడుకుంటూనే ఉన్నారని వారు అంటున్నారు. ఆర్ఎస్ఎస్‌లో క్రమశిక్షణకు, మాటతీరుకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అయినా మోదీ, మోహన్‌జీ విషయంలో మాత్రం చలోక్తిగా జై–వీరు అని పిలుచుకుంటూ ఉంటారని కూడా తెలుస్తున్నది. అలాగే మోదీ, మోహన్‌జీల నిర్వహణ సామర్థ్యం మధ్య కూడా పోలికలు తెచ్చే వారు ఉంటారు. ఆ విషయంలో ఇద్దరూ ఇద్దరే. కొందరికి ఆర్ఎస్ఎస్ నేత, ప్రస్తుత ప్రభుత్వ అధినేత కలవడం భారత పునర్ వైభవానికి ప్రతీకగా కనిపించింది. మాధవ్ నేత్రాలయం శంకుస్థాపనోత్సవంలో మోదీ పదే పదే మనం స్వయం సేవకులం అంటూ ఉదహరించారు. అంటే మోదీ అంటే బయటివాడు కాదు, స్వయంసేవకులలో ఒకడు అన్న అర్థం వచ్చేటట్టే ప్రధాని మాట్లాడారు.


ప్రధాని సంఘ్‌ను మరణం లేని మహా వట వృక్షంగా ఎందుకు పేర్కొన్నారో అర్థం చేసుకోవడం అవసరం. ప్రచారం కోసం ఏనాడూ అర్రులు చాచని ఆర్ఎస్ఎస్ గురించి బయటి ప్రపంచానికి తెలిసినది తక్కువే. ఇవాళ దేశంలో లక్షకు పైగా శాఖలలో ఐక్యతా మంత్రంతో దీక్ష వహించి సమాజ సేవలో లక్షలాది స్వయంసేవకులు పని చేస్తున్నారు. వారంతా భారతీయత ఆధారంగా, దేశ ప్రయోజనాల మేరకే పనిచేస్తారు. వ్యక్తిగత స్వార్థం ఉండదు. కొంతవరకు ప్రధాని సంఘ విస్తరణ గురించి వివరించారు కూడా. శాఖకు రాకున్నా, ఆర్ఎస్ఎస్ ప్రేరణతో పనిచేస్తున్న వారు కూడా కోకొల్లలు. వనవాసుల మధ్య, పేదల మధ్య, ఎస్‌సీల మధ్య నిరంతరం పనిచేసే స్వయంసేవకులు ఉన్నారు. వారందరినీ దేశ ప్రధాన స్రవంతిలోకి సగౌరవంగా తీసుకురావడమే ఈ సేవ పరమార్థం. విద్యారంగంలో, వైద్యరంగంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల సేవలు చిరస్మరణీయమైనవి. ఇందుకు తాజా ఉదాహరణ కరోనా నాటి సంక్షోభంలో వారు చేసిన సేవలు. ఇవే కాకుండా వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలలో స్వయంసేవకులు నిరుపమానమైన సేవలను నిస్వార్థంతో అందిస్తారని, మహా కుంభ్ వంటి సందర్భాలలో కూడా వారి సేవలు అత్యంత శ్లాఘనీయమైనవని ప్రధాని మోదీ నాగపూర్‌లో వ్యాఖ్యానించారు. మానవతా దృక్పథంతో, ఏమీ ఆశించకుండా సేవలు చేసే లక్షణం వారిలో ఉందని మోదీ అభినందించారు. పెద్ద విపత్తు, లేదంటే చిన్న పని అని కాకుండా స్వయంసేవకులు అమూల్యమైన సేవలు అందించడానికి ముందుం టారన్న వాస్తవాన్ని దేశప్రజలు గమనిస్తున్నారని ప్రధాని అన్నారు. వనవాసి కల్యాణాశ్రమం, ఏకల్ విద్యాలయాలు (గిరిజన బాలబాలికల కోసం విద్యాలయాలు), సాంస్కృతిక చైతన్యం కోసం పనిచేస్తున్న సంస్థలు, సేవాభారతి సేవల గురించి ప్రధాని గుర్తు చేసుకున్నారు. సేవ అనేది ఒక యజ్ఞకుండం వంటిది. అది జ్వలించడానికి ప్రతి స్వయంసేవక్ తనను తాను సమర్పించుకుంటున్నాడు అని చెప్పారు.

ఇటీవల జరిగిన ప్రయాగ మహా కుంభ్‌లో ప్రజలకు స్వయంసేవకులు ఎంతో గొప్ప సేవ చేశారని కొనియాడారు. నిజానికి ఆర్ఎస్ఎస్ ఆశిస్తున్న హిందూ ఐక్యత ఈ కుంభమేళాలో దర్శించిందనే చెప్పాలి. అలాగే హిందువులు ఏకం కావడంతోనే దేశంలో రాజకీయ స్థిరత్వం, ఏకత్వం వస్తుందన్న బీజేపీ దృష్టికోణం కూడా ప్రయాగలో కనిపించింది. అందుకే మోదీ నాగపూర్‌లో ఆ మహాఘట్టం గురించి పదే పదే ప్రస్తావించారు. ఎక్కడ సేవ అవసరమైతే, ఎక్కడ విపత్తు తలెత్తితే అక్కడ ఆపన్నులకు సేవలు అందించడానికి స్వయం సేవకులు ఉంటారని మోదీ


Grand Opening On Monday 7th April 2025, 11:00 AM
అత్యుత్తమ వస్త్రశ్రేణి
THE Raymond SHOP
Exclusive Showroom
అభినందనలతో...
బండారి రమేశ్
విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సేవా ప్రముఖ్
శ్రీ వాసవి చిట్‌ఫండ్ &
ఫైనాన్స్, షాద్‌నగర్
SREE RAJARAJESHWARA TEXTILES
Hastinapuram, BN Reddy Nagar,
Near Vishalmart, Hyderabad
ఆత్మీయులందరికి ఇదే మా ఆహ్వానం
Scan for the location
– బండారి భరద్వాజ్


SUDHAKAR
PIPES AND FITTINGS
50+ years OF LEGACY
SUDHAKAR GROUP
రోటో మౌల్డ్
సుధాకర్ వాటర్ ట్యాంక్స్
త్రీ లేయర్ బ్లో మౌల్డ్
సుధాకర్ వాటర్ ట్యాంక్స్
SUDHAKAR
Toll Free : 1800 120 000 066
sudhakarind.com
info@sudhakarind.com

గుర్తు చేశారు. ఇంటి బాధలను కూడా పక్కన పెట్టి వారు గొప్ప సేవాదృక్పథంలో వస్తారని ప్రధాని చెప్పారు. వందేళ్ల క్రితం వేసిన బీజాలు ఇవాళ ఫలితాలు ఇస్తున్నాయని సంఘ శతాబ్ది నేపథ్యంలో ప్రధాని గుర్తు చేసుకు న్నారు. వందేళ్ల క్రితం వచ్చిన ఆలోచన ఇప్పుడు వట వృక్షమై ప్రపంచం ఎదుట నిలిచి ఉందని అన్నారు. విలువలు, సిద్ధాంతాలు ఆ వృక్షానికి అంతటి ఆకృతిని ఇచ్చాయని కూడా ఆయన వ్యాఖ్యానించారు. లక్షలూ, కోట్లలో ఉన్న స్వయంసేవ కులంతా ఈ మహావృక్ష శాఖలేనని అన్నారు. ఇది మామూలు చెట్టు కాదని, చిరంతనమైన భారత దేశ సంస్కృతికి ఆధునికీకరణకు అక్షయ వటవృక్షమని మోదీ వ్యాఖ్యానించడంలోని పరమార్థం అదే. ఈ వటవృక్షం నిరంతరాయంగా భారతీయ సంస్కృతికి జవజీవాలు అందిస్తున్నదని జాతిలో జాగరూకతను నింపుతున్నదని అన్నారు. యోగ, ఆయుర్వేదం వంటి భారతీయ వ్యవస్థల ద్వారా ప్రపంచంలో భారతీయ సంస్కృతికి దక్కిన ప్రాధాన్యం గురించి కూడా గుర్తు చేశారు.



ఆత్మ విస్మృతి దుష్ఫలితాలను మొదటిగా గుర్తించిన సంస్థ ఆర్ఎస్ఎస్. కానీ ఆ విషయాన్ని జాతి చేత గుర్తింపచేయడమూ మహాయజ్ఞమే. బ్రిటిష్ జాతి దేశాన్ని వీడి ఏడున్నర దశాబ్దాలు గడచి పోతున్నా, మానసిక దాస్యం చాలామందిలో ఇప్పటికీ మిగిలి ఉంది. భారతీయులు కూడా విజయాలు సాధించగలరు అంటే అనుమానంగా చూసే వారి సంఖ్య తక్కువ కాదు. ఈ పరిణామానికి, ధోరణికి కొన్ని దశాబ్దాల నేపథ్యం ఉంది. భారతీయులలో ఉన్న జాతీయ స్పృహను అణచివేసే ప్రయత్నం చరిత్ర అంతా కనిపిస్తుందని, కానీ దేశ సాంస్కృతిక వారసత్వం దానిని కాపాడిందని మోదీ గుర్తు చేయడం ఇందుకే. సంఘ్ అక్కడ విజయం సాధిం చింది కాబట్టే చాలా రంగాలలో భారత్‌ను మొదటి స్థానంలో నిలపగలిగింది. మన యోగ, ఆయుర్వేదం ప్రపంచంలో కొత్త స్థానం ఆక్రమించాయి. ఒక దేశ అస్తిత్వం దాని సాంస్కృతిక వ్యాప్తి మీద, జాతీయ స్పృహ మీద ఆధారపడి ఉంటుందని సంఘ్ నుంచి వచ్చారు కాబట్టి, మోదీ అనగలిగారు. భారతీయు లలో జాతీయతా స్పృహను తుడిచివేసే ప్రయత్నం కనిపిస్తుందని, కానీ అది విజయవంతం కాలేదని గుర్తు చేశారు. ఆ ప్రయత్నం విఫలం కావడానికి ఆయా సమయాలలో వెల్లువెత్తిన సామాజికోద్యమాలు కారణమని అన్నారు. భక్తి ఉద్యమం అందుకు మంచి ఉదాహరణ అన్నారాయన. ఒక సంక్షుభిత సమయంలో సాధుసంతులు మనలో జాతీయ కాంక్షను తిరిగి పాదుకొల్పారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ అంటే ఒక సంస్థ మాత్రమే అనుకోవద్దు, ఇది జాతీయతా ప్రేరణ కలిగిన ఒక శక్తి అని ప్రధాని వ్యాఖ్యానించారు.

'వర్ష ప్రతిపద' సందర్భంగా స్మృతి మందిరాన్ని దర్శించుకోవడం చాలా ప్రత్యేకమైన సందర్భం. ఎందుకంటే అదే డాక్టర్‌జీ జయంతి. అసంఖ్యాకమైన జనం ఆ మందిరాన్ని దర్శించి శక్తిని పొందారు. అందులో నేను ఒకడిని' అని పుస్తకంలో తన సందేశం రాశారు నరేంద్ర మోదీ, భారత ప్రధాని.

ఆర్ఎస్ఎస్‌నూ, బీజేపీనీ నేరుగా ఎదుర్కొనలేక భారత వ్యతిరేకులు చాలా కుట్రలు చేస్తున్న సమయమిది. ఈ కుట్రకు అవసరమైన ఆధారాలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ద్వారా అందిస్తు న్నారు. డిజ్‌మ్యాంటిలింగ్ హిందుత్వ అని ఒకడు అంటాడు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మంత్రిగా పనిచేస్తున్న ఇంకొక మూఢుడు సనాతన ధర్మాన్ని పెకలించవలసిందేనంటాడు. సనాతన ధర్మం అంటే కరోనా, డెంగీ లాంటిదని అవమానిస్తాడు. స్టాండప్ కమేడియన్లకి కేవలం హిందూ ఆచార వ్యవహారాలు, పండుగల నుంచే హాస్యం దొరుకుతూ ఉంటుంది. అసభ్యకరంగా మాట్లాడడానికి, చతురోక్తులు విసరడానికి బీజేపీ నేతలు మాత్రమే దొరుకుతారు. సెక్యులరిజం కాపాడవలసిన బాధ్యత ఏకపక్షంగా హిందువులే తీసుకోవలసి వస్తున్నది. తీసుకున్నా మతోన్మాదులుగా, మెజారిటేరియన్ నిజంగా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో అయితే ఏ హిందూదేవాలయం అపవిత్రమైనా అది పిచ్చివాళ్ల పనే అయిపోతోంది. ఈ పిచ్చివాళ్లకి మరొక మతానికి సంబంధించిన ప్రార్థనా మందిరమేదీ దొరకదు. ఇలాంటి సమయంలో నాగపూర్ నుంచి మోదీ ఇచ్చిన సంకేతాలు చాలా కీలకమైనవి. హిందువుల మధ్య ఐక్యతను కోరుకునే సంస్థలు తమలో తాము కలహించుకోవనీ, అలాంటి వాటి కోసం దింపుడు కళ్లం ఆశతో చూడవద్దని హెచ్చరించినట్టయింది.

– జాగృతి డెస్క్



# మనం ఈ భూమి పుత్రులం!

గ్రామ వికాస్ –

'మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః' (ఈ భూమి నా తల్లి, నేను ఆమె పుత్రుడను) ఇది భూమాత గురించి భారతీయ దృష్టికోణం. ఇంకా, 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ (కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే గొప్పవి) అన్నమాట రామాయణ కాలంలోనే చెప్పారు. మనది భూమాత పట్ల దైవీ భావన, పూజ్య భావన. అవసరం మేరకే అనుభవించే సంస్కృతి మనది. మట్టిని తల్లిగా ఆరాధిస్తూ అవినాభావ సంబంధం, సేవాభావం కలిగి ఉంటారు భారతీయులు. ఇది జగజ్జనని, అన్నపూర్ణ, ఆరోగ్య ప్రదాయని. ఈ భూమే మనందరికీ భారతమాత!

ఈ భావన మన సంస్కృతిలో ఎలా ఆవిర్భవించింది. భూమాతను అన్నపూర్ణగా భావించడం వల్ల కూడా. మనవి బంగారు నేలలు. కాబట్టి బంగారు పంటలు కూడా. మనకు ఉన్నవి అమృత జలాలు. సముద్రాలు – నదులు – లోయలు – వనాలు – కొండలు – గుట్టలు ఇవన్నీ ఈ భూమికి అలం కారాలు. నదులు లోయలు, వనాలు, కొండలు – గుట్టలు, భూగర్భజలాలు ఈ భూమి మనకు ప్రసాదించిన సహజ వనరులు. ఇవే కోటాను కోట్ల జీవరాశులకు ప్రాణాధారం. అందుకే మానవ మనుగడకు సర్వం సమకూర్చే కన్నతల్లిగా భూమిని చూస్తాం. నేల అంటే జీవ వైవిధ్యాన్ని పోషించే తల్లి. చరాచర సృష్టికి బ్రతుకుదెరువునిచ్చే అన్నపూర్ణ.

కానీ ఇవాళ భూమి పరిస్థితి ఏమిటి? ఆధునికత పేరుతో అడవుల నరికివేత, అధిక నీటి వినియోగం, భారీ యంత్రాల వాడకం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇన్ని వేల ఏళ్లుగా పచ్చగా ఉన్న భూమాత ఇప్పుడు ప్రాణాంతక రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలతో నిస్సారమైపోతున్నది. అంతా కాలుష్యం.

కొంచెం ఆలస్యంగా అయినా భూమి సుపోషణ – పర్యావరణ సంరక్షణ ఆవశ్యకతలను గురించి ఒక ఆలోచన, ఆవేదన మొదలయ్యాయి. ఫలితమే ఒక కార్యాచరణ కూడా వచ్చింది. భూమి సుపోషణతో భూసార సంరక్షణ పని చేపట్టాలి. పర్యావరణ పరిరక్షణతో జీవ వైవిధ్యం కాపాడుకోవాలి. చెట్లు, ఔషధ మొక్కలు, పూలమొక్కలు, కూరగాయ మొక్కలు, మిశ్రమ పంటలతో భూమిని బలోపేతం చేసుకోవాలి. యంత్రీకరణతో భూమిని గాయపరిచిన మనం కొన్ని ఇతర చర్యలు, సంప్రదాయం సూచించిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవే, గో పోషణ, పశుపోషణ, ఎద్దుల వ్యవసాయం. నిజానికి ఈ విధానంతో భూమికి కడుపునిండా ఆహారం దొరుకుతుందని అనాలి. విచక్షణా రహితంగా సాగిపోతున్న రసాయనిక ఎరువులు వాడకంతో పాతాళానికి వెళ్లిపోయిన వానపాములను మనం మళ్లీ స్వాగతించాలి. వాటి సంచారంతో నేల గుల్లగా తయారు కావడానికి , నీటిధారలు ప్రవహించేందుకు దోహదం చేయాలి.

భూమి సుపోషణ, భూసార సంరక్షణ ధార్మిక దృష్టితో చేయాలి. లాభనష్టాలు బేరీజు వేసుకోవడం సరికాదు. ఇందుకు గ్రామాలలో చేయాల్సిన పనులు ఏమిటి? ఉగాది పండుగ లేదా మరొకరోజు భూమిపూజ, భూసుపోషణ గూర్చి సంకల్పం తీసుకోవాలి. ఇంతకాలం మనం ఉదాశీనంగా వ్యవహరించినందుకు ప్రాయశ్చిత్తంగా మనం ఈ సంకల్పం తీసుకోవాలి. వేసవిలో లేదా ఒక్కొక్క పంటకు మధ్య భూమికి విశ్రాంతిని ఇవ్వాలి. భూమిని ఉష్ణతాపం నుంచి కాపాడుకునే ప్రయత్నం చేయాలి. భూమికి అచ్ఛాదన (మల్చింగ్), వాపు (నీరు, నీటి ఆవిరి సంతులనం) ఏర్పాటు చేయాలి. ఈ భూమిలో ఎల్లెడలా వానపాములు , కోటాను కోట్ల జీవరాశుల సంచారం చేస్తూ ఉంటాయన్న ఒక నిరంతర స్పృహ మనకి అవసరం. గోపోషణ, పశుపోషణ, పొలంలో పశువుల మందలు తిరిగేటట్టు చేయాలి. ఎద్దులతో వ్యవసాయం చేయాలి. ఇలా చేస్తే రేపటి తరానికి కాస్తయినా ఆరోగ్యంగా ఉన్న భూమిని మనం అప్పగించగలుగుతాం. నవధాన్యాలు, పప్పుధాన్యాలు, స్వల్పకాలిక పంటలు, పచ్చి రొట్టలతో భూమికి పోషణ లభిస్తుంది. సేంద్రియ ఎరువులు, గోకృపామృతం, బీజామృతం, జీవామృతాలతో నేలకు సమృద్ధిగా ఆహారం అందించడం మనందరి కర్తవ్యం. చెరువు మట్టి, మట్టి ద్రావణం, ప్రాకృతిక కీటక నియంత్రణ కషాయాల వినియోగం కూడా అవసరమే. మిశ్రమ పంటలు, పంట మార్పిడి, రైతులు తమ గ్రామానికి కావలసిన అన్ని పంటలు పండిస్తూ భూమిని ఇంకా నిస్సారం కాకుండా చూసుకోవాలి. భూసారం, నీటి వనరులు, వర్షాలు, వాతావరణం వంటివాటి వీటి ఆధారంగా రైతులు పంటల విధానం ఏర్పరుచుకోవాలి. వారు తమకు కావలసిన దేశవాళీ విత్తనాలు స్వయంగా తయారు చేసికోవడం కూడా అవసరమే.

## సంకల్పం (ప్రతిజ్ఞ)

**(సూచన:– ఈ ప్రతిజ్ఞను ఒక వ్యక్తి పెద్ద స్వరంతో పలికించాలి. దానిని అక్కడున్న ప్రతి ఒక్కరూ ఉచ్చరించాలి.)**

భారతదేశము నా మాతృభూమి. భారత దేశము లోని నా నివాసం గ్రామం లేదా పట్టణం, ఏదైన ప్పటికీ, భారతీయ సంస్కృతిలో భాగస్వామినై, ఈ భూమితల్లి పట్ల మాతృభావనను కలిగి ఉండేందుకు నేను సర్వసన్నద్ధంగా ఉంటాను.

ఈ భూమితల్లి పట్ల గల నా ఆదరాభిమానాలను నా దినచర్య కర్తవ్య పాలనతో నిరూపిస్తాను.

ఈ భూమి సుపోషణ కోసం నేను నా జీవితాంతం, ఈ క్రింది విధంగా శ్రమిస్తాను.

1. భూసారం దెబ్బతినకుండా ఆపుతాను. మట్టి సారవంతం కావడానికి కృషి చేస్తాను. 2. రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగుమందులు, రసాయనిక రోగ నిరోధక మందులు ఉపయోగించను. 3. వ్యవసాయంలో పంటకు కావలసినంత మేరకే నీటిని ఉపయోగిస్తాను, ఎక్కడనూ నీటిని వృథా కానివ్వను. 4. చేలగట్ల పైన చెట్లు పెంచుతాను, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తాను.

పై నియమాలను పాటించడంలో పాటుగా, భూమి సుపోషణ కోసం, ఈ క్రింది పద్ధతులను అనుసరిస్తాను.

భూసారానికి హాని కలిగించే పదార్థాలను, ఉదా॥ ప్లాస్టిక్, ధర్మకోల్ మొదలైన వాటి వాడకం వీలైనంత తగ్గిస్తాను. వస్తువులను భూమికి హాని కలగని రీతిలో జాగ్రత్తగా, అతి తక్కువగా, ఉపయోగిస్తాను. కాగితాలు, వృక్ష సంబంధ ఉత్పత్తులను అవసరమైనంతవరకే ఉపయోగిస్తాను. ఈ ఉత్పత్తులను మరలా మరలా ఉపయోగించే పద్ధతులను పాటిస్తాను.

చెట్లు నాటి, వాటిని సంరక్షించే కార్యములో నేను ఎల్లప్పుడూ పాల్గొంటూ ఉంటాను. ఈ పద్ధతులన్నింటినీ, నేను సంపూర్ణ విశ్వాసంతో, నిష్ఠతో పాటిస్తాను. ఈ కార్యంలోనే నా దేశ సౌభాగ్యం, భూమాత ఔన్నత్యం ఆధారపడి ఉంటాయని నమ్ముతాను.



## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

### భూ సుపోషణ ప్రతిజ్ఞ

సర్వశక్తిమంతుడగు శ్రీ పరమేశ్వరునీ, మన పూర్వికులనూ తలంచి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తానని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ప్లాస్టిక్ వాడకం తగ్గించి మొక్కలు నాటి చెట్లు పెంచుతానని పర్యావరణాన్ని తద్వారా భూమాతను రక్షిస్తానని నా కోసం, నా భావితరాల కోసం ఈ వ్రతాన్ని నేను జీవితాంతం పాటిస్తానని మా గ్రామదేవత... సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను.

**భూమాతాకీ జై!**

పొలంలో పడ్డ వర్షపు నీరు అక్కడే, గ్రామంలో పడిన వర్షం నీరు గ్రామంలోనే ఇంకిపోయే విధంగా చూసుకోవాలి.

పొలాలలో కాంటూర్ పద్ధతిలో నీటిని నిలిపే విధంగా గట్లువేసి, అధిక పంటలు పండించాలి. పొలం గట్లపైన ఉపయోగకరమైన చెట్లు, గడ్డి పెంచుకోవాలి. వ్యవసాయం పనులకు, కలుపు తీసేందుకు చేతితో, పశువులతో నడిచే చిన్న యంత్రాలు వినియోగించడానికి పరిమితం కావడం అవసరం. యజమానులు కుటుంబ సహితంగా కూలీలతో కలసి పొలం పనులు చేసే సంస్కృతిని పెంచాలి. తమ పొలాన్ని, ఇంటిని, వీధిని, గ్రామాన్ని, ధార్మిక – సామాజిక స్థలాలను పర్యావరణ పోషకంగా ఉంచుకోవాలి. అంటే నిరంతరం భూరక్షణ స్పృహతో ఉండాలి. ఇప్పుడు ప్లాస్టిక్ పర్యావరణానికి అతిపెద్ద బెడద. ఆహార వస్తువుల నిలువ, విత్తనాల భద్రత కోసం ... ప్లాస్టిక్ – పాలిథిన్ రహిత పాత్రలు, గోనె సంచులు, గుడ్డ సంచులను ఉపయోగించే అలవాటును పెంచాలి. మానవ వికాసం అంటే పంచ భూతాల సమ్మేళనంతోనే జరుగుతుంది. అంటే సృష్టి, పర్యావరణం, ప్రాణుల సంరక్షణే మానవవికాసం. ఆ దృష్టితో చూస్తూ వీటిని కాపాడుకోవాలి.

పొలాల్లో, ఇండ్లల్లో, వీధులలో, సామాజిక స్థలాలలో అత్యధికంగా సౌరశక్తిని ఉపయోగించే పద్ధతి అలవడాలి. గ్రామ పెద్దలు, ప్రభుత్వాధికారులు రైతులను ప్రోత్సహించాలి. రైతే 'రాజు' అన్న భావనకు గౌరవం తేవాలి.

### భూ సుపోషణ

**(అందరూ చెప్పవలసిన పూజా మంత్రాలు)**

***1) మాతా భూమిః పుత్రోహమ్ ప్రృథివ్యాః*** (భావం: ఈ భూమి నా తల్లి నేనామె పుత్రుడను)

***2) గంధద్వారామ్ దురాధర్షా నిత్యపుష్టామ్ కరీషిణీమ్*** (భావం: సమస్త ప్రాణులను పోషించే అజేయమైన సుగంధాన్ని వెదజల్లే ఈ భూమిని గోమయాన్ని ఉపయోగించి నిత్యపుష్టిగా చేస్తాము.)

***3) జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ*** (భావం: కన్నతల్లి, జన్మించిన నేల స్వర్గం కన్నా మిన్న)

***4) సానో భూమి స్త్విషబలమ్ రాష్ట్రే దదాతూత్తమే*** (భావం: ఉత్తమమైన మన భారతభూమాత మన అందరికీ తేజస్సు, బలాన్ని ప్రసాదించుగాక)

***5) గ్రీష్మస్తే భూమే వర్షిణీ శరద్ధేమంతః శిశిరో వసంతః ఋతవస్తే విహితా హాయనీ రహోరాత్రే పృథివినో దుహతామ్*** (భావం: ఓ భూమాతా! విధాత నీ కోసమే ఈ ఆరు ఋతువులు గ్రీష్మ వర్ష శరద్ హేమంత శిశిర వసంత వర్ష సమూహం పగలు రాత్రి మొదలైనవన్నీ సృష్టించాడు.)

***6. ఓం ద్యౌః శాంతిః అంతరిక్షగమ్ శాంతిః ప్రృథివీ శాంతిః ఆపః శాంతిః ఓషధయశ్శాంతిః వనస్పతయశ్శాంతిః విశ్వేదేవా శాంతిః బ్రహ్మ శాంతిః సర్వగమ్ శాంతిః శాంతి రేవ శాంతిః సామా శాంతి రేధి ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*** (భావం : ద్యౌలోకమ్ అంతరిక్షమ్ భూమి జలము ఓషధులు వనస్పతులు సమస్త దేవతలు బ్రహ్మ అంతటా శాంతికి కూడా శాంతి ఈ శాంతి నిరంతరం ఉండాలి.)

***7. భూమిః స్వర్గతామ్ యాత్ మనుష్యో యాత్ దేవతామ్ ధర్మో సఫలతామ్ యాత్ నిత్యం యాత్ శుభోదయమ్.*** (భావం : ఈ భూమి స్వర్గం కావాలి. ఈ మనుషులు దేవతలు కావాలి. ఈ ధర్మం సఫలం కావాలి. నిత్యమూ అందరికీ శుభాలు కలగాలి.)

భూసుపోషణలో నగరాలకూ, పట్టణాలకూ కూడా బాధ్యత ఉంది.

'ఉగాది' నుండి ఏప్రిల్ చివరివరకు తమ బస్తీ –కాలనీ–అపార్ట్మెంట్‌లలో ఏదేని ఒక పూజా విధానంతో, భూసుపోషణ – పర్యావరణ సంరక్షణ పట్ల సదవగాహన కల్గించే ప్రయత్నం అందరం చేయాలి. ఈ కార్యక్రమం దేశమంతా జరుగుచున్నది. గ్రామాలే కాదు, పల్లెలే కాదు; నగరాలు – పట్టణాల నివాసం, ఈ భూమాత పైననే అని గ్రహించాలి. భూ సుపోషణ కేవలం రైతుల బాధ్యత కాదు, ప్రజలందరి కర్తవ్యం. ఇంటిలో, పరిసరాలలో ప్లాస్టిక్, పాలిథిన్, థర్మోకోల్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్, సిమెంట్ వంటి వాటి వినియోగాన్ని నియంత్రించాలి. ధార్మిక స్థలాలు, సామాజిక స్థలాలు, పండుగలు, శుభకార్యాలు, విందులు, వినోదాలలో ప్లాస్టిక్ – పాలిథిన్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలి. ఇండ్లలో తడి చెత్తను – పొడి చెత్తను విడిగా ఉంచడం చాలా అవసరం. తడిచెత్త, మిగిలిపోయిన ఆహార పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసి, ఉపయోగించుకోవాలి.

మన ఇంటి పరిసరాలు, వీధులు, మురికి కాలువలు, చెరువులు, కుంటలు, సామాజిక స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తమ ఇంటి పరిసరాలు, మిద్దెలు, దేవాలయాలు, పాఠశాలలు, సామాజిక స్థలాలతో అత్యధికంగా చెట్లు, మొక్కలు, కూరగాయలు పెంచుకోవాలి (Terrace Gardening). బస్తీ, కాలనీ, అపార్ట్మెంట్లో సేంద్రియ విక్రయశాలలు – మేళాలు నిర్వహించుకోవాలి. సేంద్రియ ఆహార పదార్థాలు, గో ఆధారిత వస్తువులు, పంచగవ్య ఔషధాల కిట్స్ (Kits) తయారు చేసుకొని, మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులు, తమ చుట్టుప్రక్కల ఇండ్లలో అమ్మకాలు సాగించాలి. ఈ విషయంలో నగరాలూ, పట్టణాలకూ; గ్రామాలకు మధ్య ఒక అవగాహన ఉండాలి. ఒక్కొక్క బస్తీ – కాలనీ – అపార్ట్మెంట్ దగ్గరలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలి. రైతులకు – గ్రామస్తులకు పెట్టుబడి సమకూర్చి అక్కడి నుండి తమకు కావలసిన ఆహార దినుసులు, పండ్లు, పాలు, గో ఆధారిత వస్తువులు తెప్పించుకునే ఏర్పాటు చేసుకుంటే అందరికీ మంచి జరుగుతుంది.


**– జాగృతి డెస్క్**

ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నాయి. ప్రజల ఆకాంక్షలను తొక్కి పెడుతున్నాయి. ఫక్తు వ్యాపార సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా చెలరేగి పోతున్నాయి. ప్రధానంగా తెలంగాణలో రాష్ట్రం ఆవిర్భవించినప్పటినుంచీ ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. తొలుత పదేళ్ల పాటు పాలన సాగించిన బీఆర్ఎస్ తొలి నుంచీ అలాగే వ్యవహరించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా నాటి బీఆర్ఎస్ సర్కారు దారిలోనే నడుస్తోంది.. కాదు కాదు.. పరుగులు పెడుతోంది.



# హరితవనంపై రేవంత్ సర్కారు

ప్రభుత్వ ఆస్తులైన భూములను అమ్మి ప్రభుత్వాలను నడిపిస్తున్నారు ప్రభుత్వాధినేతలు. అప్పుడు కేసీఆర్ హైదరాబాద్‌లోని భూములను వెతికి వెతికి మరీ అమ్మేశారు. ముఖ్యంగా అత్యంత విలువైన ఐటీ కారిడార్‌లోని భూములన్నీ వేలంలో పెట్టారు. డబ్బులొచ్చాయని సంతోషపడ్డారు. కానీ, ఖజానా చూస్తే ఎప్పుడూ ఖాళీగానే కనిపించింది. ప్రధానంగా రాష్ట్రం ఆవిర్భవించిన సమయంలో మిగులు బడ్జెట్ రాష్ట్రంగా, సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణను పదేళ్లలోనే అప్పుల కుప్పగా మార్చి పడేశారు. పైగా ప్రభుత్వానికి భూములు కూడా లేకుండా చేసేశారు. ఇప్పటి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆ పొరపాట్లను సరిదిద్దుతుందని, ప్రభుత్వం అంటే సంక్షేమమే అని, ప్రజల శ్రేయస్సే అనే నిర్వచనాన్ని తిరిగి అమలులోకి తెస్తుందని విశ్లేషకులు, నిపుణులు, సామాజికవేత్తలు ఇలా అన్ని వర్గాల వాళ్లూ భావించారు.. కాదు కాదు.. ఆశించారు. కానీ, ఆ ఆశలన్నీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడియాసలు చేస్తున్నారు. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై తిట్ల వర్షం కురిపిస్తూనే తాను కూడా అదే దారిలో పయనిస్తున్నారు. అప్పుడేమో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న, ఐటీ కారిడార్‌లో డిమాండ్ ఉన్న అత్యంత విలువైన భూములన్నింటినీ వేలంలో అమ్మేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ హితమైన భూములకు ఎసరు పెడుతోంది. ఈ క్రమంలో జన హితం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం, అటవీ సంపద భద్రత కోసం, మూగజీవులు, అటవీ జీవాల రక్షణ కోసం డిమాండ్ చేస్తున్న విపక్షాలను, నిరసనలకు దిగుతోన్న విద్యార్థులు, సామాజిక, ప్రజా సంఘాల నేతల గొంతును ప్రభుత్వం నొక్కుతోంది. ఏకంగా భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలను గృహనిర్బంధం చేయించింది. పలువురు విద్యార్థులపై కేసులు పెట్టింది. మరికొందరు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు.




**చర్చనీయాంశంగా 400 ఎకరాలు**


హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న 400 ఎకరాల భూముల వ్యవహారం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. ఓవైపు విపక్షాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు నిరసనలతో హోరెత్తిస్తున్నా, మరోవైపు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆ భూములు తమ విద్యా సంస్థ అధీనంలోనే ఉన్నాయని మొత్తుకుంటున్నా, ఇంకోవైపు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చేసిన వ్యాఖ్యలను, వెల్లడించిన అభిప్రాయాలను గుర్తు చేస్తూ బహిరంగ లేఖ రాసినా రేవంత్ ప్రభుత్వం మాత్రం పునరాలోచించడం లేదు. ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. పైగా ముందుకే వెళ్తామంటూ మొండిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం సమీపంలో ఉన్న 'కంచ గచ్చిబౌలి' భూములపై తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ–టీజీఐఐసీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారు. దీంతో, వివాదం మరింత ముదిరింది. ప్రభుత్వం మాత్రం భూమి చదును పేరుతో పదుల సంఖ్యలో జేసీబీలతో ఆ స్థలంలో పనులు కానిస్తోంది. భూములు చదును చేస్తూ, చెట్ల పొదలను తొలగిస్తోంది. అడ్డుకుంటున్న వాళ్లను అరెస్ట్ చేస్తోంది. అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రజా ప్రతినిధులను గృహనిర్బంధం చేస్తోంది.

**పరస్పర విరుద్ధ ప్రకటనలు :**

వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల భూములపై టీజీఐఐసీ, హైదరాబాద్ కేంద్రీయ

విశ్వవిద్యాలయం పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశాయి. శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలో సర్వే నంబరు 25లోని 400 ఎకరాలపై సంపూర్ణ హక్కులు ప్రభుత్వానికి ఉన్నాయని, గత జులైలో వీటికి సర్వే నిర్వహించామని టీజీఐఐసీ పేర్కొనగా.. రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే నిర్వహించలేదని హెచ్‌సీయూ స్పష్టం చేసింది. ఎవరికైనా హెచ్‌సీయూ భూములు బదిలీ చేయాలంటే ఎగ్జిక్యూటివ్ కమిటీ అనుమతి ఉండాలని, ఈసీలో ఆరుగురు సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారని రిజిస్ట్రార్ డాక్టర్ దేవేశ్ నిగమ్ తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో విద్యార్థులు తరగతులు బహిష్కరిస్తున్నారు. నిరవధిక సమ్మెకు కూడా

# గొడ్డలి వేటు




హెచ్‌సీయూ విద్యార్థి సంఘం నేతలు పిలుపునిచ్చారు. అంతేకాదు నిత్యం హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు ఆందోళన చేపడుతున్నారు.

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు ప్రభుత్వానివే అని టీజీఐఐసీ ప్రకటించింది. ఓ ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని ప్రభుత్వం న్యాయపోరాటం ద్వారా దక్కించుకుందని, 2022 సెప్టెంబరు 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం భూ కేటాయింపులకు సంబంధించిన కొత్త విధానం ఆధారంగా 400 ఎకరాలను కొలిచి హక్కులు బదిలీ చేయాలంటూ ఐ అండ్ సీ విభాగానికి గతేడాది జూన్ 19న సూచించిందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఐటీ, ఇతర ప్రాజెక్టులకు 400 ఎకరాలు కేటాయించాలని, భూమిని స్వాధీనం చేయాలని తాము అదే రోజున విజ్ఞప్తి చేశామని, అనంతరం ప్రభుత్వం జూన్ 24న టీజీఐఐసీకి భూమి హక్కులు బదలాయించగా, రెవెన్యూ అధికారులు జులై 1న తమకు అప్పగించారని టీజీఐఐసీ అధికారులు పేర్కొన్నారు. జులై 7వ తేదీన తాము హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌ను వ్యక్తిగతంగా కలిసి ప్రాజెక్టు ప్రతిపాదనలు వివరించామని, జులై 19వ తేదీన రిజిస్ట్రార్, వర్సిటీ అధికారుల సమక్షంలో భూముల సర్వే చేసి హద్దులు నిర్ధారించారని తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టులో వర్సిటీ భూములు లేవని, ఇక్కడి రాళ్ళు అభివృద్ధి పనులు దెబ్బతీయవని, ఇందులో చెరువులు కూడా లేవని టీజీఐఐసీ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు.. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 400 ఎకరాల భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఎలాంటి డిమార్కేషన్ చేయలేదని హెచ్‌సీయూ వీసీ చెప్పారు. తాము దానికి అంగీకరించలేదని రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్ స్పష్టం చేశారు. అక్కడ భౌగోళిక పరిస్థితులను మాత్రమే పరిశీలించారని వివరించారు. పర్యావరణ పరిరక్షణను, జీవవైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఆ భూములను ఇతరులకు కేటాయించొద్దని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిసరాలు కొద్ది రోజులుగా రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఆ భూములతో వ్యాపారం చేయొద్దని, విలువైన ప్రకృతి సంపద, సహజ వనరులను కాపాడాలని, వాటిని విధ్వంసం చేయొద్దని విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే, పోలీసులు ఎప్పటికప్పుడు ఈ నిరసనలను చెదరగొడుతున్నారు.

కంచ గచ్చిబౌలి భూముల వేలంపై కేంద్ర మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మరో కేంద్రమంత్రి బండి సంజయ్ తప్పు పట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాల గొంతునొక్కడం, విద్యార్థులను అణిచివేయడం, పచ్చదనాన్ని, జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేయడం, నిధుల కోసం హైదరాబాద్ పర్యావరణాన్ని పణంగా పెట్టడంపైనే దృష్టిపెట్టిందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వేలం వేయడం.. ఈ ప్రాంతంలోని వృక్షసంపదకు, ఇక్కడ ఉంటున్న జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. అర్ధరాత్రి పూట కూడా బుల్డోజర్లు పెట్టి చెట్లు నేలకూల్చడంతో.. అక్కడుంటున్న జాతీయపక్షులు నెమళ్ల ఆర్తనాదాలు హృదయ విదారకంగా ఉన్నాయని, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల విద్యార్థుల గొంతులను కూడా అక్రమంగా నొక్కేస్తూ.. ఆక్రమణ చర్యలను మొండిగా చేపడుతుండటం దుర్మార్గమన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనలేని చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపేసి.. హైదరాబాద్‌కు ఆక్సిజన్ అందిస్తున్న ఈ ప్రాంతపు అటవీసంపదను, జీవవైవిధ్యాన్ని కాపాడాలని కోరారు.

**కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ :**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలు, వ్యాఖ్యలను తన లేఖలో గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని 400 ఎకరాల ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణలో గ్రీన్ మర్డర్ - బండి సంజయ్ :**

తెలంగాణలో గ్రీన్ మర్డర్ జరుగుతోందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ కోత, కాంగ్రెస్ కోతలు మరింత లోతుగా ఉన్నాయన్నారు. కాళేశ్వరం కోసం బీఆర్ఎస్ 25 లక్షల చెట్లకు గొడ్డలిపెట్టి, హరితహారం ముసుగులో కోనోకార్పస్‌నును బహుమతిగా ఇచ్చిందన్నారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన హరిత విధ్వంసంలో కాంగ్రెస్ చేరిందని విమర్శించారు. అదే గొడ్డలి కానీ కొత్త చేతులని బండి సంజయ్ అభివర్ణించారు.

**బీజేపీ ఎమ్మెల్యేలు గృహనిర్బంధం**

అసలు హెచ్‌సీయూ సమీపంలో ఏం జరుగుతుందో, ఆ భూములు ఎలా ఉన్నాయో పరిశీలించేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించారు. అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సహా.. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. వాళ్లందరినీ ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది.

**మావోయిస్టుల మండిపాటు :**


భూముల వేలం ప్రక్రియపై మావోయిస్టు పార్టీ కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పథకాన్ని రూపొందించారని మండిపడింది. అందులో భాగంగానే యూనివర్సిటీలో ఘోరమైన నిరంకుశ పాలన కొనసాగుతున్నదని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ విడుదల చేయడం కలకలం రేపింది.

**విచారణకు హైకోర్టు అంగీకారం:**

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిటిషన్‌దాఖలయ్యింది. ఈ భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని కోరుతూ వాటా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఉన్నత న్యాయ స్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీంతో, కంచ గచ్చిబౌలి భూములపై విచారణకు హైకోర్టు అంగీకరించింది.

**సుజాత గోపగోని,**
**6302164068, సీనియర్ జర్నలిస్ట్**

రాష్ట్రంలో నిధులు లేక నిలిచిపోయిన 92 కేంద్ర పథకాలు ఊపు అందుకోనున్నాయి. నిధుల లేమితో కునారిల్లుతున్న పథకాలు కేంద్ర సహాయంతో వేగం పుంజుకోనున్నాయి. ఈ పథకాలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తన వంతు నిధులు చెల్లించడం ద్వారా కేంద్రసాయం పొందుతూ, రాష్ట్ర అభివృద్ధికి తిరిగి బాటలు వేసింది. గత వైసీపీ ప్రభుత్వం చూపిన అలసత్వానికి మరమ్మతులు చేయనారంభించింది. కీలకమైన ఈ నిర్ణయంతో రాష్ట్రంపై పడే ఆర్థికభారం సగం వరకు తగ్గిపోనుంది.



# కునారిల్లుతున్న పథకాలకు 'నిధుల'

రాష్ట్రంలోని వివిధ రంగాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా ముందుకు సాగుతుంటాయి. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం కూడా నిధులను కేటాయిస్తుంటుంది. ప్రత్యేకించి కొన్ని పథకాలకు రాష్ట్ర వాటా చెల్లించాక కేంద్ర ప్రభుత్వం తన వంతు నిధులను విడుదల చేస్తుంటుంది. ఆ నిధులతో పెద్ద ఎత్తున వివిధ పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. అయితే రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో సుమారు 92 పథకాల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఈ దశలో కూటమి ప్రభుత్వం అందుకు సంబంధించిన రూ. 7,230 కోట్ల పెండింగ్ నిధులతో పాటు 2025–26 సంవత్సరానికి సంబంధించి చేపట్టబోయే కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా నిధులు కలిపి రూ. 12,336 కోట్లు విడుదలయ్యాయి. దీంతో రాష్ట్రంలో నిలిచిపోయిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు తిరిగి మోక్షం లభించినట్లయింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధికి ఊతం లభించినట్లయింది.




2019–20 మధ్య కాలంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్రం తన చెల్లించక పోవడంతో ఆయా పథకాలకు సంబంధించిన కేంద్ర వాటా నిధులు మురిగిపోయాయి. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగానే రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు కూడా టెండర్లు పిలిచేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసింది. పోలవరం ప్రాజెక్టుతో పాటు మరికొన్ని పథకాలపై కూడా ఫోకస్ పెంచింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం నుంచి రావలసిన పెండింగ్ నిధులు, పాత బకాయిలు కూడా రాబట్టేలా రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోంది. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలను కూడా రాష్ట్రంలో తిరిగి పునఃప్రారంభించాలని సంకల్పించింది.

**రాష్ట్రంలో పనులు పునరుద్ధరణ**

కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటాను కేంద్రానికి చెల్లించడంతో వివిధ పనులు పునరుద్ధరణ కాబోతున్నాయి. ప్రధానంగా గ్రామీణాభివృద్ధికి 9పథకాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకోబోతున్నాయి. అందులో భాగంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ. 1000 కోట్లకు పైగా పెండింగ్ నిధులను విడుదల చేశారు. అలాగే ప్రస్తుత ఏడాది పనులకు సంబంధించిన రూ. 1,873 కోట్లు చెల్లించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమానికి సంబంధించిన రూ. 571 కోట్లు పెండింగ్ వాటా, రూ. 875 కోట్లు ప్రస్తుత వాటా నిధులను విడుదల



# ఊపిరి

చేశారు.

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, స్వచ్ఛభారత్ పథకం...ఇలా వివిధ పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులను చెల్లించింది. దీంతో ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు తిరిగి పునరుద్ధరణ కాబోతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 10 పథకాలకు సంబంధించి తిరిగి కార్యక్రమాలు, అందులో ప్రధానంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఊపందుకోబోతున్నాయి. అందుకోసం గతంలో పెండింగ్‌లో న్న రూ.164 కోట్లతో పాటు ప్రస్తుత ఏడాదికి నంబంధించి రూ.1851 కోట్లు చెల్లించింది.మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించి కూడా 8 కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు తిరిగి విడుదల కాబోతున్నాయి. సంబధిత పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. దీంతో మహిళలకు సంబంధించిన అనేక సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ప్రారంభం కాబోతున్నాయి. వ్యవసాయాభివృద్ధికి కూడా 17 పథకాలకు సంబంధించి పెండింగ్ బకాయిలను చెల్లించారు. దీంతో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రైతులకు తిరిగి అభివృద్ధి ఫలాలు అందుబాటులోకి రాబోతున్నాయి.

**వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ఇలా....**

కేంద్ర పథకాల నిధులను వినియోగించక పోవడం, దుర్వినియోగం చేయడంలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకానికి జల్‌జీవన్ మిషన్ (జేఎంఎం)ను ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. 2018 ఆగస్టులో ప్రారంభమైన జేజేఎం కింద ఏపీలో రూ.27,248 కోట్ల అంచనాతో 77,917 పనులను కేంద్రం ఆమోదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం నిధులను సమకూర్చాలన్న ఒప్పందానికి జగన్ సర్కార్ తూట్లు పొడిచింది. 2019–20 నుంచి 2023–24 మధ్య కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.2,254.89 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర వాటా కింద రూ.1630.36 కోట్లను గత సర్కార్ ఇచ్చింది. పనులు చేసిన గుత్తేదారు సంస్థలకు రూ.535.50 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు సరిగ్గా ఇవ్వకపోవడంతో, జల్‌జీవన్ మిషన్ అమలు సమస్యాత్మకంగా మారింది.

అదే విధంగా రూ.4,976 కోట్ల అంచనాతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ఆర్థిక సాయంతో చేపట్టిన గ్రామీణ రహదారుల నిర్మాణ పనులకూ ఏపీ గత ప్రభుత్వం తన వంతు వాటా నిధులను సక్రమంగా విడుదల చేయలేదు. మరోవైపు డ్యాంల భద్రతకు కేంద్రం అమలు చేస్తున్న పథకంలో ప్రపంచ బ్యాంకు సాయంలో కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్రం 30 శాతం నిధులు భరించవలసి ఉంది. ఆ 30 శాతం భరించేందుకు జగన్ సర్కార్ ముందుకు రాలేదు. దీంతో ప్రాజెక్టుల భద్రతకు కేంద్రం ఇచ్చే నిధులను సరిగా ఉపయోగించుకోలేదు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి గతంలో కేంద్ర ప్రభుత్వ కృషి సించాయి యోజన కింద తుంపర సేద్యం పథకానికి డ్రిప్, స్ప్రింక్లర్లు అధిక సబ్సిడీతో ఇచ్చేవారు. పండ్ల మొక్కలు ఉచితంగా ఇవ్వడం, తొలుత మూడు సంవత్సరాల పాటు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి నిధులు ఇవ్వటం, తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ల ఇవ్వటం వంటి కొన్ని ప్రోత్సాహకాలను అందించారు. దీనివల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అయితే వైసీపీ ప్రభుత్వం డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయడాన్ని నిలిపివేయడంతో సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు, రైతులపై అదనపు భారం పడింది.


వ్యవసాయంలో సాంకేతిక అమలుకు డ్రోన్‌ల వినియోగం కోసం కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాన్ని రాష్ట్రంలో అమలుచేయడంలో నాటి వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10778 ఆర్‌బీకేల్లో ఒక్కొక్కటి చొప్పున డ్రోన్‌లను వినియోగించాలని నిర్ణయించారు. మొత్తం వ్యయం రూ.1,070 కోట్లు. అందులో 50 శాతం రాయితీ ప్రకారం చూసినా కేంద్ర, రాష్ట్రాల వాటా రూ.500 కోట్లే అవుతుంది. అందులోనూ కేంద్రం ఇచ్చేది రూ.400 కోట్లు. రాష్ట్రం కనీసం రూ.100 కోట్లు ఖర్చు పెడితే సరిపోయేది. డ్రోన్ ప్రాజెక్టుకు అడుగులు పడేవి. అయితే జగన్ ప్రభుత్వం ఆ మాత్రం కూడా ఖర్చు చేయలేదు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. రాష్ట్రంలో యాంత్రీకరణ సహా పలు పథకాలను అటకెక్కించింది. కనీసం టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆధునిక యంత్ర పరికరాలు కూడా ఇవ్వలేమంటూ చేతులెత్తేసింది. రైతులకు సూక్ష్మ పోషకాల పంపిణీని నిలిపివేశారు.


కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణానికి నిధులు ఇచ్చినా వాటిని గత ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదు. రాష్ట్రంలో 55,745 అంగన్వాడీ కేంద్రాలుండగా వాటిలో 23,279 (41.75%) అద్దె భవనాల్లో, 410 (7.9%) పాక్షిక పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి.రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 1,743 కేంద్రాలు అద్దె భవనాల్లో, 1,095 కేంద్రాలు పాక్షిక పక్కా భవనాల్లో నడుస్తున్నాయి. కాకినాడ, పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోనూ వెయ్యికి పైగా కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మిషన్ పోషణ్ 2.0 ప్రారంభించిన నాటినుంచి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో 1,864 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి అనుమతినిచ్చారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2021–22 నుంచి 2024–25 వరకు ఎలాంటి ప్రతిపాదనలూ సమర్పించక పోవడంతో పథకం కింద ఎలాంటి నిధులూ విడుదల చేయలేదు.

నగరాల్లో వాయు నాణ్యతను మెరుగుపరచడానికి జాతీయ స్వచ్ఛవాయు కార్యక్రమం కింద రాష్ట్రంలోని 13 నగరాలకు రూ.361 కోట్లు విడుదల చేయగా, గత ప్రభుత్వం అందులో రూ.173 కోట్లు (48%) మాత్రమే ఖర్చు చేసింది. ఇందులో విజయవాడకు రూ.130 కోట్లు విడుదల చేయగా, కేవలం రూ. 46 కోట్లు (35%), విశాఖకు రూ.129 కోట్లకుగాను రూ.39 కోట్లు 30 (23%) మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన 11 నగరాలకు ఇచ్చిన రూ.102 కోట్లలో రూ.88 కోట్లు (86.27%) ఖర్చయ్యాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కేంద్ర పథకాలను నాటి వైసీపీ ప్రభుత్వం అమలుచేయక నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**



# ఒంటిమిట్ట విలక్షణ

**ఒకప్పుడు రాజులు–రాజప్రాసాదాలు,కోటలతో, సత్రాలు–అన్నసత్రాలతో కళకళలాడిన నగరం ఒంటిమిట్ట. రాజులు రాజ్యాలు పోయినా, కోటలు, బురుజులు శిథిలమైనా, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఠీవిగా నిలబడింది. రామయ్య నడయాడిన స్థలం. జాంబవంతుడు ప్రతిష్ఠించిన శ్రీరాముడు. హనుమంతుడు లేని రామాలయం. ఆంధ్రా అయోధ్యగా, ఏకశిలానగరంగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం. సీతా, రామ, లక్ష్మణులు ఒకే శిలమీద దర్శనమిచ్చే దృశ్యం. ఎన్నో చారిత్రక, మరెన్నో పౌరాణికి ఘట్టాలకు వేదిక. ప్రకృతి సోయగానికి నిలయం. పరమ భాగవతోత్తముడు పోతనామాత్యుడు కొంతకాలం నివసించిన ప్రదేశం. ఆయన భాగవతం పుట్టిందిక్కడే. ఇతర శ్రీరామ క్షేత్రాలు, ఆలయాలకు భిన్నంగా ఇక్కడ సీతారాముల కల్యాణం పండువెన్నెల్లో జరగడం ఏమిటి? ఇక్కడ రాముని వెంట హనుమ లేకపోవడానికి కారణం? ఈ క్షేత్రానికి 'ఒంటిమిట్ట' పేరు లాంటి అంశాల నేపథ్యాన్ని పరిశీలిస్తే...**

---

ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామాలయం ఆంధ్రా భద్రాద్రి, తెలుగువారి అయోధ్యగా ప్రసిద్ధి. ఒకప్పుడు అంటే త్రేతాయుగంలో ఈ ప్రాంతం కీకారణ్యంగా ఉండేది. ఇది మహర్షులకు వారు చేసే యజ్ఞయాగాదులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. తమ యజ్ఞయాగాదులకు ఆటంకం కలిగిస్తున్న రాక్షసుల నుంచి తమను కాపాడాలని మృకండు, శృంగి తదితర మహర్షులు శ్రీరాముని వేడుకున్నారు. వనవాసంలో ఉన్న రాముడు సీతాలక్ష్మణ సమేతుడై అమ్ములపొది, పిడిబాకు, కోదండం చేపట్టి వచ్చి యాగ రక్షణ చేశాడని, దానికి కృతజ్ఞతగా ఆ మహర్షులు ఏకశిలమీద సీతారామ లక్ష్మణుల విగ్రహాలను చెక్కించారనీ, ఆ తరువాత జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రతిష్ఠించాడని స్థలపురాణం. ఏ రామాలయంలోనైనా రామయ్యకు కుడివైపు లక్ష్మణుడు, ఎడమ వైపు సీతాదేవి, పాదాల దగ్గర నమస్కార భంగిమలో హనుమ విగ్రహాలు దర్శనమిస్తాయి. కాని ఒంటిమిట్టలో మాత్రం సీతమ్మ, లక్ష్మణుడితోనే రామయ్య దర్శనమిస్తాడు. ఆలయం వెలుపల తరువాతి కాలంలో హనుమాన్‌కు విడిగా నిర్మించిన చిన్న గుడి మాత్రం ఉంటుంది. శ్రీరాముడు ఇక్కడకు వచ్చేసరికి ఆంజనేయుని కలుసుకోవడం జరగలేదని అందుకే ఇక్కడ ఆంజనేయుడు రామయ్య దగ్గర లేడని ఓ కథనం.

ఈ గ్రామానికి ఒంటిమిట్ట అని పేరు రావడానికి కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. ఈ ఆలయం ఒక మిట్టమీద నిర్మితం కావడం 'ఒంటిమిట్ట' రామాలయమనే పేరు వచ్చిందని ఒక కథనం. ఒంటడు,మిట్టడు వారు దారి దోపిడీలకు పాల్పడి చోరీ సొత్తును ఈ ప్రాంతంలోని గుహల్లో దాచుకునే వారు. ఒకసారి వారికి కోదండరాముడు దర్శనమివ్వడంతో ఆ దొంగల బుద్ధి మారి సన్మార్గంలోకి వచ్చి స్వామివారికి గుడి కట్టించారని, అలా ఈ క్షేత్రానికి వారి పేరు మీద 'ఒంటిమిట్ట' అని పేరు వచ్చిందని ఓ జానపద కథ. మరో కథనం ప్రకారం, ఈ ప్రాంతంలో ఒంటడు, మిట్టడు అనే బోయ సోదరులు ఉండేవారు. ఉదయగిరి పాలకుడు కంప రాజు ఒకసారి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఈ సోదరులు ఆయనకు సేవలు అందించి పరిసర ప్రాంతాలను చూపాడట. అందుకు ప్రతిగా, 'నాకు ఇంత సంతోషం కలిగించిన మీరు ఏదయినా కోరుకోండి' అనడంతో రామాలయం కట్టించాలని అర్థించారట. ఆలయ నిర్మాణానికి అవసరమైన ధనాన్ని వారికిచ్చి ఆ ఆలయాన్ని కట్టించే బాధ్యతను రాజుకు అప్పగించాడు. ఎంతో భక్తిశ్రద్ధలతో కొన్నేళ్లు కష్టపడి ఈ ఆలయాన్ని నిర్మించారట. అలా ఈ గ్రామానికి వారి పేరు మీద ఒంటిమిట్ట అని, ఆలయానికి ఒంటిమిట్ట రామాలయం అనే పేరు వచ్చిందని అంటారు. ఆలయంలోని విగ్రహాలను ఒకేశిలలో మలచడం వల్ల 'ఏక శిలా నగరం' అనే పేరు వచ్చిందని చెబుతారు.

ఇక రామయ్యకల్యాణం విషయానికి వస్తే... అన్ని క్షేత్రాలు, రామాలయాల్లో చైత్ర శుద్ధ నవమి నాడు కల్యాణం నిర్వహిస్తే, ఒంటిమిట్టలో నవమి తిథికి బదులు చతుర్దశి రాత్రి కల్యాణం జరుగుతుంది. దీని వెనుక ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. తన సోదరి శ్రీమహాలక్ష్మికి నారాయణమూర్తితో పగటి పూట పెళ్లి జరగడంతో తనకు చూసే భాగ్యం కలగడంలేదని రేరాజు చంద్రుడు బాధపడ్డాడట. దానికి భవిష్యత్‌లో తన కోరిక నెరవేరుతుందని అభయ మిచ్చాడట విష్ణుమూర్తి. అలా ఈ ఆలయంలో చైత్ర శుద్ధ నవమినాడు కాకుండా చతుర్దశి రాత్రివేళ సీతారాముల కల్యాణం జరుగుతుంది.

రామాయణం ప్రకారం సీతారాముల వివాహం చైత్ర మాసంలో ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో జరిగిందని, ఒంటి మిట్టలోనూ అదే రోజున కల్యాణం నిర్వహించాలని విజయనగర సామ్రాజ్య నిర్మాతల్లో ఒకరైన బుక్కరాయలు నిర్ణయించారట. అదే ఆనవాయితీ నేటికీ కొనసాగుతోందని చెబుతారు. కారణం ఏదైనా ఇతర రామాలయాలకు భిన్నంగా ఒంటిమిట్ట రామయ్య కల్యాణం పున్నమి కాంతుల్లో జరగడం విశేషంగా చెప్పుకోవలసిన విషయం.

ఇక భక్తకవి బమ్మెర పోతనామాత్యుడు తాను ఏకశిలపురవాసిగా స్వయంగా ప్రకటించినట్లు చెబుతారు. అయితే ఆ ఏకశిలాపురం ఈ ఒంటిమిట్ట కాదని, ఓరుగల్లు అని కొన్ని చారిత్రిక కథనాలున్నాయి. ఆయన ఓరుగల్లు నివాసి కాదు ఒంటిమిట్ట వాసి అని వాదనలున్నాయి. దానికి తగిన ఆధారాలను కూడా చూపిస్తారు చరిత్రకారులు.రామదర్శనం పొంది భాగవతం రచన చేసి ఒంటిమిట్ట లోని కోదండ రామునికే అంకితం చేశారని, భాగవత రచనలో కడప మాండలిక పదాలు కూడా ఉండడం, వారి స్వస్థలం ఇదే అనడానికి మరోబలమైన సాక్ష్యమని అంటారు. దీనికి రుజువుగానే ఒంటి మిట్ట కోదండరాముని ఆలయంలో ముఖమండపం నుంచి గర్భాలయానికి వెళుతున్నపుడు ద్వారానికి బయటే కుడివైపున ఉన్న పోతన విగ్రహం అని కూడా కొందరు పండితులు బలంగా నమ్ముతారు. మహాభాగవతం రచన సందర్భంగా గజేంద్ర మోక్షంలో 'అల వైకుంఠ పురంబులో' అనే పద్యంలో కొన్ని చరణాలు



# రామన్నకు కల్యాణం



రాయడానికి సరైన ఆలోచన రాక అక్కడ రాయడం ఆపగా, సాక్షాత్తూ శ్రీరాముడే ఆ పద్యాన్ని పూర్తి చేశాడని చెప్తారు. శ్రీరామ తీర్థానికి తూర్పున ఆయన సేద్యం చేసిన పొలాలు ఉన్నాయి. ఆయన ఇల్లు శిథిలంకాగా,అక్కడే దైవయోగంతో మరో ఇల్లు నిర్మితమైందనేవి ఆయన ఒంటిమిట్ట వాసి అనడానికి రుజువులుగా చెబుతారు., పోతనమర్యాద అన్న పేరుతొ బమ్మెరపోతన జయంతి రోజున కవిపండితు లను సత్కరించడం ఇలా చాలా విషయాలే పోతన ఈ ఒంటిమిట్టలోనే ఉన్నాడని రుజువు చేసే సాక్ష్యాలు అంటారు కొందరు చరిత్రకారులు.

అదే సమయంలో పోతన నేటి తెలంగాణలోని ఏకశిలాపురానికి చెందినట్లు కొన్ని చారిత్రిక కథనాలు చెప్తున్నాయి. మొత్తానికి ఆయన జన్మస్థలం అంశం చారిత్రక వివాదంగానే మిగిలిపోయింది.

సుమారు 500 సంవత్సరాల క్రితం విజయనగర రాజు సదాశివరాయల కాలంలో గర్భాలయం, తూర్పు ముఖ మండపం, గాలిగోపురం మూడు దశల్లో నిర్మించినట్టు శాసనాలను బట్టి తెలుస్తోంది. ఈ ఒంటిమిట్ట గ్రామంతో పాటు చుట్టుపక్కల మరికొన్ని గ్రామాలను అప్పటి ఆ ప్రాంత పాలకులు ఆలయానికి దానం చేసినట్లు కూడా శాసనాలు చెబుతున్నాయి. ఒకప్పుడు ఈ క్షేత్రం ఎందరో మహాకవులకు, కళాకారులకు నిలయంగా ఉండేది. ప్రౌఢదేవరాయల ఆస్థానంలోని అయ్యల తిప్పరాజు ఈ ప్రాంతీయుడే. ఈయన మనవడే 'అష్టదిగ్గజ కవులు'లో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు. తిప్పరాజు, అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పు గుందూరు వేంకటకవి, వరకవి మొదలైన పేరెన్నికగన్న కవులెందరో కోదండరామునికి అక్షరార్చన చేశారు.

ఈ దేవాలయం కాలగతిలో ఎన్నో ఒడుదొడు కులు, ప్రకృతి వైపరీత్యాలు,దోపిడీలు, దొంగతనాలు, దాడులు, ఘాతకాలకు ఇలా చాలానే తట్టుకొని నిలబడిందంటారు. వైభవాన్ని కోల్పోయి మరుగున పడిన పరిస్థితిలో వాసుదాసుగా ప్రసిద్ధి చెందిన వావిలకొలను సుబ్బారావు అవిరళ కృషితో పునరుద్ధరణ జరిగింది. భద్రాచలం శ్రీరామునికి రామదాసుకు ఉన్న అవినాభావ సంబంధమే ఒంటిమిట్ట కోదండరామునికి వావికొలనుకు ఉందని పెద్దలు చెబుతారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించి, 'ఆంధ్ర వాల్మీకి'గా పేరుపొందిన వావిలకొలను (1863–1936) రెవెన్యూ శాఖలో ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఆలయ పునరుద్ధరణకు జీవితాన్ని అంకితం చేశారు. ఎందరో రాజులు, జమీందారులు, సంపన్నులు ఇచ్చిన వందలాది ఎకరాల భూములు, సంపద అన్యాక్రాంత మయ్యాయి. నైవేద్యం పెట్టే నాథుడు కూడా లేని జీర్ణదశకు చేరుకుంది ఆలయం. అలాంటి సమయంలో వావిలకొలను సుబ్బారావు ఒంటిమిట్టలో నివాస మేర్పరచుకొని ఆలయ పునరుద్ధరణకు పూనుకున్నారు. టెంకాయ చిప్ప చేత పట్టుకొని, ఊరూరా పాద యాత్రతో ధనం సేకరించి ఆలయాన్ని పునరుద్ధ రించారు. ఈ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన వావిలకొలనుకు రామలక్ష్మణులు బైరాగుల రూపంలో దర్శనమిచ్చారనే కథనం ప్రచారంలో ఉంది.

ఈ ఆలయంలోని 'రామబుగ్గ' కాలక్రమంలో రామతీర్థంగా మారింది. దీనిని సీతమ్మ కోసం రాముడే ఏర్పాటు చేశాడని అంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామికి ఇక్కడే చక్రస్నానం నిర్వహించే వారు. ఆ తరువాత ఆలయానికి ఎదురుగా మరో పెద్ద నూతన పుష్కరిణి నిర్మించారు.

ఒంటిమిట్ట కోదండరాముని మహిమల గురించి ఉన్న కథలలో ఒకదానిని ఉదాహరణగా చెప్పుకుంటే... 1640 ప్రాంతంలో కడప ప్రాంత పాలకుడైన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒకసారి ఆలయం వద్దకు వెళ్లి 'మీ దేవుడు పిలిస్తే పలుకుతాడా?' అని అక్కడి భక్తులను అడిగాడట. 'చిత్తశుద్ధితో పిలిస్తే కచ్చితంగా పలుకుతాడే' అని వారు సమాధానం ఇచ్చారు. ఆ ప్రకారం ఆయన ఆలయ ద్వారం దగ్గరకు వెళ్లి మూడు సార్లు రాముణ్ణి పిలవగా, ప్రతిగా మూడుసార్లు 'ఓ' అని సమాధానం వచ్చిందట. దాంతో ఆయన స్వామి భక్తుడిగా మారిపోయాడని కథనం. భక్తుల కోసం ఏదైనా మేలు చేయాలన్న భావనతో మంచినీటి బావిని తవ్వించాడు. అది 'ఇమాంబేగ్ బావి' అని ప్రసిద్ధి చెందింది. అప్పటినుంచి ఎందరో ముస్లిం భక్తులు కూడా ఈ ఆలయాన్ని, ఇమాంబేగ్ బావిని సందర్శిస్తూ ఉంటారు.

ఈ క్షేత్రానికి విమాన, రైలు, రోడ్డు మార్గాలలో చేరుకోవచ్చు. విమానంలో వచ్చేవారు కడప విమానా శ్రయంలో దిగి, అక్కడి నుంచి వివిధ రకాల వాహనాలలో ఒంటిమిట్టకు చేరవచ్చు. మరో విమానాశ్రయం రేణిగుంట.. అక్కడికి 112 కిలోమీటర్ల దూరంలో ఉంది. రైలు మార్గం ద్వారా అయితే అక్కడి స్టేషన్‌లో దిగి కిలోమీటర్ దూరంలోని ఆలయానికి చేరవచ్చు. కడపలో దిగితే అక్కడి నుంచి 25 కి.మీ ప్రయాణించవలసి ఉంటుంది..

**– మావూరు విజయలక్ష్మి**

నెల రోజుల తరువాత సమీరతో నా పెళ్లి జరిగింది. మూడు రోజుల పెళ్లికి మధు, శ్రీరామ్, ఊరి వారందరూ వచ్చారు. బావ శ్రీధర్ కూడా అమెరికా నుంచి వచ్చాడు. మా మావ చనిపోయిన తరువాత ఇప్పుడు మా కుటుంబాలు ఒకటయ్యాయి. మా పెళ్లి జరిగినందుకు మా అత్త చాలా సంతోషించింది. మా మామ కక్ష వల్ల దూరమయ్యాం కానీ మా అత్తకు మొదటి నుంచీ మా పెళ్లి ఇష్టమే అనీ ఆమె మాటల వల్ల తెలిసింది.

శ్రీరామ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. మధు ఆమెతో సహ జీవనానికి స్వస్తి చెప్పి విడిగా ఉంటున్నాడు. ఇద్దరికీ నప్పలేదుట. ఆమె వాడి మీద పెత్తనం చెలాయి స్తుండటంతో ఆ గొడవలు మరింత పెరిగి ఇద్దరూ విడిపోయారట. సహజీవనంలో ఉన్న లాభం అదే... కోర్టులు గొడవలూ లేకుండా సామరస్య పూర్వకంగా విడిపోవచ్చు. పిల్లలు కలిగితే ఇబ్బందవుతుంది. కానీ వాళ్లకు ఆ ఇబ్బంది లేదు.

పెళ్ళి మర్నాడు వెళ్లి పోతామన్న ఇద్దరూ సమీర కోరికపై మరో రెండు రోజులు ఉండటానికి ఒప్పుకున్నారు.

ఒకరోజు వేం ముగ్గురం మా పొలానికి వెళ్లినపుడు మా మధ్య నా కోచింగ్ కేంద్రం ప్రస్తావన వచ్చింది. "విశాఖపట్నంలోని కోచింగ్ ఇనిస్టిట్యూట్ లాంటిదే హైదరాబాద్‌లో పెడితే అక్కడ బాగా అభివృద్ధి చేయవచ్చు" అని శ్రీరామ్‌తో చెప్పాను.

"శ్రీరామ్ ... మీరిద్దరూ కొంత డబ్బు పెట్టండి. మేము కొంత పెడతాము. అక్కడ ఒక కేంద్రాన్ని ప్రారంభిస్తే మీరిద్దరూ దాన్ని మేనేజ్ చేయవచ్చు. అలా మనమే కొందరికి ఉపాధి కల్పించవచ్చు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో మనం ఇమడలేము. పైగా ఒత్తిడెక్కువ. ఉద్యోగాలు ఎన్నాళ్లుంటాయో తెలియదు. తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటివి ఈ ఉద్యోగాలు. 40 సంవత్సరాల వయస్సులో ఉద్యోగ భద్రత లేకపోతే మన ఆరోగ్యం మీద ప్రభావం చూపుతుంది. కాబట్టి మీరిద్దరూ ఆలోచించి ఓ నిర్ణయానికి రండి. మీకిష్టమైతే రేపే విశాఖపట్నం వెళ్లి వారం రోజుల పాటు ఆ కేంపస్‌ని గమనించండి. మనకు ఆ కేంద్రాన్ని నడిపే అనుభవం ఉంది కాబట్టి హైదరాబాద్ కేంపస్ ప్రారంభించటం పెద్ద కష్టం కాదు. నెలరోజుల్లో దాన్ని ప్రారంభించవచ్చు. పైగా విశాఖపట్నం కేంద్రానికి పేరొచ్చింది. కాబట్టి అదే పేరుతో కేంపస్‌ని ప్రారంభిస్తే పెద్దగా పబ్లిసిటీ అవసరం కూడా ఉండదు. ఇలా మనం వీటిని



'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

ప్రారంభిస్తే మంచి అనుభవం వస్తుంది. దాంతోపాటు ఎంతోమంది విద్యార్థులకు మంచి శిక్షణనిచ్చి వాళ్లకు ఉద్యోగవకాశాలను కల్పించే అవకాశం కలుగుతుంది. దానివల్ల జాబ్ శాటిస్ ఫాక్షన్ కలుగుతుంది. స్వేచ్ఛ కూడా ఉంటుంది. ఒకరి కింద పనిచేసే అవసరం ఉండదు” అని చెప్పాను.

వాళ్లిద్దరూ నేను చెప్పినవన్నీ వినీ చాలాసేపు తర్జభర్జన పడి చివరకు ఒప్పుకున్నారు. శ్రీరామ్ తన దగ్గర పదిలక్షలున్నాయనీ, అది ప్రస్తుతానికి ఖర్చు చేస్తాననీ చెప్పాడు. మధు కూడా మరో పది లక్షలు, మిగతా సొమ్ము నేను పెడతాననీ చెప్పాను...

ఇప్పుడు మా స్నేహితుల సమస్యలన్నీ ఓ కొలిక్కి వచ్చాయి. మొన్నటి దాకా సమీరకు ఎన్నో సమస్యలు... నాతో పెళ్లితో అవి తీరిపోయాయి. ఇప్పుడు వాళ్లిద్దరివి కూడా ఈ కోచింగ్ కేంద్రం ద్వారా తీరిపోతాయి...

“ఏరా! మీకు జీవితం ఎలా అనిపిస్తోంది” అనీ అడిగాను...

“చిన్నప్పుడే బాగుండేదనిపిస్తోందిరా? అప్పుడు బాదరబందీలు ఉండేవి కావు. ఇప్పుడు అన్ని సమస్యలే.అమెరికా అంటే దూరపు కొండల నునుపు.దూరం నుంచి బాగుంటుంది. దగ్గర కెళితే తెలుస్తుంది. అందరూ మన తూరుపు నుంచి పడమరకి అంటే అమెరికా, కెనడా, బ్రిటన్లు వెళు తునారు కానీ చాలా మంది అక్కడ ఇమడకలేక తిరిగి తూర్పుకి రావలసిందే. పడమరన అస్తమించే రవిబింబం ఉదయాన్నే తూర్పులో ఉదయించక తప్పదు.” అన్నాడు శ్రీరాం నిర్వేదంగా.

“బాల్యం ఎప్పుడూ బాగుంటుందిరా...ఎన్ని అనుభూతులు, ఎన్ని సరదాలు... ఇప్పుడవన్నీ ఏవి? “ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు?” అని ఓ కవి అన్నట్లు ఆ అనుభూతులు, ఆనందాలు ఎక్కడ? ఎంత తీయటిది మన బాల్యం...

***“ఎగరేసిన గాలిపటాలు,***
***దొంగాటలు, దాగుడు మూతలు***
***ఏటిగట్లపై కట్టిన పిచ్చుక గూళ్లు***
***వర్షం లో వదిలే కాగితం పడవలు***
***కర్రాబిళ్లా ఆటలు***
***కబాడీ ఆటలో తగిలిన దెబ్బలు***
***ఏట్లో ఈదినపుడు నాన్న చూపే కోపాలు***
***సైకిలు నేర్చుకున్నపుడు బెణికిన కాళ్లు***
***తోటల్లో రాళ్లతో కొట్టిన మామిడికాయలు***
***పొట్లాల్లో ఉప్పుకారాలు***
***అవి తింటుంటే కళ్ల నుంచి కారే నీళ్లు***
***సంతలో కొన్న దసరా బాణాలు***
***అవన్నీ చిన్ననాటి ఆనవాళ్లు***
***స్నేహంలో మైలు రాళ్లు”...***

అనీ నేను చెప్పగానే వాళ్ళిద్దరి కళ్లల్లో నీళ్లు చెమ్మగిల్లాయి.

“ఎంత బాగా చెప్పావురా మన బాల్యాన్ని... ఆ




గేయంలో మన బాల్యం కనిపిస్తోంది. చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది” అన్నాడు మధు.

ఆ తరువాత మేము ఇంటికి తిరిగి వచ్చేసాము.

* * *

కాలచక్రం తిరుగుతోంది. నేను ప్రారంభించిన రెండు కోచింగ్ కేంద్రాలు బాగా నడుస్తున్నాయి. విశాఖపట్నం కేంద్రం సమీర అధ్వర్యంలో బాగా పనిచే స్తోంది. సమీర ఇప్పుడు బాగా బిజీ అయిపోయింది. అక్కడ ఇల్లు కొన్నాను. నేను వారం మధ్యలో వెళుతుంటాను. మళ్లీ ఇద్దరం శనివారం మా ఇంటికి వస్తూ మూడు రోజులు గడుపుతాము. అప్పుడు వ్యవసాయం చూసుకుంటూ ఉంటాను. వ్యవసాయంలో కూడా సమీర నాకు సహాయ పడుతుంటుంది. ఇప్పుడు మాకు ఒక బాబు... పరాశర్...మా గోత్రం పేరే పెట్టుకున్నాము. మా అమ్మకి వాడితో బాగా కాలక్షేపం.ఇక హైదరాబాద్ కేంపస్‌ని మధు, శ్రీరాం బాగా నడుపుతునారు.

నా పెట్టుబడిని తిరిగి ఇచ్చేసారు. ఇప్పుడు వాళ్లిద్దరే దానికి యజమానులు. ఇద్దరూ వివాహాలు చేసుకున్నారు. ఇద్దరికీ పిల్లలు...

ఎన్నో ఒడుదుడుకులతో సాగిన మా నలుగురి జీవితాలు ప్రశాంతతను సంతరించుకుంటున్నాయి. జీవితం అంటేనే కష్టసుఖాలు, చీకటి వెలుగుల సంగమం. కష్టం ఉంటేనే సుఖం విలువ, రాత్రి ఉంటేనే పగలు గొప్పదనం, ఎండ ఉంటేనే నీడ విలువ తెలుస్తాయి. సుఖాల్లో ప్రతివాళ్లు నవ్వుతారు. కష్టాల్లో నవ్వేవాడే గొప్పవాడు.

కష్టాలతరువాత వచ్చే సుఖం చాలా ఆనందాన్ని ఇస్తుంది .అందుకే ఏదొచ్చినా మనమంచికే అనీ ముందుకు సాగిపోవాలన్నది నా సిద్ధాంతం. గౌతముడి శాపం అహల్యకు రామదర్శనం కలిగించినట్లు ఒక కష్టం ఇంకో సుఖానికి దారి తీస్తుంది. కష్టాలు మనకు పాఠాలు నేర్పుతాయి. ఎలా జీవించాలో, ఎలా ముందుకెళ్ళాలో చెబుతాయి.

ఎలాగైతేనేం ఈ తూర్పు నుంచి ఆ పడమరకి వెళ్లిన ముగ్గురూ మళ్లీ తూర్పుకి వచ్చి ఉదయించి వెలుగులు విరజిమ్ముతూ ముందుకెళుతునారు.


చాలామంది ఉద్యోగం, పెళ్లి తరువాత కథ ముగిసిపోతుంది అనుకుంటారు కానీ అది నిజం కాదు. మళ్లీ కష్టాలు వస్తాయి. సుఖాల కోసం ప్రయత్నిస్తూ ముందుకెళ్ళాలి. జీవితంలో కష్టసుఖాలు కావడి కుండలు లాంటివి. కలిమి లేముల రంగుల రాట్నంలో లాగ వచ్చి పోతుంటాయి...

తూరుపు– పడమర ఎదురెదురు. అవి సమాంతర రేఖల్లా కలవని దిక్కులు... రైలు పట్టాలు కూడా అంతే... రైలు పట్టాలు కలవకుండా ఎడంగా ఉంటేనే మనం గమ్యం చేరుకుంటాము...

మన తాత ముత్తాతల తరంలో ఎవ్వరూ పడమర వైపు వెళ్లే సాహసం చెయ్యలేదు. ఆ తరువాత మా తరం చొరవతో అమెరికా బాట పట్టి మళ్లీ తూర్పు వచ్చారు. మా పిల్లల తరం మళ్లీ ముందుకు వెళ్లవచ్చు...

తాతల నుంచి తండ్రుల మీదుగా మన నుంచి పిల్లలకు సంప్రదాయాలు, కుటుంబ గౌరవాలు అన్నీ సంక్రమించాలి. అదే శాఖా చంక్రమణం... ఇదే జీవన సౌరభం... దాని పరిమళాన్ని జీవితమంతా ఆస్వాదిస్తూ ఆనందంగా ముందుకెళ్లాలి.

**(సమాప్తం)**



గన్నవరపు నరసింహమూర్తి

ఇటీవల రెండు అగ్రరాజ్యాధినేతల మధ్య 90 నిముషాలపాటు జరిగిన చర్చలపై ఎంత రాసినా తరగదనే చెప్పాలి. ఎందుకంటే గత మూడేళ్లుగా కొనసాగుతూ మొత్తం యూరప్ దేశాలను అతలాకుతలం చేస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు డోనాల్డ్ ట్రంప్, పుతిన్‌ల మధ్య టెలిఫోన్‌లో జరిగిన చర్చలకు సహజంగానే అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం, పెద్దన్నగా తాను చె ప్పిందే వినాలన్న ధోరణి డోనాల్డ్ ట్రంప్‌లో కనిపిస్తే, వ్యూహాత్మక చాణక్యం పుతిన్‌లో కనిపించింది. 30 రోజులపాటు ఇంధన మౌలిక వసతులపై దాడులు జరపకుండా పుతిన్ అంగీకరించడాన్ని ట్రంప్ తాను సాధించిన విజయంగా చెప్పుకుంటున్నప్పటికీ పుతిన్ మాత్రం యుద్ధక్షేత్రంలో తాను అనుకున్న విధంగా రష్యా సేనలు ఉక్రెయిన్ లోని భూభాగాలను స్వాధీనం చేసుకునేవరకు నిదానంగా సాగే ఈ చర్చల ప్రక్రియకు పూర్తి మద్దతు పలు కుతూ వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేసే పరిస్థితి కనిపిస్తోంది.




# ట్రంప్ దూకుడు...పుతిన్

**మూ**డేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ లోని 20% భూమిని మాత్రమే ఇప్పటివరకు రష్యా తన స్వాధీనంలోకి తెచ్చుకోగలిగింది. కానీ దేశం ఇందుకు చెల్లించిన మూల్యం అపారం. ఇదే సమయంలో ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోయింది. ఉక్రెయిన్ విషయంలో పుతిన్ చర్చలకు సమ్మతిం చారంటే అందుకు ప్రధాన కారణం, ట్రంప్ అధికారంలోకి వచ్చాక యు.ఎస్. వైఖరిలో వచ్చిన సమూల మార్పు తప్ప, రష్యా మొదట్నుంచీ అనుసరిస్తున్న ఆలోచనా విధానాన్ని సవరించుకోవడం వల్ల కాదన్నది ఇక్కడ గుర్తించాలి.

**పుతిన్ వ్యూహం స్పష్టం**

విచిత్రమేమంటే ట్రంప్ ప్రభుత్వం రష్యా–ఉక్రెయిన్ యుద్ధ పరిసమాప్తికి ఇంతటి స్థాయిలో ప్రసవ వేదన పడుతున్నప్పటికీ, మాస్కో ఆలోచనలు భి న్నంగా వున్నాయి. ముఖ్యంగా నోబెల్ శాంతి బహుమతి లక్ష్యంగా ఈ యుద్ధానికి ఏదోవిధంగా ముగింపు పలికి, తానొక శాంతి కాముకుడిగా ప్రపంచానికి చాటుకోవాలని ట్రంప్ చూస్తున్నారని రష్యా అంచనా వేస్తోంది. ట్రంప్ అసలు ఉద్దేశాన్ని పసిగట్టిన పుతిన్ ఈ యుద్ధంలో మరిన్ని రాయితీలు పొందడానికి స్పష్టమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ముఖ్యంగా కాల్పుల విరమణ ముసుగులో ఉక్రెయిన్‌కు చెందిన మరిన్ని భూభాగాలను సాధ్యమైంత తొందరగా స్వాధీనం చేసుకోవడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. ఆవిధంగా విజయాన్ని మరింత వేగంగా సొంతం చేసుకొని, తుది ఒప్పందం సమయంలో తనకు ప్రయోజకర షరతులతో ముందుకు రావడం ఆయన వ్యూహం. ఇదే సమయంలో జోబైడెన్ హయాంలో అమెరికాతో తీవ్రస్థాయి వైరం నెలకొన్న దశ నుంచి ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఆ దేశంతో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా, తన నిర్దేశిత లక్ష్యాల్లో గరిష్ట శాతాన్ని సాధించుకునే వ్యూహాన్ని ప్రస్తుతం రష్యా అధ్యక్షుడు అనుసరిస్తున్నారు. ఇదేసమయంలో ట్రంప్‌తో సుహృద్భావంగా వ్యవహ రించడం, అమెరికాతో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబం ధాలను తిరిగి గాట్లో పెట్టేందుకు యత్నించడం, మధ్యప్రాచ్యంలో పరస్పర సహకారం వంటి అంశాలతో తన దౌత్య వ్యూహాన్ని ముందుకు తీసుకెళు తున్నారు. ఇదేసమయంలో రష్యా చర్చలకు సిద్ధంగా వుందని ట్రంప్ నమ్మే విధంగా ఇంధన మౌలిక వసతుల పై దాడులు జరపకుండా కాల్పుల విరమణను పాటించడం వంటి చిన్నపాటి రాయితీలకు అంగీకరించడం కూడా పుతిన్ వ్యూహంలో భాగమే. ఈవిధంగా నిదానంగా వ్యవహరిస్తూ చర్చల సమయానికి ప్రస్తుతం ట్రంప్ నిర్దేశించుకున్న అంశాల్లో మార్పులు చేర్పులు చేసుకునేలా చేయడం పుతిన్ అనుసరిస్తున్న మరో కీలక వ్యూహం. ఈవిధంగా తుది చర్చల్లో, యుద్ధక్షేత్రంలో తనకు అనుకూలంగా ఒప్పందం రూపొందేలా చూసుకోవడంపై ప్రస్తుతం పుతిన్ దృష్టి కేంద్రీకరించారు.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**పుతిన్ షరతు...ట్రంప్ సందిగ్ధం**

అయితే చర్చలకు రావాలంటే అమెరికా ప్రస్తుతం ఉక్రెయిన్‌కు అందజేస్తున్న సైనిక, ఇంటెలిజెన్స్ సహాయాన్ని తక్షణం నిలిపేయాలన్నది రష్యా విధించిన షరతు. రాజకీయంగా, దౌత్యపరంగా ఈ సమస్యకు పరిష్కారం రావాలంటే ఈ సహాయం నిలిపివేయడం అత్యవసరమని రష్యా కోరడంలో తప్పులేదు. అయితే ఈ విషయంలో ట్రంప్ ఇంకా స్పష్టమైన వైఖరితో ఉన్నట్టు లేదు. ఎందుకంటే జలన్‌స్కీ మెడలువంచి చర్చలకు రప్పించేందుకు ట్రంప్ ఈ రెండు రకాల సహాయాన్ని నిలిపేసినా, తర్వాత గత బైడెన్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పునరుద్ధరించడం గమనార్హం. బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌తో కుదుర్చుకున్న పదేళ్ల ఒప్పందాన్ని ట్రంప్ ఇప్పటివరకు రద్దు చేయలేదు. మరి ట్రంప్ ఒకవేళ ఈ ఒప్పందం నుంచి తప్పుకుంటే ఏర్పడే ఖాళీని పూరించే శక్తి



# చాణక్యం

యూరప్‌దేశాలకు లేదు. ఈ పరిస్థితుల్లో రష్యా చేస్తున్న ఈ డిమాండ్‌పై ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు. ఇక్కడ గుర్తించాల్సిన మరో ముఖ్య విషయమేంటంటే ట్రంప్ కోరుకున్నట్టు పుతిన్ ఇప్పటికిప్పుడు ఒప్పందానికి రావాలన్న తొందర పడటంలేదు. ఎందుకంటే ఇంతకాలంగా తమ సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నందువల్ల, మరికొద్ది జాప్యం జరిగితే వచ్చే నష్టమేంలేదు. వచ్చే ఎండాకాలం నాటికి ఉక్రెయిన్ వద్ద ఆయుధాల నిల్వలు హరించుకుపోతాయన్న సంగతి పుతిన్‌కు తెలుసు.

**ట్రంప్ దూకుడు**

ఉక్రెయిన్ ఎంత భూభాగం కోల్పోయిందనేది ప్రశ్న కాదు, శాంతి ఒప్పందం కుదిరిందా లేదా అన్నది ట్రంప్‌కు ముఖ్యం. నోబెల్ శాంతి బహుమతిని సాధించడం లక్ష్యం! అంటే ఈ ఒప్పందం వల్ల రష్యా అమితంగా లాభపడుతుందనేది స్పష్టమైంది. ఎన్నికల ప్రచార సమయం నుంచీ ట్రంప్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని చెబుతూ వస్తున్నారు. ఆయన వ్యవహారశైలి కూడా అందుకు తగ్గట్టే వుంది. శ్వేతసౌధంలోకి అడుగుపెట్టిన దగ్గరనుంచి ట్రంప్ యంత్రాంగం జెలన్‌స్కీని తప్పుపడుతూ వచ్చింది. యుద్ధానికి కారణం ఆయననేనని వేలెత్తి చూపింది. ఇదే సమయంలో ట్రంప్ నాటో దేశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇచ్చేందుకు మద్దతు పలికేందుకు కూడా ట్రంప్ సుముఖత వ్యక్తం చేయలేదు. యూరోపియన్ యూనియన్ నాయకులతో కూడా ట్రంప్ చర్చలు జరపడానికి ఇష్టపడలేదు. జెలన్‌స్కీని దోషిగా చూపడమే కాదు, తమ డిమాండ్లను అంగీకరిస్తేనే అతనితో చర్చలు జరుపుతానని కుండబద్దలు కొట్టారు కూడా. చర్చలకు పిలిచినప్పుడు రష్యానుంచి మరిన్ని రాయితీల డిమాండ్ రాకుండా ట్రంప్ యంత్రాంగం, పుతిన్‌కు అనుకూలంగా వ్యవహరించిందనుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో జెలన్‌స్కీ తన డిమాండ్ల విషయంలో అమెరికాపై బలమైన ఒత్తిడి తెచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో, ఉక్రెయిన్ సైన్యం పరిమాణంపై పరిమితి వుండాలని, ఉక్రెయిన్‌లోకి యూరోపియన్ దేశాల దళాలు ప్రవేశించకూడదని పుతిన్ పట్టుపట్టే అవకాశాలే ఎక్కువ. అంతేకాదు, ప్రస్తుతం ట్రంప్ దేశీయంగా కొంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అంశాన్ని కూడా పుతిన్ గుర్తించారు. ముఖ్యంగా ఫెడరల్ ప్రభుత్వంపై ట్రంప్ చేస్తున్న దాడిని డెమొక్రట్లు వ్యతిరేకించే స్థితిలో లేనప్పటికీ, చికాకు పడుతున్నారు. ఇదే సమయంలో కొన్ని దశాబ్దాలుగా యు.ఎస్. అభివృద్ధి చేసుకుంటూ వచ్చిన హార్డ్ అండ్ సాఫ్ట్ పవర్ వ్యవహార శైలిని ట్రంప్ పూ ర్తిగా పక్కన పెట్టేయడం వారికి ఎంతమాత్రం రుచించడంలేదు. అయితే ట్రంప్ తన సొంత రిపబ్లికన్ పార్టీపై ఇప్పటికీ పూర్తి పట్టు కొనసాగిస్తున్నారు. రిపబ్లికన్లలో ఉదారవాదులకు ట్రంప్‌ను ప్రశ్నించే ధైర్యం లేదు. ఒక పార్టీలో ప్రముఖులు అనదగ్గ నాయకులంతా ట్రంప్ అజెండాకే మద్దతు పలుకుతుండటంతో ట్రంప్ ఎదురులేకుండా తాననుకున్నవి చేసేస్తున్నారు. ఇదేసమయంలో ట్రంప్ ప్రపంచ క్రమాన్ని శాసించడంలో ఎంతమాత్రం ఇబ్బంది పడటం లేదు. ముఖ్యంగా గొప్ప దేశాలు, చిన్న దేశాలను నియంత్రించడం, అవసరమైతే ఇతర దేశాల భూభాగాల్లోకి చొచ్చుకుపోవడం వంటి ఆధిపత్య ధోరణులు ట్రంప్‌లో పుష్కలంగా కనిపిస్తున్నాయి. తన పొరుగు దేశమైన కెనడాను యు.ఎస్.లో ఒక రాష్ట్రంగా కలిసిపొమ్మని చెప్పడం, గ్రీన్‌లాండ్‌ను, పనామా కాల్వను స్వాధీనం చేసుకుంటామని చెప్పడం ఆయన ఆధిపత్య వైఖరికి నిదర్శనం.

**సానుకూల స్థితిలో పుతిన్**

మొత్తంమీద ఈ పరిణామాలను పరిశీస్తే ప్రస్తుతం పుతిన్ అత్యంత సానుకూల స్థితిలో వున్నారనే చెప్పాలి. రష్యా నిర్దేశించే యుద్ధ నిబంధనలను అమలు చేసే బాధ్యతను తన స్నేహితుడైన డోనాల్డ్ ట్రంప్ భుజస్కంధాలపై ఉంచి పుతిన్ ఇక నిశ్చింతగా వుండవచ్చు. అయితే ఇక్కడ ఆయనకు రెండు ప్రధాన అవరోధాలు ఎదురుకానున్నాయి. మొదటిది ఉక్రెయిన్ సమాజం ఈ ఒప్పందాన్ని అంగీకరించకుండా యుద్ధం చేయడానికే నిర్ణయించుకునే అవకాశాలు మెండుగా వుండటం. రెండవది యు.కె., ఫ్రాన్స్ వంటి దేశాలు జెలన్‌స్కీకి బాసటగా నిలవడం. ఈ రెండు దేశాలు సైనికంగా, ఆర్థికంగా ఉక్రెయిన్‌కు వెన్నుదన్నుగా ఉండటానికే నిశ్చయించుకోవడం కీలకం.

ఉక్రెయిన్‌తో యుద్ధం పరిసమాప్తమైన తర్వాత పుతిన్ ఆ దేశంలో తక్షణం ఎన్నికలు జరగాలని పట్టుపట్టే అవకాశాలే ఎక్కువ. ఎందుకంటే ఈసారి జరిగే ఎన్నికల్లో తనకు అనుకూల ప్రభుత్వం వచ్చేలా చేసి, ఉక్రెయిన్‌ను సంబంధాల పేరుతో తన గుప్పిట్లో వుంచుకునే వ్యూహాన్ని పుతిన్ తప్పక అమలు చేస్తారు. ఇదే సమయంలో యూరోపియన్ దేశాలు శాంతి ఒప్పందానికి తూట్లు పొడిచి యుద్ధానికే కాలు దువ్వుతున్నాయంటూ, ట్రంప్‌కు ఉదాహరణలతో సహా చూపించి, వాటిని కట్టడి చేయడం మరో వ్యూహం. ఆర్థిక ఆంక్షలతో వాటిపై వెనకా ముందూ చూడకుండా విరుచుకుపడే ట్రంప్ బలహీనత పుతిన్‌కు బాగా తెలుసు కనుక ఈ అవకాశాన్ని ఆయన చక్కగా వినియోగించుకోగలడు. మొత్తంమీద చెప్పాలంటే పుతిన్ రాజకీయ చదరంగాన్ని పదునైన వ్యూహంతో ఆడుతున్నారు. ఈ ఆటలో ఆయనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ట్రంప్ రూపంలో పుతిన్ వ్యూహాలకు వచ్చే సానుకూలత జెలన్‌స్కీ పతనానికి దారితీయనుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

**పుతిన్‌ను నమ్మని ఈయూ దేశాలు**

నిజానికి పుతిన్ శాంతిని కోరుకుంటున్నారని డోనాల్డ్ ట్రంప్ చెబుతున్న మాటలను ఇటు జెలన్‌స్కీ అటు యూరోపియన్ యూనియన్ దేశాలు నమ్మడంలేదు. ఎందుకంటే ఉక్రెయిన్ ఒక స్వతంత్రదేశంగా ఉండటం పుతిన్‌కు ఇష్టంలేదు. ఇదే సమయంలో నాటోదళాలు ప్రచ్ఛన్నయుద్ధం కాలం నాటి తమ స్థానాలకు తిరిగి వెళ్లాలని గట్టిగా కోరుతున్నాయి. ఇదే సమయంలో పుతిన్ సరికొత్త ప్రపంచ క్రమం అమల్లోకి రావాలని, ఇందులో రష్యా కీలక పాత్ర పోషించాలని కూడా కోరుకుంటు న్నారనేది విశ్లేషకుల వాదన. ఇందుకూ ఒక కారణ ముంది. సోవియట్ యుగంలో పుతిన్‌తో పాటు ఆయన నమ్మకస్తులు చాలా మంది కేజీబీలో పనిచేశారు. ప్రస్తుతం వారంతా బయటకు వచ్చినప్పటికీ, నాడు యుఎస్ఎస్ఆర్ పతనంలో ప్రపంచ దేశాలు వ్యవహరించిన తీరు, తర్వాతి కాలంలో రష్యా పట్ల వాటి దారుణ వైఖరిని వీరు ఇప్పటికీ జీర్ణించు కోలేకపోతున్నారు. యుఎస్ఎస్ఆర్ పతనమై తీవ్ర సంక్షోభంలో ఉన్న 1990ల్లో పుతిన్ అధికార ప్రస్థానం క్రమంగా ప్రారంభమైంది. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయి, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన రోజులవి. 2000 సంవత్సరంలో పుతిన్

దేశాధ్యక్షుడయ్యాక, పెరిగిన చమురు ధరల కారణంగా దేశ ఆర్థికవ్యవస్థ వేగంగా పుంజుకోవడమే కాకుండా, ఎంతోమంది కోటీశ్వరులయ్యారు. ఆర్థికంగా వేగంగా పుంజుకుంటున్న రష్యాను జి-7 దేశాల కూటమిలో సభ్యురాలిగా ఆహ్వానించారు. రష్యా ప్రవేశంతో ఈ కూటమి జి-8గా మారింది. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించడమే కాకుండా, జి-8 సభ్యత్వాన్ని పశ్చిమ దేశాలు రద్దుచేశాయి.

నిజానికి ప్రపంచంలో అతిపెద్ద దేశంగా, పుష్కలంగా ప్రకృతి వనరులున్న దేశంగా ఉన్న రష్యాకు కేవలం జి-8 దేశాల్లో ఒకటిగా గుంపులో గోవిందయ్యలాగా వుండటం పుతిన్‌కు ఇష్టంలేదు. అందువల్ల జి-8నుంచి వెలేసినా ఆయన పెద్ద పట్టించుకోరు. ఆయన ప్రధాన లక్ష్యమల్లా ఇంతటి పెద్ద, అద్భుతమైన వనరులున్న రష్యా ప్రపంచంలో కీలకపాత్ర పోషించేలా చేయడం.

**అవకాశాలు సృష్టించుకునే మేధావి పుతిన్**

ట్రంప్ తీసుకువచ్చిన శాంతి ప్రతిపాదన, ఉక్రెయిన్‌పై మరిన్ని సత్వర విజయాల సాధనకు, దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకోవడానికి పుతిన్ ఆయన చుట్టూ ఉన్న నాయకులు, ఒక అవకాశంగా పరిగణిస్తున్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవడంలో పుతిన్‌ను మించినవారు లేరు. గందరగోళంతో కూడిన గతిశీలక పరిస్థితులు ఏర్పరచి తనకు అనుకూలంగా అనేక అవకాశాలు సృష్టించుకోగల అద్భుత మేధావి. అప్పుడు తనకు అందుబాటులో ఉన్న అనేక అవకాశాల్లో ఏది ఉత్తమమైందో ఎంపిక చేసుకొని దాన్ని అమలు చేస్తారు. ట్రంప్ శాంతి యత్నాల నేపథ్యంలో, రష్యా తన దీర్ఘకాలిక ప్రణాళికలను ఇసుమంతైనా మార్చుకోలేదు.

ఉక్రెయిన్ యుద్ధం ముగించాలంటే, అసలు ఈ సంఘర్షణకు 'మూలకారణాలను' సమూలంగా పరిష్కరించాలని రష్యా అధికారులు డిమాండ్ చేస్తున్నది తమ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే. ఉక్రెయిన్‌లో తక్షణం ఎన్నికలు జరిపించడం, నాటోదళాలు ప్రచ్ఛన్న యుద్ధ కాలంనాటి తమ స్థానాలకు తిరిగివెళ్లడం అనేవి పుతిన్ దృష్టిలో 'మూలకారణాలు'. ఆయన ప్రధాన లక్ష్యం ఉక్రెయిన్‌లో రష్యా అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, బెలారస్ మాదిరిగానే ఉక్రెయిన్ తనకు అనుకూలంగా కొనసాగడం, ఇదే సమయంలో యూరోపియన్ యూనియన్ లేదా నాటో దేశాల కూటమిలో ఉక్రెయిన్ చేరకుండా నిరోధించడం. కేవలం ఈ కారణాలవల్లనే 2022లో ఉక్రెయిన్‌పై 'సైనిక ఆపరేషన్‌కు' రష్యా అధ్యక్షుడు ఆదేశాలు జారీచేశారు. మరి ఇప్పటివరకు కొనసాగించిన సైనిక చర్యవల్ల దీన్ని సాధించలేదు కాబట్టి, యుద్ధానికి ముగింపు పలకరు. ఒకవేళ ట్రంప్ మధ్యవర్తిత్వంలో దౌత్యపరంగా దీన్ని సాధించినా పుతిన్‌కు అభ్యంతరముండదు. అయితే పుతిన్ దీన్ని దౌత్యం కంటే, ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిపించడం ద్వారానే సాధించడానికి ప్రాధాన్యం ఇస్తారు. అందుకనే పుతిన్ ఎప్పటికప్పుడు జెలన్‌స్కీని ఎన్నికలు జరపని ఒక నియంతగా ప్రపంచ యవనికపై చూపేందుకు యత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌ను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న యూరప్ దేశాలకు పుతిన్ ఎప్పుడూ నమ్మదగిన నాయకుడు కాదు! రష్యా కూడా ప్రస్తుత 'సైనిక చర్య'ను ఉక్రెయిన్‌పై చేస్తున్నది కాకుండా, పశ్చిమదేశాలతో జరుపుతున్న యుద్ధంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో యు.ఎస్. మధ్యవర్తిత్వంతో శాంతి ఒప్పందం కుదురుతుందని లేదా ఒకవేళ కుదిరినా అది సజావుగా అమలవు తుందన్న విశ్వాసం రష్యన్ ప్రజల్లోనే లేదు. ఎందుకంటే కొన్ని శతాబ్దాలుగా రష్యాలో కొనసాగిన విధ్వంసానికి, తమ అణచివేతకు పశ్చిమదేశాలే కారణమన్న భావన బలీయంగా దేశవాసుల్లో ఉంది. ఇక పుతిన్ దృష్టిలో ఉక్రెయిన్ ఒక ప్రత్యేక దేశం కాదు. యుఎస్ఎస్ఆర్‌లో భాగం మాత్రమే! పుతిన్ తన ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడంలో దేశ మతపరమైన గుర్తింపును కూడా చక్కగా వాడుకుంటున్నారు. రష్యా ఆర్థోడాక్స్ చర్చ్ నాయకుడు పాట్రియార్క్ కిరిల్ ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని పూర్తిగా సమర్థిస్తుండం ఇందుకు ఉదాహరణ. ★


**జాగృతి** ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి

## స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక

'నవలల పోటీ- 2025'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



1936-2022

**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

సూచనలు :

➡ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➡ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➡ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➡ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➡ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➡ నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 18 ఏప్రిల్, 2025**

శబ్ధ కాలుష్యం

# నిజానికి నీళ్లు.. విద్వేషానికి వీరతాడు..!





స్టాండప్ కమేడియన్ కునాల్ క్మ్రా, యూట్యూబర్ నిఖిల్ సింగ్ ఈ ఇద్దరి విషయంలోనూ పోలీసులూ, సైద్ధాంతిక పక్షపాతం, మీడియా వ్యవహరించిన తీరులో ఏ మాత్రం పొంతన లేకపోవడం చట్టాల అమలులోనూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణలోనూ ఒక కలవరపరిచే ధోరణి కనిపించింది. కోతికి కొబ్బరి కాయ చిక్కినట్టుగా క్మ్రా సైద్ధాంతిక పరమైన అండదండలతో ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నాడు. అయితే ఎలాంటి అండదం డల్లేకుండా చేదునిజాలను వెలుగులోకి తెస్తున్న వ్యక్తులు మాత్రం ఎక్కే కోర్టు దిగే కోర్టు అన్నట్టుగా న్యాయం నాలుగురోడ్ల కూడలిలో ఎటూ తోచని స్థితిలో సత మతమైపోతున్నారు. ఆ క్రమంలో కునాల్ క్మ్రా సుపరిచితుడే కాబట్టి ముందుగా యూట్యూబర్ నిఖిల్ సింగ్‌తో మొదలుపెడదాం.

**నిఖిల్ సింగ్‌ను ఆదుకోని నిజం**

యూట్యూబర్ నిఖిల్ సింగ్ కష్టాలు పంజాబ్‌లోని జలంధర్‌లో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి చెందిన లా గేట్ దగ్గర్లో విచ్చలవిడిగా నడుస్తున్న మద్యం దుకాణాలు, వ్యభిచార కార్యకలాపాలను గురించి సమగ్రంగా తీసిన ఒక వీడియోను మార్చి, 2024లో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో మొదలయ్యాయి. ఆ వీడియో ఒక ముఖ్యమైన విద్యా సంస్థ చుట్టుపక్కల అసాంఘిక శక్తులు తిష్ట వేసిన తీరు పట్ల తీవ్రమైన ఆందోళన రేకెత్తించింది. ఒక సోషల్ మీడియా యూజర్ ఆ ఆందోళనలకు అద్దం పడుతున్నట్టుగా అసాంఘిక శక్తులపై చర్య తీసుకోవాలని పంజాబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. అదే సమయంలో విపిన్ కుమార్ అనే వ్యక్తి ఆ వీడియోలో మహిళలను కించపరిచేలా అసభ్యమైన పదజాలం ఉందని, అది అల్లర్లకు దారి తీస్తుందని ఆరోపిస్తూ పంజాబ్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. అయితే పంజాబ్ పోలీసులు వీడియో వివరాలతో దర్యాప్తు చేయాల్సింది పోనిచ్చి నిఖిల్ సింగ్ మీదకు, సోషల్ మీడియా యూజర్ మీదకు దండెత్తారు. ఇద్దరి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పంజాబ్ పోలీసులు జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న నిఖిల్ సింగ్‌ను అరెస్టు చేశారు. నిఖిల్ కుటుంబాన్ని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టారు. ఆ తర్వాత జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు సింగ్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయితే నిఖిల్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన వ్యక్తి మాత్రం న్యాయపరమైన వేధింపులను ఎదుర్కొంటూనే ఉన్నారు. సోషల్ మీడియా యూజర్‌కు కపుర్తలా సెషన్స్ కోర్టు ఏడు రోజుల్లోగా దర్యాప్తునకు అందుబాటులో ఉండాలనే షరతుపై మే 7, 2024న బెయిల్ మంజూరు చేసింది. అయితే సోషల్ మీడియా యూజర్ న్యాయపోరాటాన్ని మరింత జటిలం చేస్తున్నట్టుగా ఆ వ్యక్తి కోర్టు ఆదేశానికి లోబడి దర్యాప్తునకు అందుబాటులో ఉండాలని వెళితే అక్కడి దర్యాప్తు అధికారి ఉన్నట్టుండి అందుబాటులో లేకుండా పోయారు.

**విద్వేషమే ఊపిరిగా కునాల్ క్మ్రా**

నిఖిల్ సింగ్ కేసుతో పోలిస్తే కునాల్ క్మ్రా కేసు పూర్తి భిన్నంగా ఉంది. తనను తాను కమేడియన్ అని చెప్పుకునే కునాల్ రాజకీయ ప్రముఖులను, మతపరమైన భావోద్వేగాలను లక్ష్యంగా చేసుకొని తరచుగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతుంటాడు. అయితే వామపక్ష భావజాలానికి కొమ్ముకాస్తున్న మేధావులు, మీడియా నెట్‌వర్క్‌ల కారణంగా కోర్టు మెట్లెక్కే పనిలేకుండా తన షోల ద్వారా విద్వేషపు విషాన్ని కక్కుతూనే ఉన్నాడు. ఈ ద్వంద్వ వైఖరికి అద్దం పట్టే ఒక ఘటన ఇటీవల ముంబైలో చోటు చేసుకుంది. కునాల్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను 'గద్దార్' (ద్రోహి) అని పేర్కొంటూ ఓ పేరడీ పాట కట్టాడు. ఆ పాటను ప్రదర్శించాడు. దీంతో ఆగ్రహించిన శివసేన కార్యకర్తలు కునాల్ ప్రదర్శన ఇచ్చిన వేదికను ధ్వంసం చేశారు. వెంటనే మిన్ను విరిగి నేల మీద పడిందేమో అన్నట్టుగా పేరొందిన మీడియా ప్రముఖులు, వామపక్ష కార్యకర్తలు భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఊతంగా చేసుకొని తన వాచాలత్వాన్ని పేరడీ పాటగా ప్రదర్శించిన క్మ్రాను వెనుకేసుకొచ్చారు.

నిఖిల్ సింగ్‌తోనూ, కునాల్ క్మ్రాతోనూ వ్యవహరించడంలో బహిర్గతమైన వివక్ష భారత్‌లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణలో సైద్ధాంతిక పక్షపాతం ఏ విధంగా ఉన్నదీ బట్టబయలు చేసింది. క్మ్రా కోసమని వ్యంగ్యానికీ, విద్వేషానికీ కాపుకాచిన వారు నిఖిల్ సింగ్ లాంటి నిజం నిగ్గుతేల్చేవారికి అండగా ఉండటం లేదేందుకని? సామాజిక రుగ్మతలను వెలుగులోకి తెచ్చేవారిపై ఒంటికాలిపైన లేస్తున్న అధికార యంత్రాంగం ఒక నిర్దేశిత సైద్ధాంతిక మూకకు సాగిలబడుతూ విద్వేషపు గళం వినిపిస్తున్న వారిని చూసీచూడనట్టుగా వదిలేస్తోంది ఎందుకని?

ప్రజాస్వామ్యం పదికాలాల పాటు పచ్చగా వర్ధిల్లాలంటే భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఎలాంటి సైద్ధాంతిక పక్షపాతం లేకుండా నిలబెట్టాలి. ప్రభుత్వమూ, మీడియా, పౌర సమాజం న్యాయప్రమాణాలను సరిసమానంగా వర్తింపజేయడం ద్వారా రాజకీయాలకు అతీతంగా అందరు పౌరులకూ న్యాయం నీడలో సరిసమానమైన రక్షణ అందేలా చూడాలి. ★

**కోతికి కొబ్బరి కాయ చిక్కినట్టుగా క్మ్రా సైద్ధాంతిక పరమైన అండదండలతో ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నాడు. అయితే ఎలాంటి అండదం డల్లేకుండా చేదునిజాలను వెలుగులోకి తెస్తున్న వ్యక్తులు మాత్రం ఎక్కే కోర్టు దిగే కోర్టు అన్నట్టుగా న్యాయం నాలుగు రోడ్ల కూడలిలో ఎటూ తోచని స్థితిలో సతమతమైపోతున్నారు.**

ఏప్రిల్ 13, 1919 నాటి జలియన్‌వాలా బాగ్ కాల్పుల ఉదంతం చరిత్ర పుటలలో ఇప్పటికీ మార్మోగుతూనే ఉంది. చరిత్రను రక్తపంకిలం చేసిన ఆ దురంతం గురించి ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు చెప్పిన కథనాలు ఇవి:

# కాల్పుల వార్త కూడా బయటకు రాలేదు!

జి.ఆర్.సేథీ జ్ఞాపకం


అమృతసర్‌కు సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉన్నది. కానీ, 1919లో జలియన్‌వాలా బాగ్‌లో దారుణమైన అన్యాయాలు జరిగిన తర్వాతే అది అందరి దృష్టిలోకి వచ్చింది. అప్పటి నుంచి దేశ చరిత్రలో ప్రాముఖ్యం వచ్చింది.

అమృతసర్‌కు 1577 నుంచి మతసంబంధమైన ప్రాధాన్యం వచ్చింది. సిక్కుల నాల్గవ మత గురువు రామదాస్ మొగలాయి చక్రవర్తి దగ్గర నుంచి కొంత భూమి సంపాదించారు. గ్రామస్థుల దగ్గర నుంచి మరో 300 ఎకరాల భూమి సేకరించి తమ ఇంటికి చేరువన ఉన్న సరోవర సమీపంలో దేవాలయం నిర్మించడానికి పూనుకొన్నారు. అప్పటికి ఆ ప్రదేశానికి అమృతసర్ అన్న పేరు రాలేదు. దేవాలయ నిర్మాణానికి ముందు చాలాకాలం నుంచీ ఆ ప్రాంతం మీదుగా ఒంటెలపై ప్రయాణం చేసేవారు. దేశంలో వాయవ్య ప్రాంతం నుంచి అఫ్ఘానిస్తాన్, పర్షియా – ప్రస్తుతపు ఇరాన్‌లకూ, ఈ ప్రాంతం మీదుగానే వెళ్లేవారు. లే నుంచీ, లడక్‌ల నుంచి చీనీ వ్యాపారులు ఈ ప్రాంతం మీదుగా వస్తూ ఉండేవారు.

19వ శతాబ్దం ప్రథమార్ధంలో ఆంగ్లేయులు ఈ ప్రాంతాన్ని తమ పరిపాలన క్రిందకు తీసుకొన్న తర్వాత ఇది ఒక పట్టణంగా రూపొందింది. మహారాజా రంజిత్‌సింగ్, ఆయనకు పూర్వం సిక్కుల అయిదవ మతగురువు అర్జునదేవ్ ఈ ప్రాంతంలో వాణిజ్యం, పరిశ్రమలు పెంపొందింపచేశారు. ఆ పట్టణ సౌభాగ్యంతో వర్ధిల్లడానికి తమ అనుచరులు, శిష్యులు వ్యాపార సంస్థలు ప్రారంభించాలని వారు ఆశించారు.

మొదటి నుంచీ లాహోరు, పంజాబు రాష్ట్రానికి రాజధానిగా ఉంటూ వచ్చినా మహారాజా రంజిత్‌సింగ్, ఆంగ్లేయ పాలకులూ అమృతసర్ ప్రాముఖ్యం తగ్గించడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. మహారాజా రంజిత్‌సింగ్ వేసంగిలో విశ్రాంతి నిమిత్తం ఇక్కడే చరిత్రాత్మకమైన రాంబాగ్ ఉద్యాన వనంలో ప్రాసాదం నిర్మించారు. ఈ ఉద్యానవనం కూడా ఆయన వేయించిందే. ఈ మహారాజా ప్రాసాదపు పూర్వ వైభవమంతా పోయింది. ఇటీవల కొన్ని సంవత్సరాల క్రితం పురపాలక సంఘం పెద్ద ఎత్తున మరమ్మతులు చేయించి సమావేశాలు, ఉత్సవాలు జరుపుకోడానికి ఏర్పాట్లు చేసింది. అప్పటి సంయుక్త పంజాబు రాష్ట్రానికి వాణిజ్యం రీత్యా ఈ పట్టణాన్నే రాజధానిగా పరిగణించేవారు.

ఇక్కడి పౌరులు ఎక్కువమంది వ్యాపారం చేసుకొని జీవించేవారు కావడం చేత శాంతికాముకులుగా, ప్రభుత్వానికి విధేయులుగా కనిపించేవారు. లాహోర్ లోని మేధావి వర్గాల కంటే వీరిలో రాజకీయ చైతన్యం తక్కువే. అటు లాహోర్‌లో పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా ఉండటంవల్ల, పంజాబు విశ్వవిద్యాలయం, పంజాబు ఉన్నత న్యాయస్థానం కూడా అక్కడే ఏర్పాటు కావడంవల్ల అది విద్యాధికుల కేంద్రంగా రూపొందింది. 1918 వరకు రాజకీయాలు అమృతసర్ పట్టణంలో కొద్దిమంది విద్యావంతులు, ఎక్కువగా స్థానిక న్యాయవాదులు, విదేశాలలోని ఆంగ్లేయ వ్యాపార సంస్థలతో లావాదేవీలు ఉన్న విద్యావంతులైన వ్యాపారులకు మాత్రమే పరిమితమై ఉండేది. వాస్తవానికి పంజాబులో రాజకీయ చైతన్యం కలిగింది ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరమే. ఆ ఉద్యమాలను అణచివేయడానికి రౌలట్ శాసనం వంటివి అమలు పర్చడంతోపాటు అనేక చర్యలు తీసుకొన్నారు. ప్రజలలో రగిలిన రాజకీయ చైతన్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టడానికి ఉద్దేశించినదే ఈ శాసనం.



జలియ

అమృతసర్ రైల్వే స్టేషనులోకి భారతీయులు రారాదని నిషేధం అమలుపర్చడం వల్లనే అప్పుడు పెద్ద ఉద్యమం ప్రారంభం అయింది. అప్పట్లో రైల్వే ప్లాట్‌ఫారంపైకి వెళ్లడానికి అమ్మే టిక్కెట్లు భారతీయులకు ఇచ్చేవారు కారు. ఇటువంటి ఆంక్షలు విధించడం మూలంగా అప్పుడే అంటుకొంటున్న అగ్నిలో ఆజ్యం పోసినట్లు అయింది. స్థానిక నాయకులలో పంజాబు విధానసభ మాజీ అధ్యక్షులలో ఒకరు డాక్టర్ సత్యపాల్, డాక్టర్ సఫుద్దీన్ కిచ్లూ, ఖ్వాజాయసీన్, బద్రుల్ ఇస్లామ్, కన్హియాలాల్ వంటి ప్రముఖ న్యాయవాదులు, గిరిధారీలాల్, మహేష్ చౌదరి బగ్గామల్ వంటి మరికొందరు ప్రముఖులు ఇక్కడ నుంచి 1918 నాటి అఖిల భారత కాంగ్రెస్ మహాసభలకు ఢిల్లీ వెళ్లారు. ఆ తదుపరి సమావేశాలు అమృతసర్‌లో జరుపవలసిందిగా వారు పెద్దలను అభ్యర్థించారు. వారి ఆహ్వానం మన్నించడం జరిగి నప్పటి నుంచి కాంగ్రెస్ మహాసభలు విజయవంతంగా నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి.

1919 ఏప్రిల్ 2వ తేదీన ఒక బహిరంగసభలో ప్రసంగించవలసిందిగా సన్యాసి, ప్రముఖ వక్త స్వామి సత్యదేవ్‌ను ఆహ్వానించారు. ఆ సమావేశం ఏర్పాటు చేయపూనుకొన్న కార్యకర్తలు కొంచెం విశాలంగా ఉండే స్థలం దొరికితే బాగుండునని అనుకొన్నారు.

**1919 ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి నాడు అపూర్వమైన పెద్ద ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపు వెనుక డాక్టర్ సత్యపాల్, డాక్టర్ కిచ్లూ, గుర్రపు బగ్గీలో వచ్చారు. ఈ అపూర్వమైన ఊరేగింపు చూసేసరికి ఆంగ్లేయ పాలకుల గుండె చెదిరింది. స్థానిక అధికారులు హడలిపోయారు. దీని మూలంగా తమకేదో పెద్ద ముప్పురానున్నదని అనుమానించారు. డాక్టర్ సత్యపాల్‌నూ, కాక్టర్ క్లీచునూ, ఇద్దరినీ నిర్బంధించారు. ఆ మీదట ఏ విధమైనా ఉపన్యాసాలు ఇవ్వరాదని శాసిస్తూ కొందరు స్థానిక నాయకులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 6వ తేదీన హర్తాళ్ జరిగినప్పుడే స్థానిక అధికారులకు బెదురు పుట్టింది.**



# న్‌వాలా బాగ్!!

మహనీరతన్ చంద్ ఈ ఉపన్యాసం జలియన్‌వాలా బాగ్‌లో ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. పేరుకు ఇది ఒక తోట, కాని వాస్తవానికి అక్కడ చెత్తా చెదారం పడేసేవారు. జలియన్‌వాలా, ఓ సర్దారుకు చెందినది. ఆ భూమి ఆ ప్రదేశం అంతా గబగబా ఊడ్చి శుభ్రం చేశారు. కాని ఎత్తు పల్లాలు అలాగే ఉన్నాయి. భూమి చదును చేయడం జరగలేదు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామీజీ ప్రసంగం వినడానికి సుమారు 50 వేల మంది ప్రజలు హాజరయ్యారు. గంగా ప్రవాహంలా సాగిన ఆవేశపూరితమైన ఆనాటి ప్రసంగం వినే మహద్భాగ్యం ఈ వ్యాసకర్తకు కూడా కలిగింది. విదేశీ పాలన నుంచి విముక్తి సాధన గురించి ఆయన ప్రసంగిం చారు. ఆయన తమ ప్రసంగంలో ఎన్నో వాదప్రతి వాదాలు వివరించారు. ప్రజలంతా ఆ ప్రసంగం విని ఎంతో ప్రభావితులయ్యారు. ఫలితంగా 1919 ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి నాడు అపూర్వమైన పెద్ద ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపు వెనుక డాక్టర్ సత్యపాల్, డాక్టర్ కిచ్లూ, గుర్రపు బగ్గీలో వచ్చారు. ఈ అపూర్వమైన ఊరేగింపు చూసేసరికి ఆంగ్లేయ పాలకుల గుండె చెదిరింది. స్థానిక అధికారులు హడలిపోయారు. దీని మూలంగా తమకేదో పెద్ద ముప్పురానున్నదని అనుమానించారు. డాక్టర్ సత్యపాల్‌నూ, కాక్టర్ క్లీచునూ, ఇద్దరినీ నిర్బంధించారు. ఆ మీదట ఏ విధమైనా ఉపన్యాసాలు ఇవ్వరాదని శాసిస్తూ కొందరు స్థానిక నాయకులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 6వ తేదీన హర్తాళ్ జరిగినప్పుడే స్థానిక అధికారులకు బెదురు పుట్టింది. అప్పటి ప్రభుత్వ నివేదికలలో కూడా హర్తాళ్లు జరిగినప్పుడుకానీ, ఆ తర్వాత శ్రీరామనవమి నాడు ప్రజానీకమంతా ఊరేగింపు జరిపినప్పుడు కానీ ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగలేదనీ, ఆంగ్లేయులు కూడా అక్కడ స్వేచ్ఛగా తిరిగారనీ, వారు ఊరేగింపులోని జనతతో కలిసి పోయారనీ తెలియజేశారు.

1919 ఏప్రిల్ 10వ తేదీన డాక్టర్ సత్యపాల్‌నూ, డాక్టర్ కిచ్లూనూ ఉదయం 10 గంటలకు డిప్యూటీ కమిషనర్ ఇంటికి తీసుకొని వెళ్లారు. ఆ తర్వాత కారులో వారిని 'ధర్మశాల'కు తరలించారు. వారిని నిర్బంధించిన వార్త దావానలంలా వ్యాప్తం అయింది. నగర ప్రజలంతా గుంపులు గుంపులుగా తమ నాయకులను విడుదల చేయించేందుకు డిప్యూటీ కమిషనర్ ఇంటికి బయలుదేరారు. అశ్వారూఢులైన సైనికులు, పోలీసులు వివిధ కూడలి స్థలాలలో ముగ్గురు తెల్లదొరలు న్యాయాధికారుల అజమాయిషీ క్రింద సన్నద్ధులై ఉన్నారు. వీరు కాక ఆంగ్లేయ సైన్యానికి చెందిన పదాతిదళాన్ని రాంబాంగ్ తోటలో సన్నద్ధంగా ఉంచారు. పౌరులు నివసించే ప్రాంతం నుంచి విదేశీయులను అందరినీ ఒకచోట చేర్చేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఆ సైనికులు ఊరేగింపుగా వస్తున్న ప్రజలు రైలు మార్గం పైగా ఉన్న వంతెన దాటకుండా అడ్డుకొన్నారు. ఆ తర్వాత కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో కొందరు దుర్మరణానికి గురయ్యారు. మృతకళేబరాలను ఊరేగింపుగా ఊళ్లోకి తీసుకొనివెళ్లారు. తీవ్రమైన ఆందోళన జరిగింది. ఫలితంగా ఏప్రిల్ 13వ తేదీన సైనిక శాసనం ప్రకటించారు. జలియన్‌వాలా బాగ్‌లో హడావిడిగా ఏర్పాటైన సమావేశానికి వైశాఖి మేళా జరుపు కుంటున్న ప్రజలు తండోపతండాలుగా హాజర య్యారు. అలా సమావేశమైన ప్రజా సమూహంపై విచక్షణా రహితంగా, క్రూరాతి క్రూరంగా కాల్పులు జరిపారు. మూకుమ్మడిగా జరిపిన హత్యాకాండ ఫలితంగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ఉధృతమయింది.

ఆ రోజులలో 1919 ప్రాంతంలో అనేక ఇతర పట్టణాలలో లాగానే అమృతసర్‌లో కూడా వార్తలు సరిగా అందేవి కావు. లాహోర్ నుంచి వెలువడే పత్రికలలో అక్కడి వార్తలు ప్రచురితమయ్యేవి. అమృతసర్ నుంచి ప్రాంతీయ భాషలో కొన్ని వారపత్రికలు వెలువడుతూ ఉండేవి. అవి రాజకీయాలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఉండేవి. జలియన్‌వాలా బాగ్ దురంతాలకు ముందుగానీ ఆ తర్వాతగానీ ఆ వార్తలు ప్రచురించడానికి అవి జంకాయి. దీనానాథ్ 'పన్త్' అనే ఉర్దూ దినపత్రిక ప్రారంభించారు. కాని కొద్ది కాలం తర్వాతనే పాలకవర్గం ఆ పత్రిక రాకుండా చేసింది. లాహోర్‌లో కూడా ప్రాంతీయ భాషలో దినపత్రికలు లేవు. చెప్పుకోదగిన పలుకుబడిగల ఆంగ్ల దినపత్రికలు రెండే ఉండేవి. ఆంగ్లేయులు ప్రచురించేది ఒకటి, రెండవది కీ.శే. సర్దార్ దయాల్‌సింగ్ మజీరియా స్థాపించిన జాతీయ పత్రిక ట్రిబ్యూన్. అనేక రకాల విభేదాలు, ఆంక్షలు ఉండడంచేత ట్రిబ్యూన్ పత్రికలో కూడా బహు స్వల్పంగా ఈ వార్తలు ప్రకటించేవారు. గెజెట్టులో కేవలం ప్రభుత్వం జారీచేసే పత్రికా ప్రకటనలు ఉండేవి. ఈ పత్రికలకు తమ విలేఖరుల ద్వారా వార్తలు సేకరించేందుకు సదుపాయాలు ఉండేవి కావు. ఆంగ్ల దినపత్రికలు బొంబాయి, కలకత్తా, అహ్మదాబాదు నగరాల నుండి వెలువడుతూ ఉండేవి. ఆకాశవాణి కేంద్రం అంటూ అప్పటికి దేశంలో ఏర్పాటుకాలేదు. ఇలా ఎన్ని అవరోధాలు ఉన్నప్పటికీ ఉర్దూలో ప్రకటనలు వెలువడుతూ ఉండేవి. వాటిలో కొన్ని అచ్చువేసినవి, కొన్ని చేత్తో వ్రాసినవి, ఈ ప్రకటనలనుబట్టి దేశంలో వస్తున్న పరిణామాలను గురించి ప్రజలు తెలుసుకొంటూ ఉండేవారు.

**– జాగృతి 21.4.1969**

# అర్ధశతాబ్దం క్రితం ఏప్రిల్

## సేఠ్ రాధాకిషన్ జ్ఞాపకాలు

సరిగా యాభై సంవత్సరాల నాటి మాట. 1919 ఏప్రిల్ 13న విధి వక్రించిన ఆ వేళ. జలియన్‌వాలా బాగ్‌కు కేవలం 50 గజాల దూరాన, ఫానారా చౌక్‌లో నిలబడి ఉన్నాను. ఇంతలో మా పక్కగా డయ్యర్ సేనానీ, సాయుధులైన అతని సైనికులూ హడావిడిగా వెళ్లారు. తర్వాత కొద్ది నిమిషాలకి తుపాకి కాల్పుల శబ్దం వినిపించింది.
ఇతరులతోపాటు నేను కూడా దగ్గరలో ఉన్న మార్కెటులోకి పరుగెత్తుకుపోయి తలదాచుకొన్నాను. అప్పుడప్పుడు స్వల్ప విరామంలో, కొంతసేపటి వరకు కాల్పులు సాగుతూనే ఉన్నాయి. మరికొంతసేపటికి భారతదేశ చరిత్రలోనే దారుణమైన రక్తపాతానికి ఒడిగట్టిన డయ్యర్ సేనానీ, అతని సైనికులూ వెనక్కు తిరిగి వెళ్లిపోవటం చూచాము. జలియన్‌వాలా బాగ్ దురంతం, ఇంక వేటితోనూ సంబంధం లేకుండా జరిగిన సంఘటన కాదు. అంతకు ఒక వారం క్రితం 1919 ఏప్రిల్ 6వ తేదీన మొదలైన సంఘటనలు అనేకం కలిసి, ఈ రక్తపాతానికి దారితీశాయి. ఆ రోజుల్లో విజృంభిస్తున్న స్వాతంత్ర్య పిపాస పాలకుల గుండె దడకు కారణమయింది.

రౌలట్ చట్టాన్ని ప్రభుత్వం అమలుపరచడంతో దేశంలో ప్రజల ఆగ్రహానికి అవధులు లేకుండా పోయింది. పంజాబ్‌లో వర్తకులు ఈ చట్టానికి తమ అసమ్మతి సూచనగా మార్చి 30వ తేదీన హర్తాళ్ జరిపారు. ఏప్రిల్ 6వ తేదీన రెండవ పర్యాయం పూర్తి హర్తాళ్ జరిగింది. అధికారుల వత్తిడి, బెదిరింపు ఏమీ పనిచేయలేదు.

అలాంటి సంఘటన అదివరలో ఎన్నడూ జరుగలేదు. కుతూహలాన్ని అణుచుకోలేక మా నాన్నగారిని కారణమేమిటని అడిగాను. ఆయన చెప్పిన సమాధానం ఇప్పటికీ నా చెవులలో మారు మ్రోగుతూనే ఉన్నది. 'రాజు మరణించినప్పుడో, ప్రజలు లేచి తిరుగుబాటు జరిపినప్పుడో–ఈ రెండు సందర్భాలలో ఇలా జరుగుతుంది' అన్నారాయన.

నిజానికి అది తిరుగుబాటే. న్యాయవాదిని పెట్టుకునేందుకూ, అప్పీలు చేసుకునేందుకు గల హక్కును తీసివేసిన ఒకానొక దుష్టశాసనం పట్ల ప్రజలు తిరుగుబాటు జరిపారు. ఆ మర్నాడు శ్రీరామనవమి. ప్రజలు బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపారు. అమృతసర్‌లో మామూలుగా ఈ పండుగ ఎంతో ఆడంబరంగా జరుపుతూ ఉంటారు. అయితే ఆ సంవత్సరపు వేడుకలలో ఒక విశేషం ఏమంటే హిందువులతోపాటు ఎందరో ముస్లింలు కూడా పాల్గొన్నారు. శ్రీరామచంద్రజీకి జై అనే నినాదాలతో పాటు, అసంఖ్యాకమైన జనసందోహం, ముక్త కంఠంతో హిందూ–ముస్లిం సఖ్యతా సామరస్యాలకు జే కొట్టారు.

బ్రిటిష్ పాలకులు కంగారు పడిపోయారు. మర్నాడు నాయకులను అరెస్టు చేశారు. దీనితో ప్రజల ఆగ్రహం మిన్ను ముట్టింది. తమ నిరసన తెలియజేస్తూ, కోర్కెల పత్రం ఒకటి అందజేయడానికిగాను, డెప్యూటీ కమిషనర్ భవనం వైపుగా, బ్రహ్మాండమైన ఒక ఊరేగింపు సాగింది. కాలినడకన వెళ్లేవారు, రైలు మార్గాన్ని దాటేందుకు ఉపయోగించే వంతెన దగ్గరకు ఊరేగింపు చేరగానే, పోలీసులు వారిపై తుపాకులు కాల్చారు. ముగ్గురు హతులైనారు, వారిని హాల్ బజార్‌లోని ఖైర్ దీన్ మసీదు లోపలికి జనం మోసుకువెళ్లారు.

ఆగ్రహోదగ్రులైన అక్కడి జనసందోహం హాల్‌బజార్‌లో ప్రవేశించి, అక్కడ ఉన్న బ్రిటిష్ బాంకుపైన విరుచుకుపడ్డారు. ఆ దగ్గరలోని రోడ్ల కూడలిలో ఉన్న రాణి విగ్రహంపై చేయిచేసుకున్నారు. ఆ విగ్రహం చేతి చిటికిన వేలు మాత్రం స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ సంఘటనను తిలకిస్తూ అక్కడ ఉన్న బ్రిటిష్ బాంకు మేనేజర్ తన దగ్గర ఉన్న తుపాకి పేల్చాడు. ఫలితంగా కొందరు గాయపడ్డారు.

దీనితో అక్కడి ప్రజల ఆగ్రహం ద్విగుణీకృతం అయింది. వెంటనే వారు ఆ బాంకుపై దాడి జరిపి, జనం మీద దౌర్జన్యం జరిపిన మేనేజర్‌ను హతమార్చారు. కోపంతో ఉడికిపోతూ, తగిన నాయకుడు లేని ప్రజాసమూహం ఆగ్రహంతో పట్టణమంతా వ్యాపించింది. శాంతి భద్రతల పరిరక్షణకు బాధ్యులైనవారు పూర్తిగా అశక్తులయి పోయారు. పాలకులకు గుండె బెదిరిపోయింది.

అయితే ప్రజలు మాత్రం ఎంతో విచక్షణతో, ప్రశంసనీయమైన విధంగా నడుచుకున్నారు. అవాంఛనీయమైన సంఘటనలేవీ జరగలేదు. పంజాబ్ ప్రజలు అతి కోలాహలంగా జరుపుకునే వైశాఖ పండుగ ముగియవస్తున్న తరుణమది. పశువులను అమ్ముకునేందుకో, కొనుక్కునేందుకో, అనేక ప్రాంతాల నుంచి అసంఖ్యాకంగా జనం అమృత్‌సర్ దర్శిస్తూ ఉంటారు, ఈ సందర్భంలో. ఆ యేడూ అలాగే వచ్చారు. సర్కారువారు ప్రజలను వారి కర్మానికి వారిని వదిలివేసి చేతులు ముడుచుకు కూర్చుండిపోవటంతో, ఈ యాత్రీకుల నవీన అవసరాలు తీర్చటం పెద్దసమస్య అయింది. పౌరులే ఈ బాధ్యతను స్వీకరించారు, నగరం యావత్తు బ్రహ్మాండమైన పాకశాలగా తయారయింది. వీధి మొదళ్లలో భోజనశాలలు ఏర్పాటైనాయి.

ఆ రోజుల్లో, జలియన్‌వాలాబాగ్ అనేది లోతైన గొయ్యిగా ఉండేది. బహిరంగ సభ ఒకటి జరిపేందుకై అంతకు కొద్దిరోజుల క్రితమే అక్కడి చెత్తా చెదారం


జనరల్ డయ్యర్

తీసివేసి, శుభ్రం చేశారు. వైశాఖి పర్వదినానికి ముందు, అక్కడ రెండు సభలు ఏర్పాటైనాయి. ప్రజలలో అంతకంతకు ఉత్సాహం చైతన్యం వృద్ధి చెందుతూ రావటంతో, ఈ బాగ్ స్థలానికి గిరాకీ పెరిగింది. అంతకుముందు, ప్రభుత్వ చర్యల పట్ల నిరసన తెలిపేందుకు ఉద్దేశించిన సభలేవైనా, 'వందేమాతరం హాలులో' జరిగేవి.

జలియన్‌వాలాబాగ్‌లో నిరసన సభ ఒకటి జరుగుతుంది అంటూ ఏప్రిల్ 12వ తేది సాయంకాలమూ 13వ తేదీ ఉదయమూ, ఊళ్లో దండోరా వేయించారు. ఆ వేళ వైశాఖి పర్వదినం. మధ్యాహ్నం 3.00 గం.కల్లా తండోపతండాలుగా జనం బాగ్ చేరుకున్నారు. ఇంకా అనేకమంది వెళ్లేదారిలో ఉన్నారు. ఇంతలో ముందుగా హెచ్చరిక లేకుండా, అక్కడ చేరినవారిపై గుండ్ల వర్షం

# 13, 1919 నాటి సంగతి

కురిపించటం జరిగింది.

మొట్టమొదటగా మదన్‌మోహన్ అనే 12 సంవత్సరాల బాలుడు నేల కొరిగాడు. ఆ వెంటనే బాగ్‌కు పక్కన ఉన్న తన ఇంటి కిటికీలో కూర్చున్న మరో బాలుడు అమరుడైనాడు. విగతజీవులూ, క్షతగాత్రులూ, ఆ రాత్రి అంతా ఆ తోటలోనే ఉండి పోయారు. తమ ఆప్తులు ఏమైనారో వెతికేందుకు, బహుకొద్దిమంది మాత్రమే అక్కడికి వెళ్లేందుకు ధైర్యం




చేయగలిగారు. సకాలంలో వైద్య సహాయం అందక చాలామంది మరణించారు. అనేకమంది మృతదేహాల అడుగున పడి అణగారిపోయినారు – వారికి ఒక గ్రుక్కెడు నీళ్లు పట్టే నాథుడు లేకపోయినాడు.

సైనికులు వెళ్లిపోయాక, ఇంకా శక్తి మిగిలి ఉన్నవారు, మెల్లగా బయటపడ్డారు. చాలామందికి, తమకు గాయాలు తగిలిన సంగతే తెలియలేదు. కొందరు జలియన్‌వాలాబాగ్ చుట్టుపక్కలలో వీధులలో, నేలమీద పడిపోయి ప్రాణాలు విడిచారు.

ఈ దురంతం తర్వాత, పాలకులు, ప్రజలు యావన్మందినీ హడల గొట్టించే పనులెన్నో చేశారు. వర్తకులు తమ దుకాణాల తాళాలను పట్టణంలోని కొత్వాల్‌కు అప్పగించాలని హుకుంజారీ అయింది. మిగతా వర్తకుల మోస్తరే మా తండ్రిగారు కూడా ఉదయమే కొత్వాల్ కార్యాలయానికి పోయి, తాళం చెవులను మెట్లమీద ఉంచి, సూర్యాస్తమయం వరకు, అక్కడే వాటి ప్రక్కనే గడుపుతూ ఉండేవారు. ప్రజల మోటారు కార్లనూ, టాంగాలనూ, ఇతర శకటాలనూ, సైనిక పాలనాధికారులు వశపరచుకున్నారు. అందుకు పరిహారమివ్వడానికి బదులు, వాటిని నడపడానికి అయ్యే ఖర్చును, వాటి స్వంతదారులు చెల్లించవలసి వచ్చింది.

మా టాంగాను డయ్యర్ సేనాని సతీమణి ఉపయోగానికి కేటాయించారు. చిక్కిపోయినట్టు కనిపించే మా గుర్రం ఆమెకు నచ్చలేదు. కాల్చి చంపించాలనుకున్నారు. ఆ 'దౌర్భాగ్యపు' గుర్రాన్ని స్వయంగా కాల్చివేయదలచాననీ స్వంతదారులను పిలుచుకురావలసిందనీ, ఆమె, మా బండి తోలే అతనికి చెప్పింది. ఆ గుర్రం మీద ఇంత కోపానికి కారణమేమిటని అతను అడిగాడు. ఇప్పటికో మరి కాస్సేపటికో చనిపోయే స్థితిలో ఉన్న గుర్రం బండిలాగుతూ ఉంటే తాను కూర్చోలేనని ఆమె సమాధానమిచ్చింది. ఆ నిర్భాగ్యపు గుర్రానికి ఒక్క అవకాశమివ్వవలసిందని కోరాడు. ఆమె నన్ను అనుమతించింది.

గుర్రాన్ని బండికి కట్టాడు. ముందు మామూలుగా నడిపించి, తర్వాత పరుగు లంకించుకునేట్లు చేశాడు. ఆ వేగానికి, టాంగాలో నుంచి డయ్యర్ సతి ఎగిరి క్రిందబడేటంత పని అయింది. బండి ఆపవలసిందని పొలికేక ఒకటి పెట్టింది. బండి జోరు తగ్గించడానికి టాంగావాలా ప్రయత్నించాడు. కాని గుర్రం లక్ష్య పెట్టలేదు. చివరకు దానంతట అదే ఆగిపోయింది. డయ్యర్ సతి ప్రాణాలతో బయటపడినందుకు గట్టిగా నిట్టూర్చింది. భయం నుంచి తేరుకోవడానికి కొంతసేపు పట్టింది. బండివాడిని చూచి చిరునవ్వు నవ్వింది. గుర్రం వీపు మీద తట్టింది. జేబులో నుంచి రుమాలు తీసి, దాని జూలుకు ముడివేసింది. ఆ గుర్రం బండి స్వంతదారులను రమ్మని చెప్పమన్నది. అయితే ఈసారి కారణం వేరు. అటువంటి చక్కటి గుర్రం వారిదైనందుకు వారిని అభినందించడానికి.

డయ్యర్ సతి తనను చూడాలనుకుంటున్నదని బండివాడు వచ్చి చెప్పేసరికి, మా తండ్రిగారు భయపడిపోయారు. టాంగాతోకాని, గుర్రంతోకాని, ఏ ప్రమేయమూ ఆయన పెట్టుకోదలచలేదు. ఇష్టమైతే గుర్రాన్ని కాల్చివేయవచ్చునని చెప్పమన్నారు. అప్పుడు బండివాడు జరిగినదంతా చెప్పాడు. మా తండ్రిగారు స్వయంగా వెళ్లలేకపోయారు. అప్పట్లో ఆయన బాగా అస్వస్థగా ఉన్నారు. తనను సత్కరించదలచినట్లయితే, ఆరోగ్యాన్ని కోలుకోడానికి రోజూ తన పెద్ద కుమారుని వెంట తీసుకుని, ఊళ్లో అలా తిరిగివచ్చేందుకు అనుమతించవలసిందని, ఆమెకు కబురంపారు. ఈ అనుమతి వెంటనే లభించింది.

ఆ రోజుల్లో అమృత్‌సర్ నగరం నిర్మానుష్యంగా, కళావిహీనంగా కన్పించేది. ఎవ్వరూ ఇళ్లలో నుంచి కదిలేవారు కారు. పక్షులు సైతం ఊరు విడిచి ఏటో ఎగిరివెళ్లాయి. ఆశ్వారూఢులైన పోలీసులు నగరంలో గస్తీ తిరిగారు. ఎప్పుడు వారెటుపక్క నుంచి వెళ్లినాసరే వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి భారతీయుడూ నిటారుగా నిలబడి వారికి అభి నందనం చేయవలసిందే. ఈ సంగతి తెలియక ఎవరైనా ఆ పనిచేయకపోతే కొరడా దెబ్బలకు గురి అయి, బాధకు ఓర్వలేక కేకలు పెడుతూ పరుగు తీయవలసిందే.

ఒకరోజున రాణి విగ్రహం దగ్గరగా నేను నిలబడి ఉండగా, డయ్యర్ సేనాని ఆ దారిన వెళ్లటం తటస్థించింది. బాలుడినైన నేను హడలిపోయాను. అభినందనం చేసేందుకు యెత్తిన చేయి దాదాపు అరగంటవరకు డయ్యర్ బలగం కనుచూపు మేరలో నుంచి వెళ్లిపోయేవరకు అలాగే ఉండిపోయింది. ఈ సంఘటనతో నా వైఖరి పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు శాంతి కాముకులైన ఒకానొక వ్యాపారస్తుని అమాయక పుత్రుడుగా ఉంటూండిన వాడినల్లా, ఆ క్షణం నుంచి పర ప్రభుత్వాన్ని ద్వేషించి తిరుగుబాటుదారునైనాను. మనలనందరిని బానిసలుగా మార్చిన ప్రభుత్వాన్ని, ఎదిరించి పోవాలని ఆ క్షణంలోనే తీర్మానించుకున్నాను.

ప్రభుత్వం ప్రజలను ఇంతగా హడల గొట్టినా, ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా కూడా అక్కడ జరిగిన మారణహోమం గురించి బయటి ప్రపంచానికి ఎటూ అందనే అందాయి.

పండిత మదనమోహన్ మాలవ్యా అమృత్‌సర్ వచ్చారు. రైలు వంతెనకు ఎదురుగా ఉన్న ఒక చిన్న ఆలయంలో బస చేశారు. భయ విహ్వాలులై ఉన్న నగరవాసులెవరూ ఆయనను, తమ ఇళ్లకు రానివ్వలేదు. చివరకు, ఒక గ్లాసెడు మంచినీరు ఇచ్చే ప్రాణి కూడా ఎవరూ ఆయనకు కన్పించలేదు. అంత మాత్రం చేత ఆయన అధైర్యపడలేదు. ఊరూరా కాలినడకన తిరుగుతూ, ప్రజలకు ధైర్యం కల్గించేందుకు ప్రయత్నించారు.

పంజాబ్ ప్రజలకు గుండె ధైర్యం కల్గించడానికి, పరాయి పాలకుల దౌష్ట్యాన్నీ, దమననీతినీ సవాలు చేయడానికిగాను, ఆ తర్వాత కాంగ్రెసు మహాసభలను, 1919 డిసెంబర్‌లో అమృతసర్‌లో గోలాబాగ్ అనేచోట ఏర్పాటు చేశారు.

భారత స్వాతంత్ర్య సమరంలో సహాయ నిరాకరణోద్యమానికి పూనుకోవాలని స్వరాజ్య ఉద్యమ కాంగ్రెసు ప్రప్రథమంగా తీర్మానించింది. ఇందుకు జలియన్‌వాలా బాగ్ దారితీసింది.

– జాగృతి 21.4.1969



మండుటెండలో వానజల్లు
జీవన గగన సీమన అదే హరివిల్లు
చిమ్మ చీకట్లో కొవ్వొత్తి వెలుతురు
జీవిత పయనాన అదే కదా దారిదివ్వె!
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్న చోటనే
మమతామయం, బాధ్యతాభరితం జతచేరితే
అదీ మానవ జన్మ! పరమార్థం ఇదే సుమా!

ఈ పంక్తులు 'చిన్నస్వామి'వి. మనందరికీ తెలిసిన, జాతీయవాదులు తలచి తలచి మురిసిన ఆ పేరు – సుబ్రమణ్యభారతి. ఆయన రచనలే భారతదేశాన స్వతంత్ర ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి. మనదైన వేదసాహిత్యాన్ని సమగ్ర అధ్యయనం చేసిన, భగవద్గీతను మాతృభాషలోకి అనువదించిన ఆ మహనీయ కవినే గురువుగా భావించిన రచయిత్రి – కమలాదేవి అరవిందన్.

ఆమె ఎంతగానో పేరొందిన విశ్లేషణాత్మక రచయిత్రి.

ఎంతటి పేరు అంటే....

'హాల్ ఆఫ్ ఫేమ్' పురస్కారం వరించేంత!

ఆమె విశిష్టత భారత సంతతి వ్యక్తి కావడం, వనితాశక్తికి విశ్వఖ్యాతి తేవడం.

తన రచనలు భారత్‌లోనే కాకుండా– సింగపూర్, మలేసియా, కెనడా ప్రాంతాల్లోనూ ముద్రణ రూపాల్లో వెలువడ్డాయి.

తమిళ, మలయాళ భాషల్లో మేటి అయిన తనకు తెలుగు అంటే మక్కువ.

# కమలామణి!

కమలాదేవి రచనాంశాల్లోనూ ఎంతో విభిన్నత ఉంది.

ఆమె ఇంతవరకు రాసినవన్నీ కథానికలు, రంగస్థల ప్రక్రియలు, రేడియో రూపకాలు. ఏది రాసినా 'బాధ్యత' అనే పదానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. స్వాతంత్ర్యానికి మరో పేరు బాధ్యతాయుత వర్తన అన్నదే ఆమె దృఢ అభిప్రాయం.

సుబ్రమణ్య భారతి గురించి ఆమె ప్రస్తావించని సందర్భమంటూ ఏదీ ఉండదు. ఎందుకని అడిగితే;

**"దేశీయ భాషల్లో తెలుగుకు సమర్చన చేసినవారు కాబట్టే సంగీత వేత్త త్యాగయ్యకు, సమాజ సంస్కర్త కందుకూరి వారికి అనుదిన నమస్సులు. సహజ పాండిత్యం నిండిన పోతన కవివర్యునికీ నమస్సుమాంజలులు.వీరంతా కరదీపికలయ్యారు. జాతి జనతను ముందుకు నడిపారు"** అంటూ చేతులు జోడిస్తారు కమలాదేవి.

భారత – సింగపూర్ రచయిత్రిగా ప్రశస్తి గడించిన ఆమెకు భారతీయత ఎంతైనా ప్రీతి పాత్రం. ఇప్పుడామెకు ఏడున్నర పదుల ప్రాయం. పదుల సంఖ్యలో మొదలైన రచనలు క్రమంగా వందలకు విస్తరించాయి. ఆమెకిప్పుడు ప్రతిష్టాత్మక పురస్కృతిని ప్రకటించిన సంస్థ హాల్ ఆఫ్ ఫేమ్ గురించీ మనం ఇక్కడ విశదంగా తెలుసుకోవాలి. వివిధ రంగాల్లోని సింగపూర్ మహిళలను గుర్తించి, సమాదరించి, గౌరవించే వ్యవస్థ అది.

ఆ సంస్థకు ఒకటిన్నర దశాబ్దకాల చరిత్ర ఉంది.

అది వృత్తి నిపుణులను చేర్చుకుంటుంది. సేవానిరతిని గమనించి వేదికపైకి తేవడంలో ఎప్పుడూ ముందే ఉంటుంది.

రంగాలవారీగా ప్రచురణలను ముద్రిస్తుంటుంది – మళ్లీ మళ్లీ.

రచనలైతే – సంఘానికి అవి ఏ మేర ప్రయోజనమో నిర్ధారిస్తుంది.

సాటి సంస్థలు, సంఘాలతోనూ కలసిమెలిసి పనిచేస్తుంటుంది. సంఘంలో విలువల పరిరక్షణ; దార్శనికత వ్యాప్తి, విస్తృతి; దీర్ఘకాలిక ఉత్తమ ప్రయోజనాల గమనింపు. అన్నింటికన్నా మించి అందరికీ న్యాయ పరికల్పనను అందించాలని శ్రమిస్తుంది. హాల్ అనే ఆంగ్ల పదంలో తొలి అక్షరం హెచ్ ఆకారాన్ని పోలి ఉంటుంది. మిగిలిన అక్షరాలు ఆల్ (ఏఏఎల్ఎల్) అడ్వాన్సింగ్ జస్టిస్ ఫర్ ఆల్ అనేది విశదీకరణ. సింగపూర్ జాతీయంగా ఏకైక వ్యవస్థే ఇదంతా. కమలాదేవి దక్షతను పురస్కార ప్రాతిపదికగా స్వీకరించిన సింగపూర్ కౌన్సిల్ ఆఫ్ విమెన్స్ ఆర్గనైజేషన్స్ ఈ ఎంపికను వెలువరించింది.

సింగపూర్‌కు సంబంధించి చెప్పాల్సి వస్తే –

అదో గణతంత్ర దేశం. మలేసియా ప్రాంతంలోని దేశం / భూభాగం.

సింగపూర్ అనగానే పర్యాటక నిలయంగానే అనుకుంటాం. కానీ, అందులోనే సాంస్కృతిక వారసత్వం వెల్లివిరుస్తోంది. శ్రీనివాస, శ్రీకృష్ణ, కాళిక ఆలయాలూ ఉన్నాయక్కడ.

అటువంటి దేశంలోని సంస్థ నుంచి అవార్డుకు ఎంపిక అవడంలోనే కమలాదేవి ప్రతిభ ప్రస్ఫుటమవుతోంది. ఒక పురస్కారాన్ని గెలుచుకున్న ద్విభాషా రచయిత్రిగానూ ఆమెకి ప్రశస్తి.

మలేసియా, సింగపూర్‌లో ప్రయాణాల వేళ తను గమనించిన వాటిని ఎప్పటికప్పుడు అక్షరబద్ధం చేయడం ఆమె అలవాటు. తను పదిహేనేళ్ల వయసులోనే ఉత్తమ రచయిత్రి పురస్కృతి విజేత!

తన ఆసక్తికి ఊతం ఇచ్చిన గురువర్యులుగా ముత్తుస్వామిని, రామానుజన్‌ని స్మరించుకుంటారు ప్రతీ సందర్భంలోనూ.

ఆమె చిన్న రచనల్లో కొన్ని మలయాళ ప్రాంతంలో పాఠ్యాంశాలు. తనకు తాను వెలయించిన పరిశోధనాత్మక వ్యాసాలూ అనేకాలు.

తన తమిళ రచనలకు అవార్డులెన్నింటినో అందుకున్నట్లే – మలయాళ కావ్యాలకూ సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా ఆమె రచించిన నాటకాలను సింగపూర్‌లో ప్రదర్శించారు పలువేదికల మీద!

రచయిత్రిగానే కాకుండా దర్శకురాలిగానూ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఆమెది నిరంతర కళారంగ ప్రయాణం.

ఇంకా ప్రత్యేకాంశం ఒకటుంది. సారస్వత సీమలో ఆమె పయనాన్ని వివరిస్తూ అంతటినీ నమోదు చేసింది ఇండియన్ కమ్యూనిటీ ఓరల్ హిస్టరీ ప్రాజెక్టు సంస్థ.

తన అనుభవాన్ని వర్ధమాన కవులూ, కవయిత్రులూ, కళాకారులకు విపులీకరించేలా కార్యశాలలు (వర్క్‌షాపులు) నిర్వహించారామె. ఇందుకు సింగపూర్ రచయితల సంఘం, నేషనల్ లైబ్రరీ నుంచి సమన్వయ సహాయ సహకారాలు అందుకున్నారు.

ఆమె రాసిన వాటిని ఎందరెందరో ఆంగ్లంలోకి అనువదించారు. చరిత్ర అంశాలతో ఆమె రచించిన పుస్తకాన్ని ఆమె కుమార్తె అనితాదేవి అనువదించారు. సెంబావాంగ్ ప్రాంతంలోని నిజ జీవిత సంఘటనలే ఇతివృత్తాలు.


సింగపూర్ ఉత్తర ప్రాంతంలోనిదే సెంబావాంగ్. ఇదే ప్రదేశంలోనిదే తంబువాంగ్ నది. విభిన్న కథనాంశాల సమాహారం ఇది. ఇక్కడి నుంచే కమలాదేవి అరవిందన్ రచన రూపుదిద్దుకుంది.

ప్రచురించిన వ్యవస్థ మార్షల్ కావెండిష్ ఇంటర్నేషనల్ ఆసియా. ఇది ఐదేళ్ల కిందటి సంగతి. ఈ సెంబావాంగ్ పుస్తకానికి ఉత్తమ గ్రంథ పురస్కారం లభించింది.

ఆ పుస్తకంలోనే తన జ్ఞాపకాల పరంపరను అక్షరీకరించారామె.

మలేసియాలోని ఒక చిన్న ఊళ్లో పుట్టి పెరిగిన కమలాదేవి ఆ ఊరిని కన్న తల్లితో సమంగా ఆరాధిస్తారు. ఆ ఊరి పేరు– లాబిస్. ఆ పరిసరాల్లోనే పాఠశాల చదువు, తమిళంతోపాటు మలయన్, ఆంగ్ల భాషలను అభ్యసించారు. తండ్రి నుంచి మలయాళంలో ప్రావీణ్యం గడించారు.

పాఠశాలలో చదువుతుండగానే వ్యాసాలు,




"మొదటి బహుమతి నాకే రావాలి. నిర్ణేతలు ఇవ్వలేదు. ఇంకెవరికో (కమలాదేవికి) ప్రకటించేశారు. అసలేమిటి తన గొప్ప? అసలు ఆ రచన తనదేనా, ఎవరిదైనా చూసి రాసిందా?" అంటూ అడ్డగోలుగా మాట్లాడాడు. నాకు ఏడుపొచ్చింది. అతగాడిమీద మండుకొచ్చింది. కానీ ఏంచేయాలిప్పుడు? అనుమానాన్ని ఎలా తిప్పికొట్టాలీ? ఇంతలో వేదికమీద ఉన్నవారిలో ఒకాయన తన స్థానం నుంచి పైకి లేచారు. నేరుగా నా దగ్గరికే వచ్చి అడిగారు 'అమ్మాయ్! అది నువ్వు రాసిందేనా?'

కవితలు రాసిన అనుభవం తనది. అప్పట్లో ఎన్ని రచించినా ఆ అన్నీ పుస్తకంలోనే ఉండిపోయేవి. వాటిని గ్రహించి, వెలికితీసి, మలేసియాలోని వారపత్రికకు ముద్రణ కోసం పంపినవారు ఆమెకు చదువు చెప్పిన ఉపాధ్యాయిని!

అప్పటి నుంచే ఆమె రచనల ప్రచురణ ఆరంభమైంది. 'మీ జీవితంలో మరువలేని సందర్భం ఏమిటి' అని అడిగినపుడు ఇలా వివరించారామె;

**"అప్పుడు నాకు పదిహేనేళ్లు. ఒక పోటీలో పాల్గొన్నా. నా గొప్ప తనం చూపాలని కాదు. భాషలో నేనేమిటో, నా స్థానం ఎటువంటిదో పరీక్షించు కోవాలని మాత్రమే! విశేషం, విచిత్రం, ఆశ్చర్యం ఏమిటంటే– ఆ పోటీలో ఆ రచనకు ప్రథమ బహుమతి నాకే!**

**ముందు నమ్మలేకపోయా. ఆ తర్వాత బలంగా నమ్మాను. నన్ను నేనే అభినందించుకున్నాను. సంతోషంతో పొంగిపోయాను.**

**రెండో బహుమతి పొందిన వ్యక్తి అప్పటికే పేరున్నవాడు. పేరుతోపాటు అహాన్నీ సొంతం చేసుకున్నాడేమో... వేదికమీద బహుమతి ప్రదాన తరుణాన ఎదురు తిరిగి మాట్లాడాడు.**

**"మొదటి బహుమతి నాకే రావాలి. నిర్ణేతలు ఇవ్వలేదు. ఇంకెవరికో (కమలాదేవికి) ప్రకటించేశారు. అసలేమిటి తన గొప్ప? అసలు ఆ రచన తనదేనా, ఎవరిదైనా చూసి రాసిందా?" అంటూ అడ్డగోలుగా మాట్లాడాడు. నాకు ఏడుపొచ్చింది. అతగాడిమీద మండుకొచ్చింది. కానీ ఏంచేయాలిప్పుడు? అనుమానాన్ని ఎలా తిప్పికొట్టాలీ?**

**ఇంతలో వేదికమీద ఉన్నవారిలో ఒకాయన తన స్థానం నుంచి పైకి లేచారు. నేరుగా నా దగ్గరికే వచ్చి అడిగారు 'అమ్మాయ్! అది నువ్వు రాసిందేనా?'**


**నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది. 'రాసింది నేనే, నేనే, నేనే' అన్నాను గట్టిగా.**

**'అయితే నువ్వు రాశానంటున్న ఆ వ్యాసానికే సంబంధించి కొన్ని ప్రశ్నలడుగుతా. ఇతర ప్రశ్నలూ వేస్తా. జవాబిస్తావా?' ప్రశ్నించాడు.**

**ఒక్క క్షణమైనా ఆగలేదు నేను. ఆయన అడిగిన ప్రతీ ప్రశ్నకీ దీటైన బదులిచ్చాను. వేదికమీద ఉన్న అందరూ నన్నే మెచ్చుకోలుగా చూశారు. నన్ను ప్రశ్నించిన పెద్ద మనిషైతే 'శభాష్' అంటూ భుజం తట్టి 'నువ్వు మన భాష అంతటికీ గర్వకారణం అమ్మాయీ' అన్నాడు. చప్పట్లు ఆగకుండా మోగాయి సభ నుంచి! ఆ శబ్దాల మధ్యనే ఆయన తన మెడలోని దండను తీసి ఆశీస్సుపలుకుతూ నా మెడలో వేశాడు. మళ్లీ సభలో హర్షధ్వానాలు! మామూలు వ్యక్తి కాదు ఆయన, తమిళ వార్తాపత్రికకు వ్యవస్థాపక సంపాదకుడు!"**

ఈ జ్ఞాపకం ఒక్కటీ చాలదా... కమలాదేవి ధీశక్తిని చాటి చెప్పడానికి! సింగపూర్ హాల్ ఆఫ్ ఫేమ్ బహూకృతి ఈసారి ఆమెనే వరించిందంటే.... అదీ తన దీక్ష, దక్షత, ప్రతిభ, సాహితీ ప్రభ!

జాతీయతను, స్వతంత్రను సదవగాహన చేసుకున్న వనిత. ఆ అవగాహననే అందరికీ కలిగించాలని సంవత్సరాలుగా పరిశ్రమించినందుకే కమలాదేవికి అంతటి బహూకృతి!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్




పోర్చుగీస్ వలస పాలనను నాలుగున్నర దశాబ్దాల పాటు నిలువరించి, ఐదారు యుద్ధాలలో వాళ్లని ఓడించిన వీర వనిత రాణీ అబ్బక్క. 1525 ఆమె ఉల్లాల్ రాణి అయినది మొదలు, తుదిశ్వాస విడిచిన 1570 వరకు పోర్చుగీస్ వలసదారులతో పోరాడారు. అలా 'అభయరాణి' అన్న బిరుదును సార్థకం చేసుకున్నారని అనిపిస్తుంది. భారతీయులు స్త్రీలను గడప వెనుకే ఉంచుతారన్న పాశ్చాత్యుల దుష్ప్రచారానికి ఆమె తిరుగులేని సమాధానం. భారతీయుల విజయాలు, అందులోను ఒక మహిళ కేంద్రబిందువుగా సాగిన వీరోచిత పోరాటాలు బయటి ప్రపంచానికి తెలిస్తే పాశ్చాత్య దేశాలకు ఎంత అవమానం? భారత్‌ను ఒక వలసగా చేసి దోచుకుంటున్న దేశాలకు ఎంత తలవంపు? పోర్చుగీసు కుట్రలని తిప్పికొట్టిన నాలుగున్నర దశాబ్దాల వీరగాథ అబ్బక్కది. అయినా అబ్బక్క వీరచరితాన్ని కర్ణాటక సాగరతీరంలో ఇసుక తిన్నెలకు పరిమితం చేశారు. కచ్చితంగా చెప్పాలంటే అబ్బక్క ప్రపంచ చరిత్రలోనే ఒక అబ్బురం. తొలి భారత స్వాతంత్ర్య పోరాట యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి అని ఎవరైనా ప్రకటిస్తే, ఆ మాటను కొట్టివేయకుండానే, అంతకు 300 సంవత్సరాల ముందే యూరోపియన్లను వణికించిన మరో వీరనారీమణి అబ్బక్క ఉన్నారని మనం ఎలుగెత్తి చాటాలి. ఇంకా ఒనకే ఓబమ్మ, కిత్తూరు చెన్నమ్మ, బెలవాడి మల్లమ్మ, కేళడి చెన్నమ్మ మొదలైన వారు. వారిలో ఒక్కొక్కరిది ఒక విశేష జీవనం.

# ఆమె అభయరాణి

1498లో వాస్కోడా గామా దక్షిణ భారతదేశంలోని కాలికట్ చేరుకున్న తరువాత యురోపియన్ వలసవాదం పరాకాష్టకు చేరుకుంది. వాస్కోడాగామా సముద్రమార్గం కనుగొన్న తరువాత సుమారు ఇరవై సంవత్సరాల వరకూ పోర్చుగీసు వారి గుత్తాధిపత్యం కొనసాగింది. అప్పటి నుండే వారు ఇండోనేషియా, శ్రీలంక, చైనా (మకావు) వంటి దేశాలలో అనేక కోటలు కట్టారు. వారికి కావలసినవి సుగంధద్రవ్యాలు, మసాలా దినుసులు, బట్టలు. వాటిని సంపాదించడానికి ఎగుమతి చేసుకోవడానికి వీలు కల్పించే అన్ని మార్గాలపైన ఆధిపత్యం సంపాదించారు. దానితో వాణిజ్య మార్గాలను నియంత్రించడానికి పోర్చుగీసు, డచ్, ఇంగ్లండు, ఫ్రాన్సులు పోటీపడ్డాయి. వారిలో ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ పైచేయి సాధించింది. కాబట్టి ఇంగ్లీషు వారితో జరిగిన పోరాట సంఘటనలే స్వాతంత్ర్య ఉద్యమంలో చోటు చేసుకున్నాయి. కానీ ఇతర వలసలతో జరిగిన ఉద్యమాలు పెద్దగా ప్రాధాన్యం సంతరించుకోలేదు. ఫలితంగా ఆ గాథలు కనుమరుగైనాయి. అందులోనిదే అబ్బక్క చరితం.

విజయనగర పాలకుడు, తుళువ వంశీకుడు శ్రీకృష్ణదేవరాయలు 1529లో మరణించాడు. తరువాత ఆ మహా సామ్రాజ్య పతనం మొదలైంది. తుళువనాడు అని పిలిచే ఉడిపి-దక్షిణ కన్నడ కాసరగోడ్ ప్రాంతం కీలక వాణిజ్య కేంద్రం. మేలు జాతి గుర్రాలు, బట్టలు, మిరియాలు, ఇతర సుగంధద్రవ్యాల వ్యాపారం దీని గుండా సాగింది. ఇది విజయనగర సామంతరాజులు పరిపాలనలో ఉంది. తుళువ రాజు పరిపాలించిన సంస్థానాల సమాహారమది. విజయనగర రాజ్య పతనం తరువాత వీరు స్వయం ప్రతిపత్తి పొందారు. కానీ ఈ రాజ్యాలకు పోర్చుగీసు పెద్ద బెడదగా తయారైంది. రాణి అబ్బక్క చౌతా కథ ఇక్కడే ప్రారంభమవుతుంది. అబ్బక్క పూర్వీకులు జైనులు వీరు గుజరాత్ నుండి కర్ణాటకలోని తుళువనాడుకు సుమారు 12వ శతాబ్దంలో వలస వచ్చినారని ప్రతీతి. వీరు జైనులు అయినప్పటికి సమీపంలోని సోమేశ్వరాలయంలోని సోమేశ్వరనాథునే తమ వంశదైవంగా స్వీకరించారు.

కోస్తా కర్ణాటక (తుళువనాడు) లోని కొన్ని ప్రాంతాలను పాలించిన స్థానిక తుళువ రాజవంశం చౌతా కుటుంబానికి చెందినది. వారి రాజధాని పుట్టిగే. ఉల్లాల్ ఓడరేవు పట్టణం (మంగుళూరు దగ్గర) వారి అనుబంధ రాజధానిగా కొనసాగు తున్నది. ఉల్లాల్ చాలా వ్యూహాత్మకం కనుక దానిపై పోర్చుగీసు వారు కన్ను వేశారు. చౌతాలు మాతృవంశ విధానాన్ని అనుసరించేవారు. తద్వారా అబ్బక్క ఉల్లాల్ రాజ్యానికి రాణి పదవిని అలంకరించారు. ఆమె సునిశిత మేధ గొప్పది. యూరోపియన్ల ఆధునిక మందుగుండు ముందు భారతీయ రాజ్యాలు తల దించడం ఆమె గమనించింది. కాబట్టి సాంప్రదాయే తర గెరిల్లా యుద్ధవిద్యకు ప్రాధాన్యమిచ్చింది. పొరుగు రాజ్యాలతో వ్యూహాత్మక సంబంధాలను ఏర్పరచుకుంది. కాలికట్ రాజు జామరిన్ మద్దతు కోరింది. తన సరిహద్దు రాజ్యాలకు స్నేహ హస్తం అందించింది. తద్వారా ఒక బలమైన కూటమిని తయారుచేసింది.

12వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకు తుళువనాడులోని కొన్ని ప్రాంతాలను పాలించిన చౌతా రాజవంశీకులలో అబ్బక్క జీవితం, దృష్టికోణం, పాలనా సామర్థ్యం చరిత్రలో ప్రత్యేకమైనవిగా స్థానం పొందాయి. చిన్నతనం నుండి విలు విద్య, కత్తి యుద్ధం, వివిధ యుద్ధ విద్యలలోనే ప్రావీణ్యం గడించింది. 3వ తిరుమలరాయలు చౌతా రాజు, ఈమెను ఉల్లాల్ రాణిగా ప్రకటించాడు. పోర్చుగీస్ వలస ఆధిపత్యం మీద తిరుగుబాటు చేసినందుకు తొలి మహిళా స్వాతంత్ర్య యోధురాలిగా ఆమెను గౌరవించడం పరిపాటి. ఈ సాహసం ఆమె 16వ శతాబ్దంలోనే చేశారు. ఆమె పాలనలోని ఉల్లాల్ పోర్చుగీస్ పరం కాకుండా ఆమె చేసిన యుద్ధాలు స్మరణీయమైనవి. ఈ క్రమంలో భర్త లక్ష్మప్ప అరస బంగరాజా-2 (మంగళూరులోని బంగా సంస్థానాధిపతి)ను సైతం ఆమె విడిచిపెట్టింది. పెళ్లిలో ఇచ్చిన నగలన్నీ తిప్పి పంపడం అతడికి అవమానంగా తోచింది. మహిళ అని గాని, మాజీ భార్య అని గాని చూడకుండా అతడు పోర్చుగీసు శక్తులతో చేతులు కలిపి ఆమె పతనానికి సహకరించాడు.

పోర్చుగీసులు గోవాను కబళించిన తరువాత దక్షిణంలోని తీర ప్రాంతం మీద కన్నేశారు. ఆ క్రమంలోనే 1525లో మంగళూరు పోర్టును ధ్వంసం చేశారు. ఆపై అబ్బక్క చౌతా ఆధిపత్యంలోని ఉల్లాల్‌ను స్వాధీనం చేసుకోవాలని కదిలారు. ఆరేబియాతో పాటు, పాశ్చాత్య దేశాలకు సుగంధ ద్రవ్యాల రవాణాకు ఉల్లాల్ కేంద్ర బిందువు.

నిజంగానే ఉల్లాల్ పోర్చుగీస్ చేతిలో పడకుండా రక్షించుకోవడానికి ఆనాడే కులం, మతం, వర్గం, ప్రాంతీయ భేదాలను వీడి ప్రజలంతా ఐక్యమయ్యారు. వారికి అబ్బక్క నాయకురాలు. పోర్చుగీస్ బలగాలను ఎదిరించి అగ్నివాన కురిపిస్తూ నిలువరించే ప్రయత్నం చేసిన వారిలో అబ్బక్క ప్రథమురాలు అని జానపద సంపద అనే అంశం మీద అధ్యయనం చేసిన డా. కైలాశ్ కె. మిశ్రా వ్యాఖ్యానించారు. జైన మతస్థురాలే అయినా ఆమె కొలువులో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కూడా పనిచేశారు. ఆమె సైన్యంలో మొగ్గవీర (జాలరులు) వర్గీయులు విశేష సంఖ్యలో ఉండేవారు. జైన ఆధ్యాత్మిక కేంద్రం మూదబిద్రి కేంద్రంగా ఆమె



పరిపాలన సాగించారు. ఆమె నౌకాదళాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఉల్లాల్ పెద్ద నౌకాశ్రయం అనొచ్చు. మలాలై ఆనకట్టను స్వీయ పర్యవేక్షణలో నిర్మించారు. నిర్మాణాల కోసం ఆమె బెరీ వర్గం వారిని (ముస్లింలలో చిన్న తెగ) నియమించేవారు.

వలస రాజ్యాల ప్రభ చెలరేగిపోతున్నప్పుడు అబ్బక్క పోర్చుగీస్‌ను ఎదిరించింది. వాస్కోడా గామా సముద్రమార్గం కనుగొన్న తరువాత రెండు దశాబ్దాల కాలంలోనే పోర్చుగీస్ హిందూ సముద్రం మీద గుత్తాధిపత్యం సంపాదించారు. 16వ శతాబ్దంలో దేశానికీ, ధర్మానికీ చేటు జరుగుతున్న వ్యక్తి ఎవరైనా దూరంగా ఉంచాలన్న గొప్ప స్పృహను ప్రదర్శించిన వ్యక్తిగా రాణి అబ్బక్క కనపడతారు. కప్పం కట్టడానికి నిరాకరించినందుకు 1567లో ఉల్లాల్ నగరాన్ని పోర్చుగీస్ ముట్టడించింది. చాలామంది వలస పాలకుల మాదిరిగానే పోర్చుగీస్‌కు కూడా యుద్ధనీతిలో నమ్మకం లేదు. సాధారణ ప్రజలను హింసించేవారు. మొదటిసారి జరిపిన దాడిని అబ్బక్క తిప్పి కొట్టింది.

అబ్బక్క పట్టాభిషిక్తురాలైన 1525లోనే దక్షిణ కెనరా కేంద్రంగా పోర్చుగీస్ బలగాలు దక్షిణ మంగళూరు నౌకాశ్రయాన్ని ధ్వంసం చేశాయి. ఇది పోర్చుగీసు వైపు నుంచి జరిగిన మొదటిదాడిగా ప్రసిద్ధమైంది. దీనితోనే అబ్బక్క అప్రమత్తమైంది. తరువాత పరిణామమే 1555 నాటిది. 1525 నుంచి యుద్ధవాతావరణం ఉన్నప్పటికీ 1555లో అబ్బక్కకు, పోర్చుగీసు వలస పాలకులకు నడుమ ముఖాముఖీ ఘర్షణ ఆరంభమైందని అనుకోవచ్చు. 1555లోనే అడ్మిరల్ డాన్ అల్వారో డా సిల్వేరియాను ఉల్లాల్ రాణి అబ్బక్క వద్దకు రాయబారం పంపారు. చెల్లించవలసిన కప్పం చెల్లించాలన్న ఆదేశాన్ని పట్టుకుని సిల్వేరియా అబ్బక్క వద్దకు వచ్చాడు. ఆమె నిరాకరించింది. ఇలాంటి సమయంలో అబ్బక్క భర్త పోర్చుగీస్ వలసదారులకు దగ్గరయ్యాడు. నిజానికి అతడు పాలిస్తున్న సంస్థానాన్ని అలా ఉంచి, అదనంగా భూమి ఇస్తామని పోర్చుగీస్ ఆశ పెట్టింది. రాయబారం విఫలమైన తరువాత 1555లో పోర్చుగీసువారు అడ్మిరల్ డాన్ అల్వారోడా సిల్వీరాను యుద్ధానికి కూడా పంపారు. ఈ యుద్ధంలో అబ్బక్కదే పైచేయి అయ్యింది. 1557లో పోర్చుగీసు సేనలు మంగళూరు నౌకాశ్రయాన్ని దోచుకున్నాయి. మరుసటి సంవత్సరం మంగళూరు మీద ఆ సేనలు దాడికి దిగాయి. మూడోదిగా చెప్పే ఈ యుద్ధంలో పోర్చుగీసు క్రూరత్వం బయటపడింది. పురుషులతో పాటు మహిళలు, చిన్నారులను కూడా హింసించారు. ఆలయాలను కూడా దోచుకుని అంతిమంగా పట్టణానికి నిప్పు పెట్టారు. 1567లో మరొకసారి పోర్చుగీసు దాడి చేసింది. ఇది నాలుగోదాడి. ఈసారి ఉల్లాల్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే అబ్బక్క నిరోధించగలిగింది. ఐదోదాడి 1568లో జరిగింది. పోర్చుగీస్ వైస్రాయ్ ఆంటోనియో నోరోన్‌హా సేనలను పంపాడు. ఈ దాడిలో పోర్చుగీస్ సేనలు ఉల్లాల్ పట్టణాన్ని, రాజ ప్రాసాదాన్ని కూడా స్వాధీనం చేసుకోగలిగాయి. అప్పుడే ఆమె ఒక మసీదులో తలదాచుకుంది. ఆ రాత్రే అబ్బక్క సైనికులు 200 మంది పోర్చుగీసు సేనలను ఎదుర్కొన్నాయి. జనరల్ పీక్సోటో అనేవాడిని అబ్బక్క సేనలు చంపాయి. 70 మంది పోర్చుగీసు సైనికులను బందీలుగా పట్టుకున్నారు. దీనితో ఈ సేనలు పారిపోయాయి. అడ్మిరల్ మాస్కెర్నస్ అనే అధికారిని చంపి అబ్బక్క సేనలు మంగళూరు నౌకాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. 1569లో ఆరో దాడి జరిగింది. పోర్చుగీసు సేనలు మంగళూరును మళ్లీ కబళించాయి. ఉల్లాల్ మీద మళ్లీ దాడికి దిగాయి. ఇందుకు సాయపడినవాడు అబ్బక్క మాజీ భర్త బంగారాజా. 1570లోనే అబ్బక్క బిజాపూర్ సుల్తాన్‌తో కాలికట్ రాజు జామొరిన్‌తో కలసి కూటమి ఏర్పాటు చేసింది.

జమరిన్ సైన్యాధ్యక్షుడు కుట్టి పోకర్ మార్కర్ అబ్బక్క తరుపున పోరాడి పోర్చుగీస్ అధీనంలో ఉన్న మంగళూరు నౌకాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. కాని, మాటు వేసి పోర్చుగీసు సైన్యం మోసంతో మార్కర్‌ను చంపేశారు. ఈలోగా అబ్బక్క మాజీ భర్త రహస్యంగా సైన్యంతో వెళ్ళి అబ్బక్కను బంధించారు. ఈమె బందీగా జైలులో 1570లో మరణించారు.

నేటికి యక్షగాన, భూత కోల వంటి ప్రదర్శక కళలు అబ్బక్క వీర చరిత్రను కీర్తిస్తున్నాయి. "వీర రాణి అబ్బక్క ఉత్సవం" ఆమె జ్ఞాపకార్థం జరిగే వార్షిక వేడుక. ఈ సందర్భంగా విశిష్ట మహిళలకు వీరరాణి అబ్బక్క పశస్తి (అవార్డు) ప్రధానం చేస్తారు. జనవరి 15, 2003 భారత తపాలా శాఖ వారు అబ్బక్కపై ప్రత్యేక కవర్‌ను జారీ చేసింది. ఉల్లాల్‌లో, బెంగళూర్‌లో ఆమె కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. మాతృ దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన ధీరవనిత రాణి అబ్బక్క, పోర్చుగీసు చరిత్రలోనే ఓ మరచిపోని ఘట్టం. భారతదేశం ఉన్నన్ని రోజులు ఈ భారతీయులందరికి ఆమె ధీరత్వం గుర్తుండాలని 2015లో నౌకాదళంలోని ఒక నౌకకి రాణి అబ్బక్క పేరు పెట్టి రుణం తీర్చుకుంది.


Sources:

1) "Queen Abbakka: The warrior, Queen who defeated the Portugese.

2) Dr. Kailash Kumar Misra

3) Times of the warrior Queen Rani Abbakka Sirish Shetty.





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు


# నయవంచనకు పెట్టింది పేరు గ్రోక్

ఒకవైపు కృత్రిమమేథ –ఏఐ డిజిటల్ కమ్యూనికేషన్‌కు కొత్త రూపాన్ని ఇవ్వడంలో తలమునకలై ఉండగా మరోవైపు గ్రోక్ లాంటి ఏఐ నమూనాలు తప్పుడు సమాచారపు పుట్టలుగా డిజిటల్ ప్రపంచాన్ని కబ్జా చేస్తున్నాయి. గ్రోక్ అధునాతమైన భాషా సామర్థ్యాలతో అభివృద్ధి చెందినప్పటికీ అది ప్రజలను తప్పుదారి పట్టించే కథనాలను తెరమీదకు తీసుకువస్తూ వాటిని భూతద్దంలో పెట్టి చూపించడం ద్వారా నెటిజన్లలో నైతికపరమైన, భద్రతాపరమైన ఆందోళనలకు దారి తీస్తోంది. అమెరికా బిలియనీర్ వ్యాపారి ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బోట్ గ్రోక్ భారత ప్రధాని నరేంద్రమోదీపై 'అత్యంత మతతత్వ రాజకీయనాయకుడు' అనే ముద్ర వేసింది. తద్వారా పెను వివాదానికి కారణమైంది. గ్రోక్ అత్యంత ప్రభావశీలురైన భారత ప్రధానమంత్రిని ఇలా తప్పుడు భావనతో ప్రజలకు పరిచయం చేయడమనేది ఇక్కడితో ఆగిపోదు. ఇలాంటి పెనుసవాల్ విసురుతోంది. మొగ్గలోనే తుంచివేసే తరహాలో కఠినంగా వ్యవహరిస్తూ కట్టడి చేసే వ్యవస్థలూ, విధి విధానాలను వెంటనే డిజిటల్ బరిలోకి తీసుకురాని పక్షంలో ఏఐ చోదక తప్పుడు సమాచారం రాజకీయ ప్రక్రియలకూ, ప్రజల విశ్వాసానికీ, సుస్థిరమైన జ్ఞానానికీ పూడ్చలేని నష్టాన్ని కలిగిస్తుంది.



**ప్రజాస్వామ్యానికి పెను ముప్పు**

ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్‌ఏఐ గ్రోక్‌ను అభివృద్ధి చేసి, దానిని ఎక్స్‌తో (గతంలో ట్విటర్) కలిపేసింది. గ్రోక్‌ను ఓపెన్ ఏఐకు చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమిని, మెటాకు చెందిన ల్లామాకు పోటీదారుగా తీర్చిదిద్దారు. అయినప్పటికీ గ్రోక్ నైతికమైన ఏఐ నమూనాల్లో మొదటి వరుసలో ఉండాల్సింది పోయి అది తననుతాను తప్పుడు సమాచారానికి పురిటిగడ్డగా మార్చుకుంది. అది ఎన్నికలు, ప్రజారోగ్యం, దేశాల మధ్య విభేదాలు లాంటి కీలక అవాకులూ చెవాకులూ మున్ముందు కూడా సాగడానికి అన్నట్టుగా దీని వెనుక పెద్ద ఎత్తుగడ ఉన్నట్టే కనిపిస్తోంది. ఎలాంటి నియంత్రణ లేకుండా అడ్డూఅదుపూ లేకుండా రెచ్చిపోతున్న గ్రోక్ లాంటి ఏఐ నమూనాలతో వాస్తవం కనుమరుగైపోతుందని, చారిత్రక, రాజకీయ వాస్తవికతలు వక్రీకరణకు గురౌతాయనే ఆందోళన అంతటా వ్యక్తమౌతోంది. ఏఐతో అనంతమైన సమాచారాన్ని, అంతులేని జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఏఐ నిజానిజాలు తేల్చుకోకుండా వడ్డిస్తున్న సమాచారంతో ప్రజాస్వామ్య నిష్కాపట్యానికి, సమాజంలో ఐకమత్యానికి



మైన అంశాలపై తనకు తోచినట్టుగా సమాచారాన్ని ఇస్తోంది. దీనికి సామాజిక మాధ్యమం ఎక్స్ జత కలవడంతో తప్పుడు సమాచారం అనే అగ్నిలో ఆజ్యం పోసినట్టయింది. పాత్రికేయ రంగంలో ఉన్నట్టుగా గ్రోక్ ఇచ్చే సమాచారానికి ఒక నిజ నిర్ధారణ వ్యవస్థ అంటూ లేకుండా పోయింది. దాంతో అది ప్రధాని మోదీ లాంటి ప్రముఖులపై విషం కక్కుతోంది. అదే సమయంలో ఎన్నికలు, ఓటర్లకు సంబంధించిన సమాచారం వక్రీకరణలకు గురౌతోంది. ఏఐ చోదక తప్పుడు సమాచారం ఓటర్లను పెడదారి పట్టించే ప్రమాదం ఉంది. అభ్యర్థులు, పార్టీలు, పార్టీ విధానాల గురించి ఏఐ అల్లే కట్టుకథలు ఎన్నికల ఫలితాలను అవాంఛ నీయమైన రీతిలో ప్రభావితం చేస్తాయి. ప్రజాస్వామ్యాన్ని మట్టికరిపిస్తాయి. ప్రస్తుతం లేనిది ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా ప్రజలను భ్రమింపజేస్తున్న సోషల్ మీడియా శకం నడుస్తోంది. దీనికి ఏఐ పెంచి పోషించిన తప్పుడు సమాచారం తోడైతే అది మహావిపత్తుగా మారుతుంది.

**ప్రజారోగ్యంపై దుష్ప్రభావం**

రాజకీయ రంగం తర్వాత తప్పుడు సమాచారంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న రంగాల్లో ఒకటిగా ప్రజారోగ్యం నిలిచింది. టీకాలు, మహమ్మారులు, వైద్య చికిత్సలు ఇలా ఒకటేమిటి ప్రజారోగ్యానికి సంబంధించి ఏఐ పుట్ట నుంచి పుట్టుకొచ్చే అసత్యాలు టీకాల పట్ల ప్రజల్లో అపోహలు సృష్టించి వారిని అశాస్త్రీయమైన నాటు వైద్యం వైపు మొగ్గేలా చేస్తున్నాయి. ఒకసారి తప్పుడు సమాచారం డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత అది ఎక్కడి దాకా వెళుతుందీ, ఎంత మందికి చేరుతుందీ, అది సృష్టించే విధ్వంసం ఎంత మొత్తంలో ఉంటుందీ కచ్చితంగా చెప్పడమనేది నరమానవుడిక్కూడా సాధ్యం కాదు. ఇలా చెప్పలేకపోవడం వెనుక ఉన్న కారణాల్లో ఏఐపైన, అది వ్యాపింపజేసే సమాచారం పైన ఎలాంటి నియంత్రణ లేకపోవడం ఒకటి.

**కళ్లెం వేయకుంటే కష్టమే**

ప్రపంచంలో ఆయా దేశాల ప్రభుత్వాలు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోని పక్షంలో ఏఐ చోదక తప్పుడు సమాచారం డిజిటల్ శకంలో ఎదుర్కొనే పెను సంక్షోభాల్లో ఒకటిగా ఆవిర్భవిస్తుంది. ఏఐకి మానవ మేధస్సును వృద్ధి చేసేందుకు అవసరమైన అసాధారణమైన సామర్థ్యం ఉంది. అయితే దానికి సత్యనిష్ఠ, జవాబుదారీతనం అనే ముక్కుతాడు పడాలి.

విధాన రూపకర్తలు, టెక్నాలజీ దిగ్గజాలు, పౌర సమాజం ఒక్కతాటి మీదకు వచ్చి ఏఐ మానవ మేధస్సును కలుషితపరిచేదిగా కాకుండా మేధస్సును వికసింపజేసే ఒక చోదక శక్తిగా కలకలం ఉండిపోయేలా చూడాలి. దీనికి సంబంధించి మనం తీసుకునే నిర్ణయాల పైన ఏఐ సత్యానికి ఒక ఉత్ప్రేరకంగా ఉంటుందా లేక సామూహిక నయవంచనలో అగ్రగామిగా నిలుస్తుందా అనేది ఆధారపడి ఉంటుంది. ఏఐ విషంగక్కే విద్వేషపు సమాచారం, అసత్యాలకు పట్టంకట్టకుండా సత్యనిష్ఠను పాటించే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం. ★



# న్యాయమూర్తి నివాసంలో రూ.15 కోట్ల నోట్ల కట్టలు!

**హో**లీ పండుగ కామదహనానికే మాత్రమే పరిమితం కాకుండా హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో లెక్కా పత్రం లేని దాదాపు రూ.15 కోట్లు విలువైన కరెన్సీ నోట్ల కట్టలను కూడా దహించివేసింది. మార్చి 14 శుక్రవారం అర్ధరాత్రి దేశరాజధానిలో ఢిల్లీ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసం స్టోర్ రూమ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కట్టలకొద్దీ కరెన్సీ నోట్లు కాలిబూడిదై పోతూ మంటలార్పడానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బందికి కనిపించాయి. న్యాయవ్యవస్థకు మచ్చ తెచ్చిన ఈ ఘటనపై సుప్రీంకోర్టు స్పందించింది. అంతర్గత విచారణకు త్రిసభ్య కమిటీని నియమించింది. విచారణ పూర్తయ్యేంతవరకు జస్టిస్ యశ్వంత్ వర్మకు న్యాయపరమైన ఎలాంటి విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆదేశించింది. అయితే స్టోర్ రూమ్‌లో నోట్ల కట్టలకు, తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని, ఇది తనపై జరిగిన కుట్రగా జస్టిస్ యశ్వంత్ వర్మ ముక్తాయించారు.

**ఇదీ జరిగిందీ**

**మార్చి 14, రాత్రి 11:30:** న్యూఢిల్లీలోని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం.

**మార్చి 15, సాయంత్రం 4:50:** అగ్ని ప్రమాదం జరిగిన సమయానికి లక్నోలో ఉన్న ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయకు ఢిల్లీ పోలీస్ కమిషనర్ జరిగిన సంఘటన గురించి వివరించారు.

**మార్చి 16:** జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ న్యూఢిల్లీకి తిరిగి వచ్చీరావడంతోనే నేరుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాను కలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన చీఫ్ జస్టిస్ ఆదేశాలకు లోబడి జస్టిస్ యశ్వంత్ వర్మకు ఫోన్ చేశారు.

**మార్చి 17, ఉదయం 8:30:** జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు అతిథి గృహంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ ఇంటి స్టోర్ రూమ్‌కు ఎలాంటి తాళం వేసి ఉండదని, అది అందరికీ అందుబాటులో ఉంటుందని, అందులో వాడని ఫర్నీచర్ లాంటి సామాన్లు ఉన్నాయని జస్టిస్ ఉపాధ్యాయకు జస్టిస్ వర్మ తెలియపరిచారు. ఇది తనపై జరిగిన కుట్రగా జస్టిస్ వర్మ ఆరోపించారు.

**మార్చి 21:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా జస్టిస్ యశ్వంత్ వర్మకు కొన్ని ఆదేశాలు ఇచ్చారు. జస్టిస్ వర్మ ఫోన్‌లో డేటాను వెలికితీయడం కోసమని గత ఆరు నెలల నుంచి ఫోన్‌లో నిల్వ ఉన్న ఎలాంటి మెస్సేజ్‌లు లేదా కాల్ రికార్డులను డిలీట్ చేయవద్దని ఆదేశించారు.

**మార్చి 22:** సుప్రీంకోర్టు విడుదల చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార ప్రకటనకు లోబడి ఆయన తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. స్టోర్ రూమ్‌లో ఎలాంటి నోట్ల కట్టలు బైటపడలేదని చెప్పుకొచ్చారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న స్టోర్ రూమ్‌కు, తాను ఉంటున్న ఇంటికి ఎలాంటి సంబంధంలేదని, ఆ స్టోర్‌రూమ్‌కు గార్డులు, తోట పనివారు, సిబ్బంది, కేంద్ర ప్రజాపనుల శాఖ– సీపీడబ్ల్యూడీ సిబ్బంది తరచుగా వచ్చి పోతుంటారని తెలిపారు.

ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉపాధ్యాయ సమర్పించిన నివేదిక ప్రాతిపదికగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా పంజాబ్ హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌తో త్రిసభ్య విచారణ కమిటీని నియమించారు. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ నివేదికపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పందన, జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రకటన, అగ్నిప్రమాదానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సుప్రీంకోర్టు ఆన్‌లైన్‌లో ఉంచింది.

**వీడియోలో మంటల్లో భారీ నగదు**

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసపు స్టోర్ రూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నోట్ల కట్టలు కాలి బూడిదైపోతున్న దృశ్యాలతో కూడిన వీడియో సంచలనం సృష్టించింది. ఆ వీడియో క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాలి బూడిదైపోతున్న భారీ నగదు ఎక్కడ నుంచీ వచ్చిందీ అనేదానిపై, అగ్నిప్రమాదానికి దారి తీసిన పరిణామాలపై పెద్ద ఎత్తున చర్చను లేవనెత్తింది. ఆ వీడియో హైకోర్టు సిట్టింగ్ జడ్జి నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు ఉన్న సంగతిని ధ్రువీకరించింది. అయితే అది ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పడానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఒకదానితో ఒకటితో పొంతన లేకుండా చెబుతున్న మాటలకు పూర్తి విరుద్ధంగా ఉంది.

**మా కోర్టు చెత్తబుట్ట కాదు**

ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని తొలుత సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ నిరసన తెలిపింది. ఇదే విషయమై అసోసియేషన్ ఒక లేఖలో "కొలీజియం తీసుకున్న ఈ నిర్ణయంతో అలహాబాద్ హైకోర్టు ఒక చెత్త బుట్టనా అనే తీవ్రమైన ప్రశ్నను లేవనెత్తుతోంది" అని పేర్కొంది.

**జడ్జి నివాసానికి త్రిసభ్య కమిటీ**

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు మార్చి 25న మంగళవారం జస్టిస్ వర్మ అధికారిక నివాసానికి వెళ్లారు. అక్కడ అరగంటసేపు ఉన్నారు. కాలిన నగదు దొరికినట్టుగా చెబుతున్న ప్రాంతాన్ని సందర్శించారు.

లెక్కకు అందని నోట్ల కట్టలు మచ్చను తెచ్చిన న్యాయవ్యవస్థపై వ్యవహారంపై సుప్రీంకోర్టు వెంటనే స్పందించడం, అంతర్గత విచారణకు కమిటీని ఏర్పాటు చేయడంతో కేసు దర్యాప్తులో ఓ ఆశావహమైన ముందడుగు పడినట్టయింది. అయితే దర్యాప్తు అందించే ఫలితం, జస్టిస్ వర్మపై తీసుకునే చర్యలపైనే న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం తిరిగి పాదుకొనడం ఆధారపడి ఉంటుంది. ★

# 'నేపాల్ హిందూరాజ్యంగా




నేపాల్‌లో హిందూరాజ్యం కావాలన్న నినాదం, రాజ్యాంగబద్ధ రాచరికం రావాలన్న నినాదం జోరందుకుంటున్నాయి. ఇదే డిమాండ్‌తో మార్చి 28న రాజు అనుకూలురుకి, భద్రతాదళాలకి పెద్దఎత్తున ఘర్షణ జరిగింది. ఇద్దరు చనిపోయారు. 30 మంది గాయపడ్డారు. ప్రధాని కేపీ ఓలి అత్యవసర సమావేశం జరిపి పరిస్థితిని సమీక్షించారు. సరిగ్గా 20 రోజుల క్రితం రాజు అనుకూలురు పెద్ద ప్రదర్శన నిర్వహించారు. 'ఓ రాజా! మళ్లీ వచ్చి దేశాన్ని కాపాడు'. 'మాకు రాచరికం కావాలి', 'రాజ ప్రాసాదాన్ని ఖాళీ చేయండి'... మార్చి 8న నేపాల్ రాజధాని ఖట్మాండును హోరెత్తించిన నినాదాలు ఇవి. రెండు మాసాల క్రితం పోఖారా (గండకి ప్రాంత పాలనా కేంద్రం, ప్రముఖ పర్యాటక స్థలం) వెళ్లి, దానితో పాటు చుట్టుపక్కల ఆలయాలను దర్శించుకుని తిరిగి ఖట్మాండు వచ్చిన రాజు జ్ఞానేంద్ర షాకు ప్రజలు అపూర్వ స్వాగతం చెప్పారు. రాజు అనుకూల వర్గాలు, కార్యక్రమం నిర్వహించిన వారు ఆ రోజు నాలుగు లక్షల మంది హాజరయ్యారని చెబుతుండగా, అసోసియేట్ ప్రెస్ మాత్రం పదివేల మంది హాజరయ్యారని చెప్పింది. నిజానికి జ్ఞానేంద్ర రావడానికి వారం ముందు నేపాల్ రాజధానిలో పెద్ద బైక్ ర్యాలీ కూడా జరిగింది. వారి నినాదం కూడా అదే – నేపాల్‌లో తిరిగి హిందూ రాచరికం రావాలి.

తమ ధ్యేయం రాజును తిరిగి సింహాసనం మీద ప్రతిష్ఠించడమేనని, రాజుకు తాము మద్దతుగా ఉన్నామని 72 ఏళ్ల థిర్ బహదూర్ భండారీ మీడియాకు చెప్పారు. 'దేశంలో మార్పు గాలులు వీస్తున్నాయి. నేపాల్ రాచరిక వ్యవస్థ పునఃప్రతిష్ఠ కోసం మూడో ఉద్యమం మొదలైంది. ఇదే సమాఖ్య వ్యవస్థ రద్దుకు జరుగుతున్న ఉద్యమం కూడా' అని రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ నాయకుడు శ్యామల్ కృష్ణ శ్రేష్ఠ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. నేపాల్‌లో హిందూ రాచరికం పునరుద్ధరణకు గట్టి ఉద్యమమే జరుగుతున్నది. అయితే 2006లో జ్ఞానేంద్ర పాలనను అంతం చేయడానికి జరిగిన ఉద్యమంలో చైనా ఉన్నదని చాలామంది నమ్ముతారు. నేపాల్‌లో 240 ఏళ్ల పాటు హిందూ రాచరికం పరిఢవిల్లింది. రాజు పట్ల ప్రజలు తమ విధేయతను పునఃప్రదర్శించడం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అందుకు కారణం ఇప్పుడు ఉన్న ప్రభుత్వాల అవినీతి, పేదరికం. 2008 నుంచి నేపాల్‌లో రాజకీయ స్థిరత్వం లేదు. రాజును దింపి, గణతంత్ర రాజ్యంగా మార్చినప్పటి నుంచి 13 ప్రభుత్వాలు మారాయి.

అయితే దేశంలో తిరిగి రాచరికం ఏర్పడడం సాధ్యం కాదని నేపాల్ రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు. అందులో ప్రధాని కేపీ శర్మ ఓలి కూడా ఉన్నారు. జ్ఞానేంద్ర రాజధానికి చేరుకోవడానికి ఒకరోజు ముందు, అంటే మార్చి

# ఆక్స్‌ఫర్డ్‌లో మమతకు శృంగభంగం

ఆక్స్‌ఫర్డ్ అనగానే మన నాయకులు ఆగమేఘాల మీద వెళ్లిపోతుంటారు. ఇంగ్లండ్‌లో ఉన్న ఆ నగరంలో ఉపన్యాసం ఇస్తే చాలు జన్మ ధన్యమైనట్టే నమ్ముతారు. అక్కడ ఏం చెప్పినా బుద్ధిగా వినేవారు మాత్రమే ఉంటారని అలా వెళ్లేవారి నమ్మకం. ఇదే ఉద్దేశంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఆక్స్‌ఫర్డ్‌లోని కెల్లాగ్ అనే చోటకి మహోపన్యాసం ఇవ్వడానికి వెళ్లారు. కానీ ఆవిడ కంటే ముందే ఆవిడ ఘనకీర్తి ఆ ఊరు వెళ్లి కూర్చుంది. అదే విషాదం. మార్చి 27 తేదీన అక్కడ ఆమె ప్రసంగిస్తూ ఉంటే జనం ఒకటే హేళన. ఒకటే ఎద్దేవా చేశారు. అక్కడ రెండు రకాల ప్రేక్షకులు వెళ్లారు. ఒకరు మమత ఎన్ని అబద్ధాలు చెప్పినా ఈలలూ చప్పట్లతో వేదికని దద్దరిల్ల చేసేది ఒకటి. మమత మీద ప్రశ్నల వర్షం కురిపించి మమత బుర్ర తిరిగేటట్టు చేసిన ప్రేక్షక వర్గం ఇంకొకటి. బెంగాల్‌లో మీ హయాంలోనే కర్మాగారాలను తుపాకీకి అందకుండా పారిపోయాయట, నిజం కాదా! అని ఒకరు. ఆర్‌జీకర్ ఆసుపత్రి ఉదంతంలో మీ ప్రభుత్వం వైఖరి కాస్త మాక్కూడా చెప్పండి అని ఒకరు మమతని ఊపిరి ఆడకుండా చేసేశారు.

ఎంత మమత అయితే మాత్రం ఇంగ్లండ్ వెళితే తన స్వరూపం మారిపోతుందా ఏమిటి? అందుకే ఇలా ప్రశ్నలు వేసే వాళ్లందరినీ కలిపి తిట్టేశారు. మీరు వామపక్షులు అందామె. మీరు అల్ట్రా లెఫ్టిస్టులు అని కూడా విశేషణం ఒకటి తగిలించి నిందించింది. మమత కాబట్టి బీజేపీనీ, మతాన్నీ అసలు మరచిపోరు. ప్రశ్నించే వాళ్లంతా మతోన్మాదులు అని కూడా తేల్చారామె. పశ్చిమ బెంగాల్‌కు పెట్టుబడుల మీద పెట్టుబడులు ఎగురు కుంటూ వస్తున్నాయి అందామె. రూ.19 లక్షల కోట్లు వచ్చాయి అని చెప్పారామె. అందులో 14 లక్షల కోట్లకు సంబంధించిన పథకాలు అమలు దాకా వచ్చేశాయి అని కూడా వివరించారు. ఇలా కాకిలెక్కలు వద్దు, మీ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు ఎన్ని? అవి ఎవరివి.. కాస్త ఉదాహరణలతో వివరించండి అని ఒక ప్రేక్షకుడు నిలదీశాడు. ఇంకో సూటి ప్రశ్న అంటూ, టాటా గ్రూప్ మీ రాష్ట్రం నుంచి ఎందుకు వెనుదిరిగి చూడకుండా పారిపోయింది అని అడిగాడు. టాటా

# ఉండాలి!'

7న కేపీ శర్మ మాట్లాడుతూ, కొందరు రాచరికం పునరుద్ధరణ గురించి గొంతు చించుకుంటున్నారని అది సాధ్యం కాదని అన్నారు.

నేపాల్‌ కూడా ఒకనాడు ఒక సంస్థానం స్థాయిలోనిదే. పృథ్వి నారాయణ్‌ షా రాజు అయిన తరువాత ఈ ప్రాంతంలో చెల్లాచెదురుగా ఉన్న రాజ్యాలను ఏకం చేశాడు. అవన్నీ కలిపి 1768లో నేపాల్‌ రాజ్యంగా అవతరించాయి. 1800 సంవత్సరం వరకు రాజ ప్రతినిధులు, తమకు తామే ప్రధానులుగా నియమితులైన వారు షా రాజవంశం పేరుతోనే పరిపాలన సాగించారు. 1950లో త్రిభువన్‌ షా తన పూర్వికుల మాదిరిగా మంత్రి పదవికే పరిమితం కాకుండా రాజకీయాలలో ప్రవేశించాలని అనుకున్నారు. దానితో షా రాజవంశం మళ్లీ అధికారికంగా పాలన చేపట్టింది. ఆ వంశీకులే 2006 వరకు పాలించారు. నేపాల్‌లో హిందూ రాచరిక వ్యవస్థ ఆలోచన చేయడమే కాకుండా, అభివృద్ధికి కారకుడయిన వారు మహేంద్ర షా. ఈయన త్రిభువన్‌ షా కుమారుడు. ఒకే రాజు, ఒకే భాష సూత్రంతో రాజ్యాన్ని పునర్నిర్మించినవాడు కూడా మహేంద్ర షాయే.

మహేంద్ర మరణానంతరం ఆయన పెద్ద కుమారుడు బీరేంద్ర అధికారం చేపట్టారు. ఈయన కాలంలోనే రాచరికానికి ఇబ్బందులు మొదలైనాయి. అనేక ఉద్యమాల తరువాత ఆయన నేపాల్‌ను నియంతృత్వం నుంచి రాజ్యాంగ బద్ధ పాలన తేవడానికి 1990లో అంగీకరించారు. అలాగే పార్లమెంట్‌తో అధికారం పంచుకోవడానికి ఆమోదించారు. అయితే తరువాత కూడా దేశంలో ఉద్యమాలు చల్లారలేదు. 1990 మధ్యలో మావోయిస్టులు చెలరేగిపోయారు. ఇదే పార్టీ నుంచి వచ్చిన పుష్పకమాల్‌ దహాల్‌ 'ప్రచండ' ప్రధాని కాగలిగారు. కాని కొద్దికాలం మాత్రమే అధికారంలో ఉండగలిగారు. అదే సంవత్సరం జూన్‌ 1న బీరేంద్ర, ఆయన భార్య ఐశర్వ సహా రాజ కుటుంబీకులు అంతా హత్యకు గురైయ్యారు. యువరాజు దీపేంద్ర తన ప్రేమ వ్యవహారాన్ని కుటుంబం అంగీకరించక పోవడంతో మత్తులో అందరినీ తుపాకీతో కాల్చి తాను కూడా కాల్చుకుని మరణించాడు. తరువాత జ్ఞానేంద్ర పాలకుడయ్యారు. కానీ రాజ కుటుంబీకుడే అయినా ఈయనకు అంత మంచి పేరు ఉండేది కాదు. దీనితో ఆనాడు రాజరికం మీద ప్రజలు ఆగ్రహించారు. రాచరికానికి వ్యతిరేకంగా ఏడు రాజకీయ పార్టీలు కలసి జన ఆందోళన్‌ పేరుతో ఉద్యమం లేవదీశాయి. వీరిది స్పష్టమైన డిమాండ్‌. రాచరికం రద్దు కావాలన్నదే ఆ డిమాండ్‌. చివరికి జ్ఞానేంద్ర పార్లమెంట్‌కు తలొగ్గి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాడు.

2008లో కొత్తగా ఎంపికైనా రాజ్యాంగ నిర్మాణ అసెంబ్లీకి మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఎన్నికయ్యారు. నేపాల్‌ను ఫెడరల్‌ డెమాక్రటిక్‌ రిపబ్లిక్‌గా ప్రకటించారు. జ్ఞానేంద్ర రాజ ప్రాసాదాన్ని ఖాళీ చేశారు. దాని పేరు నారాయణహితి. అలా జ్ఞానేంద్ర ఆఖరి నేపాల్‌ రాజుగా చరిత్రలో మిగిలారు. నారాయణహితి ఒక వస్తు ప్రదర్శన శాలగా మిగిలింది.

'నారాయణహితిని ఖాళీ చేయండి, మా రాజుగారు అందులోకి రావాలి' అన్న నినాదం ఇటీవల నేపాల్‌లో గట్టిగా వినపడుతున్నది. ఇటీవలి బైక్‌ ర్యాలీలో కూడా అదే వినిపించింది. కానీ మావోయిస్టులు దీని పేరుతో మళ్లీ తమ గొంతును పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని అనిపిస్తున్నది. మాజీ పాలకుడు జ్ఞానేంద్ర ఇలాంటి ప్రయత్నం మూర్ఖంగా చేస్తే అందుకు భారీ మూల్యం చెల్లించవలసి ఉంటుందని సీపీఎన్‌ మావోయిస్టు చైర్మన్‌ ప్రచండ వ్యాఖ్యానించినట్టు పీటీఐ వార్తా సంస్థ పేర్కొన్నది. నిజానికి ఇటీవలి కాలంలో రాచరికానికి అనుకూలంగా వీస్తున్న గాలి చాలా రాజకీయ పార్టీలను సందిగ్ధంలోకి నెడుతున్నాయి.

ఆర్‌పీపీ అనే రాజరిక అనుకూల పార్టీ, ప్రజలు ఇటీవల దేశంలో పలు చోట్ల రాజుకు అనుకూలంగా ప్రదర్శనలు నిర్వహిస్తూనే ఉన్నారు. 2008 నుంచి జరిగిన పాలన ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. 'అత్యంత దారుణం ఏమిటంటే, దేశమంతా అవినీతిలో కూరుకుపోయింది. అధికారం చేపట్టిన ఏ ఒక్క రాజకీయ పక్షం ప్రజలను పట్టించుకోలేదు' అన్నాడు 50 ఏళ్ల వడ్రంగి కుల్‌రాజ్‌ శ్రేష్ఠ్‌. ఆయనే మరొక మాట కూడా అన్నారు. 'ఆనాడు రాజుకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో నేను కూడా పాల్గొన్నాను. కానీ నేను చేసింది తప్పు. దేశం ఇంకా పతనమైంది. అందుకే నేను నా అభిప్రాయం మార్చుకున్నాను' అన్నాడు శ్రేష్ఠ్‌. మార్క్సిజం, ఉదారవాదం, ప్రజాస్వామ్యం అంటూ నినాదాలు చేస్తూనే కాలం గడిపితే దేశంలో పేదరికం పోదు. ఫలితం శ్రేష్ఠులు అనేకులు తయారవుతారు. ★



కంపెనీలు మా రాష్ట్రంలో ఖర్గపూర్‌లో రాజర్హాట్‌లో లేవా అని వివరించబోయింది. అంతే, ఇవన్నీ కాదు, ఆర్‌జీ కర్‌ ఆసుపత్రిలో పీజీ డాక్టర్‌ మీద లైంగిక అత్యాచారం, హత్య గురించి ఏమంటారో, అది ముందు చెప్పండి అని జనంలో కేకలు మొదలయ్యాయి.

'అభయను చంపింది మీరే, మీ నాయకత్వంలోనే ఆ పీజీ డాక్టర్‌ చనిపోయింది' అని గొంతెత్తి చాటారు వారంతా. కానీ మమతమ్మకి అంతమంది అరిచినా వినిపించలేదట. కాస్త గట్టిగా చెప్పండి అంది. దీనితో ఒక యువకుడు, 'ఆర్‌జీ కర్‌ ఆసుపత్రి ఉదంతం సంగతి ఏమిటి?' అని ప్రశ్నించాడు. ఆ కేసు గురించి మాట్లాడకూడదు. అది కోర్టులో ఉంది. అపచారం కదా! పైగా కేంద్రం దాని మీద పరిశోధన చేస్తోంది అని తప్పుకుందామని అనుకుంది. అయినా ఇక్కడ రాజకీయాలు వద్దు. ఇది రాజకీయ వేదిక కాదు అని మమత సుద్దులు ఆరంభించారు. అప్పుడే అసలు ప్రశ్న వెనకాల నుంచి ఎవరో వేశారు. అది మమతకు అసలు నచ్చని ప్రశ్న. 'హిందువుల గురించి ఏమైనా చెప్పేది ఉందా?' అన్నదే ప్రశ్న. దీనికి అనుబంధ ప్రశ్న కూడా వేశాడు. 'మీ రాష్ట్రంలో ఎంతమంది హిందువులని చంపారు?' అని. అసలు తనకు వివక్ష అంటేనే పరమ అసహ్యం అని ఆమె అతి పెద్ద అబద్ధం ఆడేశారు. ఈమె ఉపన్యాసానికి ముందరే ఆక్స్‌ఫర్డ్‌లో అక్కడి ఎస్‌ఎఫ్‌ఐ విభాగం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఇన్ని జరిగినా ఆమె కలకత్తా విమానాశ్రయంలో దిగాక స్వాగతాలు, పుష్పగుచ్ఛాలు వెల్లువెత్తడం మామూలే. పనిలో పనిగా మమతగారి మాటలకి యావత్తు ఆక్స్‌ఫర్డ్‌ దంగైపోయింది అంటూ చెమ్చా మీడియా హోరెత్తించడమూ తప్పదు. ★



# రాణా సంగాపై నింద

చూడబోతే మొగల్ పాలకుల ప్రేతాత్మలు వర్తమాన భారతంలో స్వైర విహారం చేస్తున్నట్టే ఉంది. మహారాష్ట్రలో ఔరంగజేబ్ ప్రేతాత్మను స్వాగతించేవాళ్లు తయారయ్యారు. వీళ్లకి పోటీగా ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ మొగల్ వంశ స్థాపకుడు బాబర్ ప్రేతాత్మకు ఎర్రతివాచీ పరిచే పనిలో ఉన్నది. ఈ దురాక్రమణదారుల ఆరాధన దేశంలో శాంతిభద్రతల సమస్యకు దారి తీసింది. నాగపూర్ అల్లర్ల వెనుక పరోక్షంగా ఔరంగజేబ్‌పై ప్రశంసలు, అతడి సమాధి తొలగింపు అంశాలు ఉన్నాయి. మార్చి 27న ఆగ్రా ఉద్రిక్తంగా మారింది. గుర్తు తెలియని వ్యక్తుల గుంపు ఎంపీ రామ్‌జీ సుమన్ ఇంటి మీద దాడి చేసింది. వారు కర్ణిసేన సభ్యులని చెబుతున్నారు. కర్ణిసేన రాజపుత్ర కుల సంఘం. ఈ సంస్థకు చెందిన వారిగా భావిస్తున్న వారే మార్చి 26న ఎంపీ ఇంటిని ధ్వంసం చేశారు.

మొగలాయిల ఆరాధన కేంద్ర బిందువుగా సాగిన రెండో దాడి ఘటన గురించి చూద్దాం. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ (రాజ్యసభ) రామ్‌జీ లాల్ సుమన్ రాణా సంగ్రామ్ సింహుడిని 'ట్రెయిటర్' (దేశద్రోహి) అంటూ పార్లమెంట్‌లో పేలాడు. అంటే సమాజ్‌వాదీ పార్టీయే ఇక్కడ కూడా గొడవ రేపింది. ఆ చెత్తకుండీ కులపార్టీ దృష్టిలో రాణా సంగా అంతటి త్యాగి, వీరుడు ఎందుకు దేశద్రోహి అయ్యాడు? బాబర్‌ని భారతదేశానికి రావలసిందిగా ఆహ్వానించినది ఆయనేనని ఈ సుమన్ వాగాడు. భారతదేశం మీద దండెత్త వలసిందని రాణా కోరాడని కొత్త కథ ఒకటి తెచ్చాడు. ఇదంతా చూస్తుంటే విదేశీ పాలకులను ఎదిరించిన వారందరినీ దేశ వ్యతిరేకులుగా చిత్రించే నీచాతి నీచమైన కుట్రకు కొన్ని విపక్షాలు పాల్పడు తున్నాయనే అర్థమవుతుంది. అన్నట్టు మహారాష్ట్రలో అసెంబ్లీలో ఔరంగజేబ్‌ను మహనీయుడని కీర్తించిన దౌర్భాగ్యుడు (అజ్మీ), బాబర్‌ను ఆహ్వానించడం రాణా సంగా దేశద్రోహి అయ్యాడని వక్కాణించిన వాడూ(సుమన్) ఇద్దరూ ఒకే పార్టీ వాళ్లు. అదే ఈ దేశంలోనే నికృష్ట రాజకీయాలకి చిరునామాగా ఉండే సమాజ్‌వాదీ పార్టీ.

'దేశంలో ముస్లింలు బాబర్ డీఎన్ఏ కలిగి ఉన్నారని బీజేపీ నేతలు ఆడిపోసు కుంటారు. నిజానికి భారతీయ ముస్లింలు బాబర్‌ని ఆదర్శ పురుషునిగా కొలవరు. అసలు ఆ బాబర్‌ను భారత్‌కు ఆహ్వానించినవారు ఎవరు? ఇబ్రహీం లోడీని ఓడించేందుకు రాణా సంగాయే బాబర్‌ను ఆహ్వానించాడు. కాబట్టి ముస్లింలు బాబర్ డీఎన్ఏ కలిగి ఉంటే, మీరు రాణా సంగా డీఎన్ఏ కలిగి ఉన్నారన్నదే తర్కబద్ధమవుతుంది. కాబట్టి రాణా దేశద్రోహి. మేం బాబర్‌ను విమర్శిస్తాం. రాణా సంగాని విమర్శించడం లేదు' అంటూ మార్చి 21న రాజ్యసభలో మాట్లాడుతూ సుమన్ అన్నాడు. సమాజ్‌వాదీ ఎంపీ వ్యాఖ్యలు మొత్తం హిందువులను అవమానించేవేనని బీజేపీ విమర్శించింది.

1526లో తొలి పానిపట్టు యుద్ధం జరిగింది. ఇదే భారతదేశంలోకి బాబర్ రావడానికి దోహదం చేసింది. బాబర్‌కు ముందు లోడీ వంశీకులు పాలించేవారు. ఆఖరివాడు ఇబ్రహీం లోడీ. కుతుబుద్దీన్ ఐబక్ మొదటివాడు. ఇతడు బానిస వంశస్థుడు. కాబట్టి మొగల్ పాలకుల కంటే ముందు ఢిల్లీ సహా కొన్ని ప్రాంతాలను బానిసరాజులు (వీళ్లనే మామ్‌లుక్‌లు అంటున్నారు), ఖిల్జీలు, తుగ్లక్‌లు, సయ్యద్, లోడీ వంశీకులు పాలించారు. వీళ్లందరిదీ ఒకేరకమైన చరిత్ర. ఇబ్రహీం లోడీ వచ్చేసరికి కాస్త బలహీన పడింది. ఇబ్రహీం చేసిన రాజకీయ తప్పిదం అతడి రాజ్యంలో చాలా బలంగా ఉన్న స్థానిక పాలకులను, అధికారులను తొలగించాడు. అలాగే అఫ్ఘాన్‌లో కూడా జరిగింది. ఇదేకాకుండా వీళ్లు అనుభవిస్తున్న జాగీర్లను సైతం తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. దీనితో అధికారం కోల్పోయిన గవర్నర్లు, పెద్ద పెద్ద అధికారులు తిరుగుబాటు ప్రకటించారు. ఇలాంటి వారిలో దౌలత్‌ఖాన్ లోడీ ఒకడు. ఇతడు పంజాబ్ ప్రాంత పాలకుడు. మరొకడు జౌన్‌పూర్ పాలకుడు ఆలంఖాన్ లోడీ. ఈ ఇద్దరు సుల్తాన్ ఇబ్రహీం లోడీ బంధువర్గంలో వారే.

రసపుత్ర వీరుడు రాణా సంగ్రామసింహునికీ ముస్లిం పాలకులకీ వైరం ఉంది. మాల్వా పాలకుడు రెండవ మహమ్మద్ ఖిల్జీని గగ్రాన్ యుద్ధంలో రాణా ఓడించాడు. ఖిల్జీని తరిమేసి మేదినీ రాయ్ అనే పాలకుడిని రాణా నియమించాడు. మాల్వా రాజధాని చందేరి. రాణా సంగా రాజ్య విస్తరణ నిజానికి లోడీ వంశీకులనీ కలవర పెట్టిందని హిస్టరీ ఆఫ్ మిడీవల్ ఇండియా చరిత్ర రాసిన సతీశ్‌చంద్ర రాశారు. రాణాకు, లోడీకి 1518లో దక్షిణ రాజస్థాన్‌లోని హరౌతీ సరిహద్దులోని ఘటోలీ వద్ద పెద్ద యుద్ధమే జరిగింది. రాణా ధాటికి తట్టుకోలేక లోడీ సైన్యం వెనుతిరిగింది. తరువాత జరిగిన ధోల్‌పూర్ యుద్ధంలోను లోడీ ఓడిపోయాడు. పైగా భారీ నష్టం జరిగింది. ఈ యుద్ధంలో రాణా చేతిని కోల్పోయినా, కాలిలో బాణం దిగినా రణభూమిని వీడలేదు.

ఫర్గానా అనే ప్రాంతానికి చెందిన జహరుద్దీన్ మహమ్మద్ బాబర్ తైమూర్ సంబంధీకుడు. ఇతడు పినతండ్రి రెండో ఉలూఘ్ బేగ్ నుంచి ఘజ్నీ, కాబూల్‌లను ఆక్రమించాడు. అదే సమయంలో తన భూభాగాలు ఫర్గానా, సమర్ఖండ్‌లను బాబర్ కోల్పోయాడు. ఆ తరువాతనే అతడి దృష్టి భారత్ మీద పడింది. 1519 ప్రాంతానికి బాబర్ చీనాబ్ నది వరకు వచ్చాడు. అదే సమయంలో ఢిల్లీలో ఇబ్రహీం లోడీ చిక్కులను ఎదుర్కొంటున్నాడు. ఇబ్రహీం మీద కక్ష కట్టిన స్థానిక పంజాబ్ పాలకుడు దౌలత్‌ఖాన్ లోడీ, ఆలంఖాన్ లోడీ ఇద్దరూ బాబర్‌ను ఆహ్వానించారు. 'బాబర్ నామా'లో రాణా సంగా పేరు ఉన్నప్పటికీ ఆయన బాబర్‌ను ఆహ్వానించాడని ఏ చరిత్రకారుడు చెప్పలేదు. ఇంకా చెప్పాలంటే చిక్కులో ఉన్న లోడీ మీదకు బాబర్ దండెత్తిన పరిస్థితులను నుంచి తాను లబ్ధి పొందాలని రాణా ఆశించి ఉండవచ్చు. అంతేకాని, బాబర్‌ను దేశానికి ఆహ్వానించలేదనే చరిత్రకారుల వాదన. అసలు బాబర్‌కు రాణా ఆహ్వానం అన్న మాటనే ప్రఖ్యాత చరిత్రకారుడు జదునాథ్ సర్కార్ కొట్టి పారేశాడు. భారత్ మీద దండెత్తడంలో బాబర్‌కు సొంత లక్ష్యాలు ఉన్నాయి. పైగా గౌరీశంకర్ హీరాచంద్ ఓఝా అయితే తనకు సాయపడవలసిందిగా బాబర్ రాణా సంగాను కోరాడని రాశారు. 1524లో బాబర్ లాహోర్ వైపు దండుతో కదిలాడంటే, అందుకు కారణం దౌలత్‌ఖాన్‌ను ఇబ్రహీం లోడీ పదవి నుంచి తొలగించాడన్న వర్తమానంతోనే అని కూడా ఆధారాలు చెబుతున్నాయి. నిజానికి 1526లో మొదటి పానిపట్టు యుద్ధం జరిగింది. సంవత్సరానికే అంటే 1527లో కాణ్వా యుద్ధం జరిగింది. ఇది బాబర్, రాణాల మధ్య యుద్ధం. వాస్తవాలు ఇలా ఉండగా ఎలాంటి విలువలు లేని రాజకీయ పార్టీలో పదవులు నొక్కి రాజ్యసభను కూడా అభాసుపాలు చేస్తున్నారు కొందరు నాయకులు. ముస్లింలను బుజ్జగించడానికి దురాక్రమణదారులను కూడా ఆరాధించే దుష్ట సంస్కృతిని ప్రారంభించారు. ★



# విశ్వ చదరంగంలో 'ఓరుగల్లు' గ్రాండ్ మాస్టర్!

**విశ్వచదరంగ క్రీడలో భారత పతాకాన్ని రెపరెపలాడిస్తున్న ఓరుగల్లు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి పలు అపురూప విజయాలు, అసాధారణ రికార్డులతో తెలంగాణాకే గర్వకారణంగా నిలిచాడు.**

భారత చదరంగంలో ఐదుసార్లు విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్ శకం ముగిసింది. ఆనంద్ వారసులుగా తమిళనాడు, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు నవతరం గ్రాండ్ మాస్టర్లు తెరమీదకు వచ్చారు. భారత్‌ను చదరంగ ఒలింపియాడ్‌లో విశ్వవిజేతగా నిలపడంలో తమ వంతు పాత్ర పోషించారు. భారత్ ఈ అసాధారణ విజయంలో ప్రధానపాత్ర పోషించిన మొనగాడిగా తెలంగాణ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి గుర్తింపు తెచ్చుకొన్నాడు.

**ఓరుగల్లు నుంచి అంతర్జాతీయ స్థాయికి**

భారత చదరంగం అంటే తమిళనాడు మాత్రమే అనుకొనే రోజులు పోయాయి. తమిళనాడుతో పాటు తెలంగాణ కూడా అనుకొనేలా చేసిన ఘనుడు అర్జున్ ఇరగేసి. వరంగల్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన అర్జున్ బాల్యం నుంచే చదరంగ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకొన్నాడు. హన్మకొండలోని బీఎస్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతూ రాటుదేలాడు. ఆధునిక చదరంగ క్రీడలో సంపూర్ణ పరిజ్ఞానం సాధించడం ద్వారా చిరుప్రాయంలోనే గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించగలిగాడు. 14 సంవత్సరాల 11 మాసాల, 13 రోజుల చిన్నవయసుకే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించగలిగాడు. తెలంగాణ తొలి, భారత 54వ గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చేరాడు. అత్యంత చిన్నవయసులోనే గ్రాండ్ మాస్టర్ హోదా పొందిన భారత చదరంగ క్రీడాకారుల వరుసలో 32వ వాడిగా అర్జున్ నిలిచాడు.

**19 ఏళ్లకే జాతీయ సీనియర్ టైటిల్**

2015లో దక్షిణ కొరియా వేదికగా జరిగిన ఆసియా యువజన చెస్ టోర్నీలో అర్జున్ రజతం సాధించడం ద్వారా తన జైత్రయాత్రకు శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత కేవలం మూడేళ్ల వ్యవధిలోనే గ్రాండ్ మాస్టర్ హోదాను కైవసం చేసుకోగలిగాడు. 2021లో బల్గేరియా వేదికగా ముగిసిన ప్రపంచ జూనియర్ చెస్ సమరం తొమ్మిది రౌండ్లలో 7 పాయింట్లు సాధించడం ద్వారా రన్నరప్‌గా రజత పతకం సాధించాడు. 19 సంవత్సరాల వయసులోనే జాతీయ సీనియర్ టైటిల్ సాధించాడు. బ్లిట్జ్ విభాగంలో సూపర్ గ్రాండ్ మాస్టర్ ఆనంద్‌ను అధిగమించి నంబర్ వన్ ర్యాంకులో నిలవడం ద్వారా సత్తా చాటుకొన్నాడు.

**ఆనంద్ బాటలో అర్జున్**

ప్రపంచ చదరంగంలో 2800 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించడం గ్రాండ్ మాస్టర్ల కలగా ఉంటుంది. అయితే అర్జున్ ఇరగేసి మాత్రం 21 సంవత్సరాల ప్రాయంలోనే 2800 పాయింట్ల లక్ష్యాన్ని చేరడం ద్వారా భారత చదరంగానికే గర్వకారణంగా నిలిచాడు. సహఆటగాళ్లు గుకేశ్, ప్రజ్ఞానంద్, విదిత్ గుజరాతీ సాధించలేని ఘనతను అర్జున్ సొంతం చేసుకోగలిగాడు.

ప్రపంచ చదరంగ చరిత్రలో 2800 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించిన ఆటగాళ్లు కేవలం 16 మంది మాత్రమే ఉంటే, అందులో ఇద్దరు మాత్రమే భారత గ్రాండ్ మాస్టర్లు ఉన్నారు. భారత్ తరపున విశ్వనాథన్ ఆనంద్ 2800 ఎలో రేటింగ్ సాధించిన తొలి సూపర్ గ్రాండ్ మాస్టర్ కాగా అర్జున్ రెండో గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చేరాడు. అత్యంత పిన్నవయసులో 2800 పాయింట్ల రేటింగ్ సాధించిన మూడో క్రీడాకారుడిగా నిలిచాడు.


మూడేళ్ల క్రితం వరకూ ప్రపంచ స్థాయిలో 78వ ర్యాంక్‌లో నిలిచిన అర్జున్ అత్యంత నిలకడగా రాణిస్తూ అనూహ్యంగా 3వ ర్యాంక్‌కు చేరుకోగలిగాడు. అంతర్జాతీయ చదరంగ సమాఖ్య ప్రకటించిన తాజా రేటింగ్స్ ప్రకారం అర్జున్ 2802.1 పాయింట్లతో ప్రపంచ మూడో ర్యాంకర్‌గా కొనసాగుతున్నాడు.

**చదరంగ ఒలింపియాడ్‌లో జంట స్వర్ణాలు**

ప్రపంచ టీమ్ విజేతను నిర్ణయించడానికి జరిగే చదరంగ ఒలింపియాడ్‌లో భారత్ తొలిసారిగా పురుషుల, మహిళల విభాగాలలో స్వర్ణపతకాలు సాధించడం ద్వారా అమెరికా, చైనా, రష్యా, ఉక్రెయిన్, అజర్ బైజాన్ లాంటి మేటిజట్ల ఆధిపత్యానికి చెక్ చెప్పింది. చెన్నై వేదికగా ముగిసిన 44వ చదరంగ ఒలింపియాడ్‌లో రజత పతకం సాధించిన భారత్ 2024 చదరంగ ఒలింపియాడ్‌లో ఏకంగా బంగారు పతకాన్నే కైవసం చేసుకోగలిగింది.

చదరంగ ఒలింపియాడ్ టీమ్, వ్యక్తిగత విభాగాలలో బంగారు పతకాలు సాధించిన భారత తొలి గ్రాండ్ మాస్టర్‌గా నిలిచిన భారత్‌తోపాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం.

చదరంగం నేపథ్యం, అత్యాధునిక శిక్షణ సదుపాయాలు, ఆర్థిక ఆలంబన ఏమాత్రం లేని వాతావరణం నుంచి వచ్చి, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన తొలి గ్రాండ్ మాస్టర్, తొలి జాతీయ చాంపియన్ అర్జున్ మాత్రమే. చదరంగంలోని క్లాసికల్, బ్లిట్జ్ విభాగాలలో ఒకేతీరుగా ఆడే సామర్థ్యం కలిగిన అర్జున్‌కు ఏదో ఒకరోజున విశ్వవిజేతగా నిలిచే ప్రతిభాపాటవాలు ఉన్నాయని ప్రపంచ మేటి చదరంగ పండితులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రేరణ, ప్రోత్సాహం, ఆదరణతో అర్జున్ మరింతగా ఎదగాలని కోరుకొందాం. ★



**కృష్ణారావు చొప్పరపు**
**సీనియర్ జర్నలిస్ట్, 84668 64969**

## కథ



"నందూ..ఏమిటి ఆలస్యం?" డ్రైవింగ్ సీట్లో కూర్చుని అసహనంగా అడిగాడు ఆనంద్

"ఐపోయిందండీ, కార్ దగ్గరకే వస్తానని చెప్పింది. ఆమె వస్తే మాట్లాడి బయలుదేరడమే" కార్ పక్కనే నిల్చున్న నందిత విండో నుంచి లోపలికి చూస్తూ సమాధానమిచ్చింది.

ఆనంద్ ఒక ఎమెన్సీలో ప్రిన్సిపల్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉస్మానియాలో ఇంజనీరింగ్ పూర్తిచేసి పాతికేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. చిన్నప్పుడు ఆనంద్ తండ్రి ఆంధ్రాబ్యాంక్ హెడ్డాఫీస్‌లో పనిచేయడం వల్ల చాలాకాలం కాచిగూడ, సుల్తాన్‌బజార్ ఏరియాలో ఉన్నారు. ఆనంద్ అమెరికా వెళ్లిపోయిన తరువాత వాళ్ల నాన్నగారు ప్రమోషన్ మీద వేరే వేరే ఊళ్లలో పనిచేసి చివరి రోజుల్లో హైదరాబాద్ వచ్చేసి ఇక్కడే పదవీ విరమణ చేసి కొండాపూర్‌లో ఇల్లు కట్టుకొని స్థిరపడ్డారు. ఆనంద్ కూడా వివిధ కంపెనీలలో, వివిధ బాధ్యతలలో అనేక ప్రాంతాలలో పనిచేసి హైదరాబాద్‌ని తన చివరి మజిలీ చేసుకుని వచ్చేశాడు. ఇంటిని మళ్లీ కొత్తగా కట్టించి పైన ఆనంద్ కుటుంబం, కింద తల్లితండ్రులు ఉంటున్నారు.

ఇక్కడకు వచ్చి ఆరు నెలలవుతోంది. ఆఫీస్‌లో సెటిలయి, ఇల్లు సర్దుకుని అంతా కుదురుకున్నాక ఇప్పుడు తన బాల్యం గడిపిన కాచిగూడ ఏరియాకు పోవాలని, అక్కడ తిరిగి తన జ్ఞాపకాలను తడుముకోవాలని ఉబలాట పడుతున్నాడు. అది ఈ రోజుకు కుదిరింది. తన క్లాస్‌మేట్ సంతోష్ యాదవ్ ఇప్పటికీ అక్కడే ఉంటున్నాడని తెలిసింది. అనేక లింకుల సహాయంతో అతని నంబర్ సంపాదించి మాట్లాడి ఈరోజు కలవాలని నిర్ణయించుకున్నారు.

మరో నాలుగు నిమిషాల తరువాత దూరంగా రమణమ్మ కనిపించింది. నందిత కొంచెం ముందుకు వెళ్లి రమణమ్మతో ఏదో మాట్లాడుతోంది. వాళ్ల మాటలు విన బడటంలేదు కానీ వాళ్ల హావభావాలు కనబడుతున్నాయి.

రమణమ్మ ఏదో దీనంగా చెబుతోంది. నందిత చాలా సానుభూతితో వింటోంది. నందిత వాళ్లు వచ్చి ఆరునెలలే అయినా రమణమ్మకి నందిత ప్రవర్తన నచ్చేది. తగినంత గౌరవం ఇవ్వడం, కాఫీ టిఫిన్లు పెట్టడం, పని మానేసిన రోజు కారణమడిగేది తప్ప కరిచేది కాదు. ఏదైనా చెప్పాల్సి వస్తే నేరుగా సున్నితంగా చెప్పేది. దాంతో రమణమ్మకి నందిత అంటే భక్తి, గౌరవం పెరిగిపోయాయి. చివరిగా రమణమ్మ తన చిన్న పర్సులో నుంచి మడిచి రబ్బర్ బ్యాండేసిన కొన్ని నోట్లు నందితకు ఇచ్చింది. నందిత సరేనంటూ తలూపుతూ ఆ నోట్ల కట్టను తన బ్యాగులో వేసుకుంది. రమణమ్మ వీడ్కోలు అందుకుని ముందు సీట్లో వచ్చి కూర్చుంది నందిత.

దంపతులిద్దరూ హైటెక్ సిటీ మీదుగా కాచిగూడా వైపు బయలుదేరారు.

“ఈ రమణమ్మ గొడవేంటి నీకు” డ్రైవ్ చేస్తూ అడిగాడు ఆనంద్.

“అది గొడవ కాదు ఆనంద్, బతుకుతెరువు. రమణమ్మ నాలుగిళ్లలో పనిచేసి నెలకి పదివేల దాకా సంపాదిస్తుంది. కానీ ఏం ప్రయోజనం? మొగుడు తాగుబోతు. తన సంపాదనంతా ఖర్చు చేస్తాడు. పైసా కూడా పొదుపు చేయడు. పైగా నెలాఖరుకల్లా ఈమె దగ్గర తన్నిలాక్కుంటాడట. అందుకని తన సంపాదన ఎనిమిది వేలే అని చెప్పి దాంతోనే ఇల్లు జరుపుతుంది” వివరణ ఇచ్చింది నందిత.

“అంటే భర్తను మోసం చేస్తోందన్నమాట” సరదాగా అన్నాడు ఆనంద్. నందిత కూడా సరదాగానే నవ్వుతూ..

“దాన్ని మోసం అనరు బాబూ! తల్లి మనసు అంటారు. అది మీకు అనుభవంలోకి వచ్చే అవకాశమే లేదు. పిల్లల అవసరాలు తల్లికే తెలుస్తాయి. దాచిన ఆ రెండు వేలు పిల్లల ఫీజులకో, మందులకో, ఏమైనా కొనియ్యడానికో వాడుతుంది. నా దగ్గరుంటే మొగుడుకి అనుమానం రాదని, వచ్చినా అడగడని ఆమె నమ్మకం” అన్నది.

అంటూ చుట్టూ పరికించి చూశాడు.

సంతోష్ వాళ్ల నాన్న వాళ్లది. చప్పల్‌బజార్‌లో పెద్ద పాలవ్యాపారం. వాళ్లు విడిపోయి మూడు కేంద్రాలు ఏర్పరచుకున్నారు. వీళ్ల వాటాకి వచ్చిన గేదెలు, ఆవులతో వీళ్లు విడిగా వ్యాపారం ప్రారంభించారు. దాంతో పాటు పాల ప్యాకెట్లు కూడా అమ్ముతారు.

“నాయన పోయి పదేండ్లు దాటింది. అన్నలు బయటకెళ్లింద్రు. వస్తరు” అంటూ

“ఇగో ఈమె నా భార్య సుశీల. వీళ్లు మా వదినలు” అంటూ అందరినీ పరిచయం చేశాడు.

పరిచయాలయ్యాక చిక్కటి పాల కాఫీ తాగుతూ మిత్రులిద్దరూ చిన్ననాటి కబుర్లలో మునిగిపోయారు.

ఫ్రెండ్స్ గురించి వాకబు చేశాడు ఆనంద్. సంతోష్ పెద్దగా నవ్వుతూ,

# ఇద్దు సంసారి

ఈ. ఉమామహేశ్వర్



దార్లో స్వీట్స్, పండ్లు కొనుక్కుని కోఠీ దగ్గర చప్పల్ బజార్ చేరేపాటికి సాయంత్రం నాలుగయింది.

సంతోష్‌యాదవ్ చాలా ప్రేమతో ఆప్యాయంగా సాదరంగా ఆహ్వానించాడు. ఇప్పటికీ వాళ్లది ఉమ్మడి కుంటుంబమే. అన్న దమ్ములందరూ పాల వ్యాపారమే చేస్తారు. పనుల విభజన, సంపాదన అన్నీ పెద్దన్నే చూసుకుంటాడని చెప్పాడు. భార్యా భర్తలిద్దరినీ తీసుకెళ్లి హాల్లో కుర్చీలేసి కూర్చోబెట్టాడు. ‘‘బాగ తయారయినవ్ ఆనంద్. నిన్నసలు గుర్తు పట్టరెవరు” అన్నాడు సంతోష్

‘‘అవును, బాగా లావయ్యాను కదా”

“మేమేమన్న మీలెక్క సక్కగ సదుకున్నోల్లమా వేరే వేరే ఊర్లలో ఉండనికి! అందరం ఈడనే యాడో తిప్పలు పడుతున్నాం. శంకర్ గాడు వాళ్లయ్య సెలూన్ కంటిన్యూ చేస్తున్నడు. పుల్లాగాడు సెపరేటు కిరాణం షాపు పెట్టిండు. ఇద్దరు మార్వోడోళ్ల పిల్లలొస్తుండేది చూడు. ఔర్ శ్యామ్ అనేటోళ్లం, వాళ్లు ఇప్పటికీ ఇడిపోకుంట పార్టనర్ షిప్‌లో బ్యాంక్ స్ట్రీట్‌కెల్లి శాంసంగ్ షోరూం తెరిసిన్రు. రంగాగాడు బడిచౌడిలో కూరగాయల షాప్ పెట్టిండు. ఇగ గణేష్ అని ఒక దద్దుపిల్లగాడు నింబోలి అడ్డకెల్లి వచ్చెటోడు. వాడక్కడే మంచిగ మెకానిక్ షాప్ నడిపిస్తున్నడు..” సంతోష్ తనకు గుర్తున్నవాళ్ల వివరాలన్నీ చెప్పాడు.

నందిత కొంచెం ఇబ్బందిగా కూర్చుంది. ఎవరూ ఆమెతో మాట్లాడటం లేదు. వాళ్ల వాళ్ల పనులలో హడావిడిగా తిరుగుతున్నారు. అక్కడ పచ్చిపేడ వాసన ఘాటుగా కొడుతోంది. ఆమెకు అలవాటు లేకపోవడం వల్ల ముక్కు మూసుకుంటే ఏమైనా అనుకుంటా రేమోనని అలాగే భరిస్తూ పరిసరాలు గమనిం చడంలో నిమగ్నమైంది. అది పాత మోడల్లో కట్టిన ఇల్లు. హాలు ఎత్తులో ఉంది. బయటి వాకిలికి, హాలుకి మధ్యన కొన్ని గేదెలను, రెండు ఆవులను కట్టేశారు. ఆ జాగా వాటి కోసమే అన్నట్టు, కొన్ని గుంజలు కూడా పాతారు. పనివాళ్లలో ఒకతను పాలు పితుకు

నందిత ఏడుస్తోంది. అప్పటికీ ఆమె ఎంత నియంత్రించుకున్నా ఇక తప్పదన్నట్టు ఎక్కిళ్లు బయటకు వచ్చాయని అర్థమవుతుంది. అందరూ తననే గమనిస్తున్నందుకు కించపడుతూ కళ్లు తుడుచుకుంటూ నవ్వడానికి ప్రయత్నిస్తోంది. అయినా గొంతులో నుండి దు:ఖం తన్నుకుంటూ వస్తూ గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.



తున్నాడు. సంతోష్ యాదవ్ భార్య, వదిన పర్యవేక్షిస్తు న్నారు.

అంతావరకూ బోర్‌గా ఫీలవుతున్న నందితకు పాలు పితికే సన్నివేశం ఆసక్తిగా తోచింది. పట్టణ మధ్యతరగతి ఉద్యోగస్తుల ఇంట్లో పుట్టి పెరిగిన ఆమెకు ఈ తంతు చిత్రంగా ఉంది. పాలు పితక డంలో అతను ప్రదర్శిస్తున్న ఒడుపును అబ్బురంగా చూస్తోంది. ఒక చెంబు పాలు నిండడానికి ఇంతసేపు పడుతుందా అని ఆశ్చర్యపోతోంది.

"స్కూల్ వైపు వెళ్లొద్దామా?" ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చిన వాడిలా అడిగాడు ఆనంద్.

"ఇంకెక్కడి స్కూల్ భయ్. లీజు పూర్తయిందని పడగొట్టేసిన్రు. ఆడ ఒక అపార్ట్మెంట్ వచ్చింది"

"అయ్యో, అలాగా" బాధగా అన్నాడు. స్కూల్ బిల్డింగ్ స్థానే అపార్ట్మెంట్ రావడం అతనికి నచ్చలేదు.

"మన సార్లు గానీ, టీచర్లు గానీ కనిపిస్తుంటారా?" అనుబంధ ప్రశ్న వేశాడు.

"ఇంకెక్కడి సార్లు ఆనంద్. అప్పటికే ముసిలోల్లు. ఎవ్వడున్నడో ఎవలు లేరో తెల్వది. అయితే మన డ్రిల్ సార్ మాత్రం అప్పుడప్పుడూ ఈడ హరామజీద్ కెల్లి వస్తుంటడు"

మళ్లీ అతనే..."నీకు యాదికుందా? మనం సెవెన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు మహేశ్వరి పరమేశ్వరిలో గిరఫ్తార్ సినిమాకు పోయినుంటిమి. అమితాబ్, రజనీకాంత్, కమలాసన్ యాక్ట్ చేసిరందులో"

ఆనంద్‌కూడా ఆ సినిమా సందర్భం గుర్తు తెచ్చుకుంటూ...

"అవును..ఆ తరువాత మనం కూడా రాయిని పైకెగరేసి ఇంకో రాయితో కొట్టే ఆట కనిపెట్టాం" అన్నాడు.

సంతోష్ కొంచెం విచారంగా మొహం పెట్టి

"ఇంకెక్కడి మయేశ్వరి పరమేశ్వరి లే ఆనంద్. అదిప్పుడు పెద్ద మాలయింది. అండ్ల ఇప్పుడు చిన్న చిన్న థియేటర్లు ఉన్నయ్ గానీ, మహేశ్వరి పరమేశ్వరి లెవెలే వేరు"

ఇద్దరూ తీరికగా ఇంకా పాత రోజులను కలబోసు కుంటున్నారు.

ఉన్నట్టుండి నందిత దృష్టి పక్కనే కట్టేసి ఉన్నదూడ వేపు మళ్లింది. దాని కట్టు విప్పదీయడానికి సంతోష్ వాళ్ల వదిన దూడను సమీపిస్తుంటే అది అటూ ఇటూ తిరుగుతూ, చిందులేస్తూ తలగుండ్రంగా తిప్పుతూ దాని సంబరాన్ని ప్రకటిస్తోంది. నందిత దాన్నే గమనిస్తోంది. ఇంతలో పితికిన పాలగిన్నె పక్కకు తీసిపెట్టి దూడకు కట్లు విప్పదీసి దాని తల్లి దగ్గరకు వదిలారు. దూడ ఆనందంతో గంతులేస్తూ తల్లి దగ్గరకు పోయి పాలు కుడవడం మొదలుపెట్టింది. అప్పుడు దాని కళ్లలోని పారవశ్యాన్ని చూసి తన్మయత్వంతో పులకించిపోయింది నందిత మనసు.

ఆ దృశ్యాన్ని చూసి చప్పున మొబైలు తీసి క్లిక్‌మనిపించింది. అందరూ నవ్వారు.

"గిసంటియి మీకు కొత్త గుంటయ్ గద" అన్నది సంతోష్ భార్య నందితను చూస్తూ.

అవునన్నట్టు తలవూపి ధ్యానమగ్నతతో మళ్లీ అటే దృష్టి సారించింది నందిత.

ఆనంద్, సంతోష్ అలా బయటకు వెళ్లారు. బహుశా సిగరెట్ కోసం అనుకుంది నందిత.

పది నిమిషాలు గడిచాయో, లేదో...పనతను, సంతోష్ భార్య ఇద్దరూ పాలు తాగుతున్న దూడను బలవంతంగా తల్లి నుంచి వేరు చేసి విడిగా కట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. తల్లి గేదె ఆ పని తనకు అంగీకారం కాదన్నట్టు, వదిలితే వాళ్లిద్దరినీ కుమ్మేస్తానన్నట్టు కొమ్ములు విసురుతూ చూస్తుంటే, ఆ లేగదూడ 'ఇంకా ఆకలి తీరకముందే నన్ను దూరం చేస్తారా' అని ప్రాధేయపడుతున్నట్టు మొండికేస్తూ గింజుకుంటోంది. ఒక రెండు మూడు నిమిషాల పెనుగులాట తరువాత దూడను పక్కకు కట్టేశారు. ఆ అలజడి తగ్గిన తరువాత పాలకు మళ్లీ గేదె దగ్గరకు పోతున్న వాళ్లకి ఎవరో ఏడుస్తున్నట్టు ఎక్కిళ్ల శబ్దం వినబడింది. ఎక్కడా అని చుట్టూ చూసి ఆ శబ్దం నందిత దగ్గర నుండే వస్తుందని గమనించి అందరూ నందిత వైపు చూశారు.

నందిత ఏడుస్తోంది. అప్పటికీ ఆమె ఎంత నియంత్రించుకున్నా ఇక తప్పదన్నట్టు ఎక్కిళ్లు బయటకు వచ్చాయని అర్థమవుతుంది. అందరూ తననే గమనిస్తున్నందుకు కించపడుతూ కళ్లు తుడుచుకుంటూ నవ్వడానికి ప్రయత్నిస్తోంది. అయినా గొంతులో నుండి దుఃఖం తన్నుకుంటూ వస్తూ గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. సంతోష్ భార్య, వదిన నందిత వైపు చూసి 'ఏమయిందమ్మా' అని వాకబు చేస్తుంటే నందిత కొంచెం సిగ్గు పడుతూ "ఏం లేదు, ఏం లేదు" అంటూ కళ్లు తుడుచుకుంటూ మళ్లీ మామూలవడానికి ప్రయత్నిస్తోంది. అప్పుడే లోపలికి వచ్చిన సంతోష్, ఆనంద్ ఈ దృశ్యం చూసి కలవరపడ్డారు. సంతోష్ వదిన చొరవ తీసుకుని "ఏమ్మా, ఏమయింది" అని అనునయంగా భుజం మీద చేయి వేసి అడిగింది.

"వాట్ నందూ, ఆర్యూ ఆల్ రైట్" దగ్గరగా వచ్చి అడిగాడు ఆనంద్.

నందిత ఇక చెప్పకపోతే బాగుండదని నోరు విప్పింది. మెల్లగా మాటలు కూడబలుక్కుంటూ

"ఆ దూడకు.." మళ్లీ ..గొంతు పూడుకుపోతుంటే కొంచెమాగి

"ఆ దూడకు ఇంకా ఆకలిగా ఉన్నట్టుంది. దాని కడుపు నిండక ముందే పక్కకు లాక్కెళుతుంటే పాపం అది బేలగా చూస్తోంది.." అంటూ ఆ సంఘటన కళ్లముందర కదలాడుతుంటే గద్గద స్వరంతో చెప్పింది.

ఒక్క క్షణం ఎవరికీ నోట మాట రాలేదు.

ఆనంద్‌కు కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఒక వైపు భార్య సున్నిత హృదయం అర్థమైనా ఇక్కడ సంతోష్ వాళ్ల పనిని ఎత్తి చూపుతున్నట్టు వాళ్లు ఎక్కడ ఫీలవుతారో అని సతమతమౌతున్నాడు.

సంతోష్ వాళ్ల వదిప చొరవగా నవ్వుతూ

"నీది చల్లని మనసు బిడ్డా" అని నందిత మెడ చుట్టూ చేతులు కప్పి

"ఏం గాదమ్మా, అది గూడ తల్లే గదా! బిడ్డ కోసం ఎప్పుడూ కొన్ని పాలు బిడ్డసంచిలో దాసి బెడతది. మనం ఎంత గుంజినా ఒక్క సుక్క గూడ విడువది. బిడ్డ నోరు తగలంగనే పాలిడుస్తుంది. దూడ కోసం ఒక లీటర్ పాలన్నా ఆ బిడ్డ సంచిల దాసి పెడతది" అన్నది వాతావర ణాన్ని తేలిక చేస్తూ.

అక్కడ ఏ అపార్థాలూ జరగనందుకు ఆనంద్ మనసులోనే సంతోషించాడు. నందిత మనసు తేలిక పడింది. ఆమె మాతృహృదయం నెమ్మళించింది. మొహం కడుక్కుని ఫ్రెష్ అవ్వమని సంతోష్ భార్య చెబితే బాత్రూమ్‌కెళ్లి మొహం కడుక్కుని వచ్చింది నందిత. బ్యాగులోనుండి న్యాప్కిన్ తీస్తుంటే ఉదయం రమణమ్మ ఇచ్చిన డబ్బుల కట్ట కింద పడింది.

అది గమనించిన సంతోష్ 'బ్యాగులకెల్లి ఏదో కింద పడింది చూడమ్మా' అని చెప్పాడు.

నందితకంటే ముందే ఆనంద్ కిందకు వంగి దాన్ని తీసి నందిత చేతికిస్తూ ఆమెకు మాత్రమే వినిపించేలా

"బిడ్డ సంచి" అంటూ చిన్నగా నవ్వాడు.

నందితకు భావం అర్థమై మెచ్చుకోలుగా ఆనంద్ వైపు చూసి అతని నవ్వుతో జత కలిపింది.

వచ్చేవారం కథ..

**తొలిరేయి**

– బి.వి.ఎస్ ప్రసాద్




Enriched with Vitamins A,D&E
PRIYA®
GOLD
+F
FORTIFIED
WITH VITAMIN A&D
ప్రియా గోల్డ్
రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్
రిఫైండ్ రైస్ బ్రాన్ ఆయిల్
ఫిల్టర్డ్ వేరుశెనగ (పల్లీ) నూనె
కమ్మదనాల
అమ్మ చేతి
అద్భుతం !
A product from
SANTHOSHIMATHA GROUP OF INDUSTRIES
MOBILE : 9848160792
Website : www.priyagoldoils.com
Availabe Packs : 500ml | 1 Ltr Pouch | 1,2,3 & 5 Ltr Pet Bottle | 5Litre HDPE Jar



# సమరసత సేవా ఫౌండేషన్‌తో స్వధర్మాచరణ

**విజయవాడ :** హిందూ ధర్మాన్ని గ్రామగ్రామానికి చేరువ చేయడంలో సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ముందు ఉందని ఫౌండేషన్ ప్రాంత సహ సంయోజకులు తులసి సూర్యప్రకాష్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండల కేంద్రంలో ఉన్న హరిజనవాడలో ఎస్ఎస్ఎఫ్ ఆర్థిక సహాయంతో, టిటిడి ఆధ్వర్యంలో నిర్మాణమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎనిమిదవ వార్షికోత్సవం మార్చి 25న జరిగింది. ఈ సందర్భంగా టిటిడి ద్వారా అర్చక శిక్షణ పొందిన ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందిన అర్చకుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తులసి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎస్ఎస్ఎఫ్ పరాయి మతంలో చేరి ఇబ్బందులు పడుతున్న వారితో స్వధర్మాచరణ చేయిస్తోందని తెలిపారు.

టిటిడి, ఎస్ఎస్ఎఫ్ సంయుక్తంగా 8 సంవత్సరాల క్రితం హరిజన, గిరిజన, తండాల్లో శ్రీనివాస కల్యాణం నిర్వహించాయి. ఇలాంటి కల్యాణం తమ పల్లెల్లో కూడా ఘనంగా నిర్వహించాలని ఎస్ఎస్ఎఫ్ ద్వారా టిటిడి నుండి అర్చక శిక్షణ పొందినవారు ఆకాంక్షించారు. తదనుగుణంగా ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పుల్లారావు సహకారంతో దేవాలయ, గ్రామ కమిటీలు ఏర్పాటుచేశారు. ప్రతి యేటా దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి చందర్లపాడులో 17 కులాలకు చెందినవారు కల్యాణంలో ఐకమత్యంగా, సామరస్యంగా పాల్గొంటున్నారు. జిల్లా ధర్మ ప్రచారకులు జయశంకర్, మండల కన్వీనర్ పుల్లారావు, విభాగ్ గో సేవ ప్రముఖ్ అశోక్, జిల్లా బాలవికాస్ ఉపాధ్యాయ కన్వీనర్ పి. హనుమంతరావు, గ్రామ దేవాలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తొమ్మిది మండలాల నుంచి 10,000 మందికి పైగా భక్తులు కల్యాణానికి విచ్చేసారు.

అనంతరం నిర్వాహకులు భక్తులందరికి తీర్థ అన్నప్రసాదాలు, కల్యాణం అక్షింతలు అందచేశారు.

# బాంగ్లాదేశ్ హిందువులకు కవుల సంఘీభావం



**భాగ్యనగర్ :** బాంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసపై నిరసన తెలపడానికి భాగ్యనగరంలోని జాగృతి భవన్‌లో ఉగాది సందర్భంగా మార్చి 31న జాతీయ సాహిత్య పరిషత్ (జాసాప), తెలంగాణ శాఖ నిర్వహించిన కవి సమ్మేళనం వేదికగా మారింది. పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాగృతి పత్రిక సంపాదకులు గోపరాజు నారాయణరావు, విశిష్ట అతిథిగా జాసాప పూర్వ జాతీయ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి పాల్గొన్నారు. ప్రధానవక్తగా పాల్గొన్న ఆచార్య ముదిగొండ శివప్రసాద్ తన ప్రసంగంలో జాసాప ఆవిర్భావ విశేషాలను, ఆవశ్యకతను వివరించారు. బాంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ అనేకమంది కవులు గంభీరమైన కవిత్వాన్ని అందించారు. జాసాప సంఘటనా కార్యదర్శి కృష్ణగౌడ్ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. హిందూ రైటర్స్ ఫోరం ద్వారా సామల కిరణ్ (కరీంనగర్) "ఓ హైందవ! మేలుకో– నీ ధర్మాన్ని ఏలుకో" అనే శీర్షికతో ప్రచురించిన కవితా సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు.

జాసాప కోశాధికారి డాక్టర్ సునీతారెడ్డి శిక్షణలో దివ్యజ్ఞాన నికేతన్ పాఠశాల బాలికలు "రమణీయ రామాయణం" రూపకం ప్రదర్శన గొప్ప సందేశాన్ని అందించింది. చిరంజీవి జయచంద్ర ఛత్రపతి శివాజీ ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. జాసాప గత సంవత్సరకాలంగా నిర్వహిస్తున్న "వక్తల శిక్షణా కార్యక్రమం" గురించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ మూర్తి వివరించారు. రాబోయే కవితా సంకలనం కోసమని "జెండాపై కపిరాజు" అనే శీర్షికను ప్రకటించి కవితలను ఆహ్వానించారు. జాసాప మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో మార్చి 29న మేడ్చల్‌లో ఉగాది సందర్భంగా కవి సమ్మేళనం జరిగింది. ఇందులో 20 మందికి పైగా కవులు, 100కు పైగా సాహిత్య అభిమానులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా డీఈఓ డి.కోట రాధాకిషన్, జాసాప మేడ్చల్ శాఖ అధ్యక్షులు నర్సింహులు, ప్రొఫెసర్ అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.







## 75 మంది రైతులతో భూమి సుపోషణ సదస్సు

**గుంటూరు :** మానవ మనుగడ కొనసాగాలంటే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేయడమే పరిష్కారమని, ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు గ్రామగ్రామాన భూమి సుపోషణ చేయాలని మార్చి 27న పిడుగురాళ్లలో జరిగిన భూమిసుపోషణ గుంటూరు విభాగ్ సదస్సు తీర్మానించింది. సదస్సులో 22 గ్రామాలకు చెందిన 75 మంది రైతులతో గోపూజ, భూమి సుపోషణ కార్యక్రమం జరిగింది.

ఈ సదస్సుకు ప్రాంత గ్రామవికాస్ సంయోజక్ తిరుపతయ్య, విభాగ్ సంయోజక్ నరసింహమూర్తి మార్గదర్శనం చేశారు.

## మనిషి సంస్కార వంతుడు కావాలి





**నారాయణ పేట :** నారాయణపేట, ఎస్ ఆర్ గార్డెన్ మార్చి 30న ఉగాది ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి దక్షిణమధ్య క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదన్నారు. ప్రతి మనిషి సంస్కార వంతుడు కావాలనీ కోరారు. ముఖ్య అతిథిగా హరేరామ హరే కృష్ణ ప్రచార కర్త అద్భుత్ నరసింహ దాస్ మన సంస్కృతి గొప్పతనాన్ని కొనియాడారు. ప్రారంభంలో ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. జిల్లా సహ కార్యవాహ మ్యాడమ్ ప్రభాకర్, నగర కార్యవాహ మరాఠి వెంకట్ రాములు, హిందూ బంధువులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 210 మంది మహిళలతో సహా మొత్తం 746 మంది పాల్గొన్నారు.

### వార్తలు పంపేవారికి మనవి

**జాగృతిలో ప్రచురణ కొరకు వార్తలను పంపేవారు ఈ క్రింది సూచనలు గమనించగలరు**

★ వార్తను సంక్షిప్తంగా, అన్ని వివరాలతో, చక్కని తెలుగులో, వీలైతే డిటిపి చేసి పంపండి.

★ కార్యక్రమం గురించిన ఫోటో తప్పకుండా పంపాలి. వేదిక ఫోటోతో పాటు పాల్గొన్న ప్రజల ఫోటో కూడా పంపాలి.

★ కార్యక్రమం జరిగిన తేదీ ప్రదేశం పేరు, గ్రామం, మండలం, జిల్లా పేర్లను తప్పకుండా తెలపాలి.

★ వార్తను పంపినవారి పేరు, ఫోన్ నెంబరు తప్పక తెలియచేయాలి.

★ వార్తను **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి.

**– సంపాదకుడు**



# బాల జాగృతి

## బాల భక్తులు

### ధ్రువుడు



ఉత్తానపాదుడు అనే మహారాజు పెద్ద భార్య సునీతి కుమారుడు ధ్రువుడు. చిన్న భార్య సురిచి కుమారుడు ఉత్తముడు. ఒకనాడు రాజు చిన్న కుమారుడిని తొడపై కూర్చుండబెట్టుకుని ముద్దులాడుతున్నాడు. ధ్రువుడు తండ్రి రెండవ తొడపై కూర్చోవాలని ఆరాటపడ్డాడు. అక్కడే ఉన్న సవతి తల్లి అందుకు అడ్డుపడింది. 'నీకు తండ్రి తొడపై కూర్చునే యోగ్యత లేదు. నా కడుపున పుట్టి ఉంటే ఆ భాగ్యం దక్కేది. శ్రీహరిని మెప్పించి ఆ యోగ్యత సంపాదించు' అని అంది. ధ్రువుడు తల్లికి తన బాధను వివరించి, తపస్సు కోసం అడవికి బయలుదేరాడు. దారిలో కనిపించిన నారద మహర్షి అతనికి 'నారాయణ' మంత్రం ఉపదేశించాడు. ధ్రువుడి తీవ్ర తపస్సుకు మెచ్చి శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. 'నువ్వు ప్రజారంజకంగా పాలించిన తరువాత అన్ని నక్షత్రాల కంటే ఉన్నత స్థానంలో యుగాల పర్యంతం మెరుస్తుంటావు' అని వరం ఇచ్చాడు. అదే 'ధృవ'తార. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని 'ధ్రువ'తారతో పోల్చడం పరిపాటి.

## కథ | కోపాన్ని నియంత్రించుకోవాలి!

గోవిందనగరి గ్రామంలో రంగయ్య అనే రైతు కొడుకు రమేశ్. పదో తరగతి చదివేవాడు.

రమేశ్ మంచివాడేకానీ కోపిష్టి. కాకపోతే, ఎంత కొట్లాడినా కోపం దిగి పోగానే క్షమాపణ అడుగుతుండేవాడు.

రమేశ్ రోజూ ఇలా గొడవలు తెస్తుండటంతో రంగయ్య అతణ్ణి గట్టిగా మందలించాడు.

'రమేశ్! నీకు కోపం వచ్చినప్పుడల్లా పెరటి తలుపుకి ఓ మేకు కొట్టు' అని చెప్పాడు.

రమేశ్ ఆ తర్వాతి రోజు నుంచే మేకులు కొట్టడం మొదలుపెట్టాడు.

రానురాను ఆ మేకులతో తలుపంతా అందవిహీనంగా కనిపించసాగింది.

ఓరోజు రంగయ్య రమేశ్‌కి అది చూపించి 'ఈ మేకులతో తలుపు చూడటానికి అసహ్యంగా ఉంది కదా! నువ్వు కోప్పడేకొద్దీ ఎదుటివాళ్లు కూడా నిన్ను ఇలాగే చూస్తారు.' అని చెప్పాడు.

'అర్థమైంది నాన్నా.. నన్ను నేను మార్చుకుంటాను!' అన్నాడు. అప్పుడు రంగయ్య 'మంచిదే! నువ్వు కోపాన్ని నిగ్రహించుకున్న ప్రతిసారీ ఒక్కో మేకును తీసేస్తూ ఉండు' అన్నాడు.

రమేశ్ అలాగే తీయడం మొదలుపెట్టాడు.. అతను మేకుని తొలగించిన ప్రతిచోటా తలుపుపైన ఆ మేరకు చిన్న రంధ్రం మిగిలి



## పద్యము

కనగ సొమ్ము లెన్నొ కనకంబదొక్కటి
పసుల వన్నె లెన్నొ పాలొకటియె
పుష్పజాతులెన్నొ పూజయొక్కటె సుమీ
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** ఆభరణములు వేరైనా బంగారం ఒక్కటే. పశువుల రంగుల వేరైనా పాలు ఒక్కటే. సుగంధభరిత పుష్ప జాతులు వేరైనా చేసే పూజ మాత్రం ఒక్కటే. అలాగే శాస్త్ర పరిజ్ఞానం గల పండితులు వేరైనా జ్ఞానం మాత్రం ఒక్కటే.

## శ్లోకము

అల్పానామపి వస్తూనాం
సంహతిః కార్యసాధికా
తృణైః గుణత్వ మాపన్నైః
బధ్యన్తే మత్తదంతినః

**భావం :** చిన్నచిన్న వస్తువులు కూడా సంఘటితమై కార్యాన్ని సాధించవచ్చు. కొన్ని గడ్డిపరకలు కలిసి తాడుగా మారి మదపుటేనుగును బంధిస్తున్నాయి కదా!

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| మిత్తో ఫోబియా | ఎడారులు |
| ఫోనో ఫోబియా | అబద్ధాలు |
| ఆస్ట్రో ఫోబియా | శబ్దం |
| గ్జీరోఫోబియా | మురికి |
| రూపో ఫోబియా | అంతరిక్షం |

జవాబులు : మిత్తో ఫోబియా–అబద్ధాలు; ఫోనో ఫోబియా–శబ్దం; ఆస్ట్రో ఫోబియా–అంతరిక్షం; గ్జీరోఫోబియా–ఎడారులు; రూపో ఫోబియా–మురికి.

నిర్వహణ : నయనశ్రీ

## శాస్త్రవేత్తలు

## శాంతి స్వరూప్ భట్నాగర్ (1894-1955)



భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తల్లో శాంతి స్వరూప్ భట్నాగర్ కూడా ఒకరు. ఈయనను పరిశోధనా శాలల పితామహుడిగా పేర్కొంటారు. రసాయనశాస్త్రంలో అనేక ఆవిష్కరణలు చేశారు. అయస్కాంతత్వం, ఎమల్షన్లపై అధ్యయనం చేశారు. ఈ పరిశోధనల ద్వారా మిశ్రమాలు, కొల్లాయిడ్లు, అయోడిన్, మెర్క్యురీ, సెలీనియం మూలకాల పరమాణుతత్వాన్ని కనుగొన్నారు. భారతదేశంలో విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు నాందిగా నిలిచిన సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్) స్థాపనలో విశేష కృషి చేశారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఎక్స్ కిరణాలు కనుగొన్న శాస్త్రవేత్త?
2. ప్రపంచ న్యాయ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. భారతదేశంలో అతి శీతల ప్రాంతం ఏది?

సమాధానాలు : 1. రాంట్ జెన్; 2. జూలై 17; 3. ద్రాస్ సెక్టార్ (జమ్ముకశ్మీర్)



పోయింది. రమేశ్ కోపం తగ్గి, మేకులన్నింటినీ తీసేసినా వాటి తాలుకు రంధ్రాలు తలుపునిండా మిగిలిపోయాయి.

అప్పుడు రంగయ్య రమేశ్ భుజం మీద చేయివేసి 'నువ్వు ఎదుటివాళ్లపైన కోపం చూపినప్పుడల్లా వాళ్ల మనసులో నువ్వు ఓ మేకుని దించినట్టే. ఆ తర్వాత చెప్పే క్షమాపణ కొట్టిన మేకుని తీయడం లాంటిది. నువ్వెంత నిజాయతీగా, శ్రద్ధగా మేకుని తీసినా ఎదుటవాళ్ల మనసుపైన ఇలాంటి చిల్లు ఒకటి మిగిలిపోతుంది. కాబట్టి, ఎవరిపై అనవసరంగా కోప్పడకూడదు..!' అని చెప్పాడు.

తండ్రి రంగయ్య మాటల్లోని నిజాన్ని గ్రహించిన రమేశ్ మరెప్పుడు ఇతరుల మీద కోపాన్ని ప్రదర్శించలేదు. ★

## మెదడుకు మేత

పైన చూస్తే పండు, పగుల గొడితే బొచ్చు?

జవాబు : పత్తి కాయ


## మంచిమాట

**ఇతరుల ఓటమి నీ గెలుపు కాదు. అలానే, ఇతరుల గెలుపు నీ ఓటమి కాదు.**




# వారఫలాలు

7-13 ఏప్రిల్ 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకుని అందరి దష్టిని ఆకర్షిస్తారు. సోదరులతో విభేదాలు ప్రతి నిర్ణయంలోనూ ఆచితూచి ముందుకు సాగండి. వ్యాపారాలు సాదాసీదాగా కొన సాగుతాయి. ఆశించిన లాభాలు కనిపించక అయో మయంలో పడతారు. ఉద్యోగ విధి నిర్వహణ లో సహచరుల సహాయం కోరతారు. రచయితలు, కీడా కారులకు ఒత్తిడులు. 11,12 తేదీల్లో ధనలాభం. వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దేవీఖడ్గమాల పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఆశించిన అవకాశాలు కష్టసాధ్యమే. కొంత నలత చేసి ఇబ్బంది పడతారు. వ్యాపారాలు మొదట్లో కొంతమేర లాభించినా క్రమేపీ నిరాశ చెందుతారు. పారిశ్రామికవేత్తలు, కళా కారులకు గందరగోళంగా ఉంటుంది. వైద్యులు, క్రీడాకారులకు నిరాశ. 7,8 తేదీల్లో శుభవర్త మానాలు. స్వల్ప ధనలాభం. కార్యజయం. ఆదిత్య హృదయం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

సహనంతో మెలగడం మంచిది. శారీరక రుగ్మతలు బాధపెట్టవచ్చు. వ్యాపారాలు సామాన్యంగా కొనసాగుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు ఎదురుకావచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు విదేశీ పర్యటనల్లో ఆటంకాలు. రచయితలు, వ్యవసాయదారులకు ఇబ్బందికరంగా గడుస్తుంది. 8,9 తేదీలలో ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. సంఘంలో గౌరవం. వాహనయోగం. శివాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆరోగ్యం గతం కంటే కొంత మెరుగ్గా ఉంటుంది. వ్యాపారులు లాభాలు గడిస్తారు. నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు .ఆశించిన విధంగా పదో న్నతులు రాగలవు. పైస్థాయి వారి ప్రశంసలు అందు తాయి. రాజకీయవేత్తలు, పరిశోధకులకు విశేష ఆదరణ లభిస్తుంది. సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తల కృషి ఫలిస్తుంది. 7,8 తేదీల్లో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రావలసిన డబ్బు అందక ఇబ్బందులు పడతారు. రుణాలు సైతం సకాలంలో అందవు. ఆరోగ్యం కొంత మందగిస్తుంది. వ్యాపారాలలో లాభనష్టాలు సమానంగా భరించాల్సి ఉంటుంది. ఉద్యోగులు విధుల్లో మరింత బాధ్యతాయుతంగా మెలగడం మంచిది. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలు వాయిదా. 9,10తేదీల్లో విందు వినోదాలు.ఆంజనేయ దండకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

వివాదాలను అత్యంత నేర్పుగా పరిష్కరించు కుంటారు. ఆరోగ్యం కొంత మెరుగుపడి ఊరట చెందుతారు. ఉద్యోగులకు పైస్థాయి వారి ప్రోత్సాహం పారిశ్రామికవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. క్రీడాకారులు, సాంకేతిక వర్గాల వారికి విదేశీపర్యటనలు. 8,9 తేదీలలో అయినవారితో వివాదాలు. చోరభయం. శ్రీ శివప్రాతఃస్మరణ స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కుటుంబంలో మీదే పైచేయిగా ఉంటుంది. అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తారు. ఉద్యోగులకు కోరుకున్న అవకాశాలు దగ్గరకు వస్తాయి. ప్రమోషన్లు దక్కవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహం. రచయితలు, సాంకేతిక వర్గాలకు శుభవర్తమానాలు. 11,12 తేదీలలో దూర ప్రయా ణాలు. కొన్ని చికాకులు ఎదురవుతాయి. ధనవ్యయం. శివాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన విద్య,ఉద్యోగావకాశాలు పొందుతారు. రెండు మూడువిధాలుగా ధనప్రాప్తి కలిగే అవకాశం. కుటుంబసభ్యుల ప్రేమను చూరగొంటారు. కొత్త పెట్టు బడులు సమకూరి విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. రాజకీయవేత్తలు, కళాకారులకు విదేశీ పర్యటనలు. 7,8 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఒప్పందాలలో ఆటంకాలు. అనారోగ్యం. విష్ణుధ్యానం చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆలోచనలు అంతగా కలసిరావు. కొంత సొమ్ము అందినా అవసరాలకు సరిపడక కొత్తగా అప్పులు చేస్తారు. లేనిపోని ఖర్చులు మీదపడవచ్చు, కొంత ఓపిక,సహనం అవసరం. లేనిపోని వివాదాల జోలికి వెళ్లవద్దు. వైద్యులు, రాజకీయవేత్తలకు ఇబ్బందులు ఎదురవుతాయి. 10,11 తేదీల్లో శుభవార్తా శ్రవణం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అవసరాలుతీరక ఇబ్బందిపడతారు. భాగస్వాము లతో మాట పట్టింపుల వల్ల కొంత మందగిస్తాయి. ఉద్యోగులు ఆశించిన పదోన్నతులు దక్కక డీలా పడతారు. పారిశ్రామికవేత్తలు,కళాకారులు విదేశీ పర్యటనలు వాయిదా వేసుకుంటారు. రచయితలు, వ్యవసాయదారుల కృషి ఫలప్రదం కాకపోవచ్చు. 7,8 తేదీల్లో కీలక నిర్ణయాలు. ధనప్రాప్తి. . విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆస్తుల విషయంలో ఒప్పందాలు కుదురుతాయి. విద్య, ఉద్యోగావకాశాలు దక్కించుకుంటారు. నూతన భాగస్వాములతో ఒప్పందాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో ఆశించిన మేరకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు దక్కుతాయి. రాజకీయవేత్తలు, కళా కారులు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 11,12 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా లేదా రద్దు. ఖర్చులు. కాలభైరవాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పెద్దల సూచనలు, సలహాల మేరకు నిర్ణయాలు తీసుకుంటారు. అనారోగ్యం కలిగినా ఉపశమనం పొందుతారు. వ్యాపారాలలో. క్రమేపీ లాభాల బాటలో నడుస్తారు. నూతన పెట్టుబడులకు సమయ మిదే. ఉద్యోగాలలో హోదాలు పారిశ్రామికవేత్తలు, కళాకారులకు విదేశీ పర్యటనలు. రచయితలు, క్రీడాకారుల ఆశలు నెరవేర తాయి. 7,8తేదీల్లో వృథాఖర్చులు. మానసిక ఆందో ళన. సోదరులతో కలహాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం - 508

## ఆధారాలు

**అడ్డం**

1) సంపన్నులు (4)
5) అవసరానికంటే చాలా ఎక్కువ ఉంటే ఇలా అంటారు (6)
6) అండ, తోడ్పాటు (3)
7) పెద్ద చప్పుడుతో మారుమోగు (4)
9) ప్రముఖ చిత్రకారుడు బాపు సృష్టించిన కొంటె బాలుని పాత్ర (3)
10) భయంతో కానీ చలితో కానీ కంపించు (3)
12) ఒక సంఘటన గురించి పూర్తి వివరాలు లోతుగా తెలుసుకుంటుంటే – తీయడమంటారు (2)
13) వంటవానిగా భీముని మారుపేరు (4)
15) కచ్చితంగా జరిగేది (2)
16) పద్యపాదాన రెండో అక్షరం తిరగబడింది (2)
18) ఒక నక్షత్రం (2)
20) చిన్న వెదురుకర్రలు చేతిలో ఉంచి ఆడే ఆట (3)
22) నత్తు (3)
23) నిట్టనిలువు (3)
24) పెదవి (2)
25) విభిన్నత (3)
26) ఎద్దు అరుపు (12)

**నిలువు**

1) మర్యాదా పురుషోత్తముని మహనీయ పర్వదినం (6)
2) చిట్టచివరికి (5)
3) తేరుకొను (4)
4) తడబడు అడుగులు (6)
8) నేరుగా పైకి (4)
11) సారం, సత్తువ (2)
14) కొంటెవాడు (4)
15) విషయాన్ని వ్యతిరేకించడం తలక్రిందులైంది (4)
17) ఒక వర్గానికి / ప్రాంతానికి నాయకత్వం / బాధ్యత వహించడం (4)
19) తెలుగు సంవత్సరాలు ఎన్ని? (3)
21) పైకి లేచిన అల (3)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ | ■ | 4 | ■ |
| | ■ | | ■ | 5 | | | | | |
| 6 | | | ■ | ■ | | ■ | ■ | | ■ |
| | ■ | 7 | | 8 | | ■ | 9 | | |
| 10 | | | ■ | | ■ | 11 | ■ | | ■ |
| | ■ | ■ | 12 | | ■ | 13 | 14 | | |
| ■ | 15 | | ■ | 16 | 17 | ■ | | ■ | ■ |
| 18 | | ■ | 19 | ■ | | ■ | 20 | | 21 |
| ■ | 22 | | | ■ | 23 | | | ■ | |
| 24 | | ■ | 25 | | | ■ | ■ | 26 | |

## పదరసం - 507 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వి[1] | శ్వా | వ[2] | సు | ■ | అ[3] | ■ | ప్రే[4] | ■ | తి[5] |
| ప్ర | ■ | క | ■ | చి[6] | ర | స్మ | ర | ణీ | యం |
| ల[7] | క | డ | పీ[8] | ■ | కొ | ■ | ణ | ■ | జ |
| బ్ధ | ■ | ■ | నా[9] | సి | ర | కం[10] | ■ | కో[11] | పై |
| ■ | రూ[12] | ప[13] | సి | ■ | ■ | ట[14] | ప్పొ | త | ■ |
| పం[15] | ■ | ధం | ■ | పు[16] | ము | గిం | ■ | ల | ■ |
| టో[17] | క | రా | ■ | దీ | ■ | పు[18] | ష్క | రా | లు |
| టా | ■ | అ[19] | రి[20] | నా | కా[21] | ■ | ■ | యు | ■ |
| ప[22] | తి[23] | ■ | ధి | ■ | ఆ[24] | ట | వి[25] | డు | పు[26] |
| ■ | అ[27] | న్యా | ప | దే | శం | ■ | త్తు | ■ | ట్ర |



మోహన్ లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ 2019లో 'లూసిఫర్' మూవీని తెరకెక్కించాడు. కేరళలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొన్న సమయంలో అక్కడ నుంచి దూరంగా వెళ్లిపోయిన స్టీఫెన్ నెడుంపల్లి ఉరఫ్ ఖురేషీ అబ్ రామ్ తిరిగి తన రాష్ట్రానికి వచ్చి పరిస్థితులను చక్కదిద్దడం ఆ చిత్రకథ. 'లూసిఫర్' మంచి పేరును, విజయాన్ని పొందింది. ఆ ఉత్సాహంతో పృథ్వీరాజ్ 'లూసిఫర్'కు సీక్వెల్ గా 'ఎల్ 2: ఎంపురాన్' మూవీని తెరకెక్కించాడు. మార్చి 27న ఈ సినిమా వివిధ భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది.

# వివాదాలు రేపుతున్న ఎల్ 2: ఎంపురాన్

మనసులో కొంతకాలంగా పేరుకు పోయిన కల్మషాన్ని దర్శకుడు పృథ్వీరాజ్, రచయిత మురళీ గోపీ ఈ సీక్వెల్‌లో ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. కేరళ రాజకీయాలలో జాతీయ పార్టీల ప్రమేయాన్ని అడ్డుకుంటూ, హిందుత్వ వాదాన్ని దక్షిణాదిలో బలపడకుండా చేయాలనే వారి కుట్ర ఇందులో కనిపిస్తోంది. పక్కా పొలిటికల్ ఎజెండాతో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో తెలిసో తెలియకో మోహన్ లాల్ సైతం భాగస్వామి అయిపోయారు. ఈ సినిమాను చూసిన మోహన్ లాల్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆయన తప్పును గ్రహించి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇంతలోని అభ్యంతరకర సన్నివేశాలపై వచ్చిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని, రీ-సెన్సార్ చేసి, కొన్ని సన్నివేశాలను తొలగించబోతున్నట్టు సి.బి.ఎఫ్.సి. తెలిపింది.

'ఎల్ 2: ఎంపురాన్' కథ గోద్రాలో కరసేవకులు ప్రయాణిస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్ దహనంతో మొదలవుతుంది. దీనికి ఎవరు కారకులు ఎవరు అనేది మాత్రం దర్శకుడు ఎక్కడా చూపించే ప్రయత్నం చేయలేదు. ఈ దుర్ఘటనతో ఆగ్రహించిన హిందువులు, వారి నాయకుడు బల్‌రాజ్ పటేల్... ముస్లింలను దారుణంగా హింసిస్తారు. మహిళలను మానభంగం చేస్తారు. తన కుటుంబ సభ్యులను అతి క్రూరంగా హతమార్చిన బల్‌రాజ్ పటేల్‌పై పగ తీర్చుకోవాలని జాయేద్ మసూద్ రగిలిపోతుంటాడు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలో చేరిన అతన్ని, తన దగ్గరకు తెచ్చుకుని, భారత సైన్యంలో చేర్చుతాడు ఖురేషీ. ఆ తర్వాత కొన్నేళ్లకు బల్‌రాజ్ పటేల్ జాతీయ రాజకీయాలలోకి అడుగుపెట్టి, బాబా బజరంగీగా మారి దేశ రాజకీయాలను శాసిస్తుంటాడు. అతని చూపు కేరళ మీద పడుతుంది. అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్న పీకే రాందాస్ కొడుకు జతిన్‌ను తన వైపు తిప్పుకుని అతనితో ప్రాంతీయ పార్టీని పెట్టిస్తాడు. జతిన్, బాబా బజరంగీ చేతులు కలిపితే కేరళ వినాశనం తప్పదని భావించిన ఖురేషీ, జాయేద్‌కు పాత పగను గుర్తు చేసి, బజరంగీని హతమార్చేలా పురిగొల్పుతాడు. గుజరాత్ అల్లర్ల కారణంగా అశాంతికి లోనైన జాయేద్ మనశ్శాంతిని పొందాడా? కేరళలో హిందుత్వ పార్టీ అడుగు పెట్టడాన్ని వ్యతిరేకించిన అక్కడి రాజకీయ నాయకుల కోరిక నెరవేరిందా? అనేది మిగతా కథ.

తలా తోక లేకుండా కేవలం తమ వెర్రిమొర్రి అభిప్రాయాలను తెర మీద చూపించి, ప్రేక్షకులను తమ వైపు తిప్పుకోవడం తప్ప ఈ చిత్రదర్శకుడు, రచయితకు మరే లక్ష్యం లేదనిపిస్తోంది. పై పైన చూస్తే... ఇది పగ ప్రతీకారాలు, రాజకీయ పరమైన కుతంత్రాలు, మతతత్త్వ పార్టీలతో వచ్చే ముప్పులు... వీటిని బేస్ చేసుకుని రాసుకున్న కథగానే కనిపిస్తుంది. కానీ రచయిత మురళీ గోపీ, దర్శకుడు పృథ్వీరాజ్ హిడెన్ ఎజెండా వేరు. కేరళలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ పార్టీలు ఉండాలి తప్పితే మరొకరు ఉండకూడదు. అందుకే కమ్యూనిస్టుల పనికూడా అయిపోయిందనే ఈ సినిమాలో చూపించారు. దాంతో కేరళలోని కమ్యూనిస్టులు సైతం కొందరు ఈ సినిమాను వ్యతిరేకించారు. ఇక కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వారు అధికారం కోసం పడే ఆరాటం కారణంగానూ, దానిని నిలబెట్టుకోవడానికి అవినీతికి పాల్పడడం వల్లనూ... హిందుత్వ శక్తులు కేరళలో బలపడతాయి తస్మాత్ జాగ్రత్త అని జనాలకు చెప్పే ప్రయత్నం దర్శకుడు చేశాడు. హిందూ మతోన్మాదం అంటూ బీజేపీని టార్గెట్ చేశారు! ఎట్టి పరిస్థితులలో ఆ పార్టీ కేరళలో నిలదొక్కుకోకూడదనే ఉన్మాదమే ఈ సినిమా అంతటా కనిపించింది. అందుకోసం అర్థంపర్థం లేని గుజరాత్ అల్లర్లను ఓ ఆయుధంగా మలుచుకున్నారు. ఇక మోహన్ లాల్ పోషించిన ఖురేషీ పాత్ర నేపథ్యం, అతి తిరిగే మలుపులు గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.

ఇవాళ కేంద్రంలో ఉన్న ఏ రాజకీయ నాయకునికీ గుజరాత్ అల్లర్లలో సంబంధం లేదని ప్రత్యేక న్యాయస్థానాలు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా... మళ్లీ పాత పాటనే అందుకుని కూనిరాగాలు తీసే ప్రయత్నం దర్శకుడు చేశాడు. అయితే ఇవాళ దేశవ్యాప్తంగా హిందువులలో జాగరూకత వచ్చింది. కమ్మీలు, కాంగ్రెస్ వాళ్లు చేసే దుష్ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదు. ఈ సినిమాలోనూ అలాంటి ధోరణి కనిపించడంతో నిర్మొహమాటంగా దీనిని ఖండించారు. తప్పుదిద్దుకోమని హెచ్చరించారు. దాంతో ఇవాళ ఈ సినిమా మేకర్స్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక మాదిరి అయిపోయింది. రచయిత మురళీ గోపీ ఎవరేమనుకున్నా తగ్గేదేలే అంటూ గంభీర వచనాలు పలికితే, మోహన్ లాల్ యూనిట్ తరఫున క్షమాపణలు వేడుకున్నాడు. తన కొడుకును బలి పశువును చేస్తున్నారని దర్శకుడు పృథ్వీరాజ్ తల్లి వాపోయింది. నిజానికి దర్శకుడి ప్రమేయం లేకుండా ఏ సన్నివేశం తెరకెక్కదు. అతను పచ్చ జెండా ఊపకుండా ఏ రచయిత తన భావలను కథలో చొప్పించలేదు.

కాబట్టి... 'ఎల్ 2: ఎంపురాన్'కు సంబంధించిన తప్పొప్పులకు పృథ్వీరాజ్ సుకుమారన్ సైతం బాధ్యత వహించాల్సిందే. ఇక మీదట ఇలాంటి సినిమాలను తీయాలనుకునే వారికి 'ఎంపురాన్' పై వ్యక్తమైన నిరసన ఓ పాఠం కావాలి.

**అరుణ**
సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



# ఇలపై ఇంద్రధనుస్సు


ఇంద్రధనుస్సు నేలపైకి దిగి వచ్చింది. నేల రంగుల తివాచీగా మారింది. వసంత రుతువు జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌కు పుష్ప సమయాన్ని తీసుకొచ్చింది. ఆసియాలో అతి పెద్ద తులిప్ ఉద్యానవనంగా ప్రసిద్ధికెక్కిన ఇందిరాగాంధీ స్మారక ఉద్యానవనం వేర్వేరు రంగుల్లో విరబూసిన 17 లక్షల తులిప్ పుష్పాలతో పర్యాటకులను తులిప్ వేడుకకు స్వాగతం పలుకుతోంది. వనంలో లక్షలాది తులిప్ పుష్పాలు ప్రతి సంవత్సరం వసంత రుతువులో 20 రోజులు మాత్రమే విరబూసి ఉంటాయి. తులిప్ ఉద్యానవనం మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్ 15 వరకు సందర్శకులను ఆకట్టుకుంటోంది.




From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 24


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.300/-




వెల : ₹.300/-





వెల : ₹.100/-





వెల : ₹.160/-




వెల : ₹.200/-





వెల : ₹.499/-





వెల : ₹.300/-





వెల : ₹.120/-





వెల : ₹.300/-





వెల : ₹.180/-





వెల : ₹.350/-





వెల: PB ₹.550/-




వెల :₹.450/-




వెల : ₹.549/-




వెల : ₹.150/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722.

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01